thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 156 | కరీంనగర్ గురువారం, 14 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఢిల్లీ పెత్తనాన్ని ఎప్పటికీ అనుమతించం..

చెన్నై: ఢిల్లీ నుండి రాష్ట్రంపై పెత్తనం చెలాయించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సేలంలోని మోహన్‌కుమారమంగళం ప్రభుత్వ వైద్యకళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రూ.880 కోట్లతో నిర్మించనున్న జౌళి పార్కుకు, రూ.100 కోట్లతో నిర్మించనున్న కొత్త గ్రంథాలయ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.225 కోట్లతో పూర్తయిన పథకాలకు ప్రారంభోత్సవం చేసిన ఆయన 1,01,203 మంది లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మదురైలో పర్యటించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేశారన్నారు.




హైదరాబాద్: తెలంగాణ అంతటికీ ఇవాళ, రేపు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురం భీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. "నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్‌ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశాం. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయి" అని నాగరత్న తెలిపారు.




దిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలను భారత రాష్ట్ర సమితి నేత దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. నేడు తీర్పు వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది.




## మిమ్మల్ని తరిమికొట్టకపోతే.. రాజకీయాల నుంచి తప్పుకుంటా

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, ప్రభుత్వంపై మాటల దాడికి దిగుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఆరు గ్యారెంటీతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ప్రముఖ మీడియా హౌస్‌కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన ఇంటర్వ్యూ వీడియోను 'గొప్ప వాగ్దానాల నుంచి ఘోర వైఫల్యాల వరకు!' ట్యాగ్ లైన్‌తో షేర్ చేస్తూ.. ఆరు గ్యారంటీలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ఓటర్లను 'కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను కాపాడుకోమని' ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ఉద్వేగభరితంగా విజ్ఞప్తి చేసిన సంగతి గుర్తుందా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్క వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నెరవేరుస్తామని హామీ ఇచ్చారని ఆరోపించారు. కానీ, రెండేళ్లు అధికారం తర్వాత అన్ని వాగ్దానాలు నేరవేర్చామని చెబుతున్నారని ఫైర్ అయ్యారు. భట్టి గారు.. తెలంగాణలో ఏ గ్రామంలోనైనా వెళ్లి అదే మాట ప్రజలతో చెప్పగలరా అంటూ సెటైర్లు వేశారు. ఇప్పటికే, అబద్ధాలు ఆడిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు చీకొడుతున్నారని కామెంట్ చేశారు. మీరు, కేబినెట్ మంత్రులు, తెలంగాణలో ఏ గ్రామంలోనైనా వెళ్లి.. ఆరు గ్యారంటీలను దాదాపు అన్నింటినీ నెరవేర్చామని చెప్పే దమ్ముందా అని అన్నారు. ఒకవేళ అలా చెబితే.. ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టకపోతే.. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ ట్వీట్ చేశారు.



## ప్రభుత్వ చర్యలు భేష్..

### కంచెగచ్చిబౌలి భూముల కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పరిరక్షణ చర్యల విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను స్వాగతిస్తున్నామని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని పర్యావరణ పరిరక్షణ కూడా పరిగణలోకి తీసుకోవాలని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. సంచలనం సృష్టించిన కంచెగచ్చిబౌలి భూముల అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ భూముల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలపై గతంలోనే తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. తాజాగా ఈ భూముల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలను తయారు చేస్తుట్లు కోర్టుకు తెలిపింది. ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పర్యావరణం, వన్యప్రాణుల రక్షణకోసం చర్యలు తీసుకోవాలి. పర్యావరణం కోసం రాష్ట్రం చేస్తున్న చర్యలను అభినందిస్తున్నాం. అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు.. పర్యావరణాన్ని సమతుల్యం చెయ్యాలి. పర్యావరణాన్ని కాపాడేందుకు సరైన ప్రతిపాదనలను సిద్ధం చేయండి. పర్యావరణాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటే.. అన్ని ఫిర్యాదులను ఉపసంహరిస్తాం. నా రిటైర్మెంట్ లోపల వీటన్నింటికీ పరిష్కారం చూపాలి' అని వ్యాఖ్యలు చేశారు. అయితే సమగ్ర ప్రణాళికను అందించేందుకు 6 వారాలు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వి కోర్టును కోరగా ఇందుకు న్యాస్థానం అంగీకరించింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.

# లోకల్ వార్‌కు... సిద్ధమవుతున్నారు!




# సర్పంచ్ ఆశావహులకు గుడ్ న్యూస్..

## పంచాయతీ ఎన్నికలపై కీలక అప్‌డేట్

హైదరాబాద్ : సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులకు గుడ్ న్యూస్. స్థానిక సంస్థల ఎన్నికలపై మరో కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు గాను గుజరాత్ నుంచి రాష్ట్రానికి 37,530 బ్యాలెట్ బ్యాక్సులు వచ్చాయి.

అయితే, అధికారులు నేడు లేదా రేపు జిల్లాల వారీగా పంపిణీ చేయనున్నట్లుగా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. మరో వైపు విద్య, ఉద్యోగ, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. తెలంగాణ చట్ట సభల్లో ఆమోదించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ నుంచి నేరుగా రాష్ట్రపతికి చేరింది. బీసీ రిజర్వేషన్ల ఆమోదం విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తెలంగాణ కాంగ్రెస్, బీసీ సంఘాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా చేపట్టాయి. కానీ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడంతో బీసీ రిజర్వేషన్ల అంశంపై కీలక అడుగు వేయబోతోంది. పార్టీ పరంగా బీసీకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై ఈ నెల 18న కేబినెట్ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించే అవకాశం ఉంది.

ఈ మేరకు రేపు ఆయన పంచాయతీ రాజ్ అధికారులతో భేటీ అవుతుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.



# నీళ్ళిచ్చేదే లేదు

## ఉగ్రవాదంపై మీ బుద్ధి మారేవరకు నో వాటర్..

## పాకిస్తాన్‌కు తేల్చి చెప్పేసిన భారత్!!

భారత్‌పై పాక్ ఉగ్రవాద దాడుల నేపథ్యంలో పాకిస్తాన్‌కు సింధూ జలాలను ఆపేస్తూ.. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై ఓ వైపు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మాజీ మంత్రి బిలావల్ భుట్టో బెదిరింపులకు పాల్పడుతుండగా..మరోవైపు తమకు నీటిని విడుదల చేయాలని ఆ దేశ విదేశాంగ శాఖ భారత్‌ను వేడుకుంటోంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాక్‌కు నిలిపివేసిన సింధూ జలాల సరఫరాను తిరిగి పునరుద్ధరించాలని ఆ దేశ విదేశాంగ శాఖ తాజాగా భారత్‌ను కోరింది. ఈ ఒప్పందాన్ని నమ్మకంగా, న్యాయబద్ధంగా కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిపింది. అయితే ఇప్పటికే తీర్పును తిరస్కరిస్తున్నట్టు భారత్ ప్రకటించింది.

**ఆసిం మునీర్, బిలావల్ భుట్టో ప్రేలాపనలు...** మొన్న పాకిస్తాన్ సైన్యాధిపతి అసీం మునీర్ భారత్‌పై అణు హెచ్చరికలు చేస్తూ.. నోరు పారేసుకున్నాడు. భారత్ అనేది హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. కానీ.. పాకిస్థాన్ మాత్రం కంకరతో నిండిన ఓ డంప్ లారీలాంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం? అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నాడు.

ఇక ఆ దేశ విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సైతం భారత్‌పై పిరికిపంద ప్రేలాపనలు చేశాడు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగితే.. యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికాడు.

**ప్లీజ్ నీళ్లవ్వండి.. అడుక్కుంటున్న పాక్...** అటు పాక్ ఆర్మీ చీఫ్, ఆ దేశ మాజీ మంత్రి బిలావల్ భుట్టోలు.. యుద్ధం, అణ్వస్త్రాలు అంటూ మైకుల ముందు రెచ్చిపోతుంటే.. మరోవైపు నీటిని విడుదల చేయండి మహా ప్రభో అంటూ భారత్‌ను.. పాక్ విదేశాంగ శాఖ అభ్యర్థిస్తోంది. పాక్ కపట నాటకాలకు ఇది అద్దం పడుతోంది. అందితే జట్టు, అందకపోతే కాళ్లు అనే దాని మనస్తత్వాన్ని తెలియజెబుతున్నాయి అంటున్నారు నిపుణులు.. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును మన దేశం నిలిపివేయడంతో... పాకిస్తాన్‌కు నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. పాక్‌లోని జలాశయాల్లో నీటిమట్టం దారుణంగా పడిపోయింది. ఇక వాటినుంచి నీటిని తీసుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. గతేడాదితో పోలిస్తే సింధు బేసిన్‌లో నీటి ప్రవాహం 15 శాతం తగ్గింది. వేసవిలో పంటలు ఎండి కష్టాల్లో పడిన రైతులకు ఖరీఫ్‌లో కష్టాలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. భారత్ నిర్ణయంతో 21 శాతం నీటి కొరత ఏర్పడుతుందని పాక్ అంచనా వేసింది. అయితే ఉగ్రవాదంపై పాక్ తీరు మారే వరకూ ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసింది. ఓవైపు అణ్వాయుధాలు, యుద్ధం అని రంకెలు వేస్తున్న పాక్%ౌ%మరోవైపు నీళ్ల కోసం భారత్‌కు సలాం కొట్టి గులాంలా దేబిరిస్తోంది. అయితే ఉగ్రవాదం- శాంతి ఒకే ఒరలో ఉండవని, పాక్‌కు ముఖం మీద కొట్టినట్లు తేల్చిచెప్పేసింది భారత్..



# భాగ్యనగరంలో జోరు వాన

హైదరాబాద్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఎస్సార్ నగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, పంజాగుట్ట, బోరబండ, యూసఫ్ గూడా, దుండిగల్, గండిమైసమ్మ, మల్లంపేట, బహదూర్‌పల్లి, సూరారం, కొంపల్లి, సుచిత్ర, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, బాలానగర్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, జవహర్ నగర్, బొల్లారం, ప్యాట్నీ, పారడైజ్, చిలకలగూడ, మారేడుపల్లి, కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, నాంపల్లి, బషీర్ బాగ్, హిమాయత్ నగర్, నారాయణ గూడ, ట్యాంక్ బండ్, సైదాబాద్, చంపాపేట్, సరూర్ నగర్, సంతోష్ నగర్, లంగర్ హౌస్, గుడిమల్కాపూర్, గోల్కొండ, జియాగూడ, మెహదీపట్నం, ఆసిఫ్ నగర్, పాతబస్తీ, చార్మినార్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, బార్కస్, ఉప్పుగూడ, ఛత్రినాక ప్రాంతాల్లో వర్షం పడుతోంది. దీంతో నగరవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో బుధ, గురువారాల్లో ఒంటిపూట బడులు నడపాలని ఆదేశించారు. పిల్లల్ని మధ్యాహ్నం ఇంటికి పంపించేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఐటీ ఉద్యోగులు, ఇతర సిబ్బందికి బుధవారం ఇంటి నుంచి పని చేసే అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుండపోత వానలతో నగరంలోని రోడ్లు జలమయమై, ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందనే అంచనాలతో సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది.

# ప్రజలకు హైడ్రా కమిషనర్ కీలక సూచన



హైదరాబాద్, ఆగస్ట్ 13: భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అవసరమైతే తప్పా.. బయటకు రావద్దని హైదరాబాద్ నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురవనున్నాయంటూ వాతావరణ శాఖ తెలిపిందని.. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు.

బుధవారం హైదరాబాద్‌లో రంగనాథ్ మాట్లాడుతూ.. ఎంతటి విపత్తు ఎదురైనా.. వాటిని ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్ అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని ఆయన వివరించారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు వస్తే.. ప్రజలను రక్షించేందుకు బోట్స్‌తో సహా అన్నింటిని సిద్ధం చేశామని చెప్పారు. అయితే రాత్రి సమయంలో వర్షపాతం అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉండడంతో.. ఈ రోజు రాత్రి నుంచి హైడ్రా బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

నాలాల కబ్జాల కారణంగానే రహదారులపైకి భారీగా వరద నీరు వస్తుందని ఆయన తెలిపారు. ఇక ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 400కి పైగా వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నాయన్నారు. అలాగే మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ఇప్పటికే సిబ్బంది ఉన్నారన్నారు. ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే.. సహాయక చర్యల్లో పాల్గొనాలని యువతకి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

# తెలంగాణపై కేంద్రం వివక్ష: మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్: తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన ప్యాకేజింగ్ కంపెనీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు, రాయితీలు ఇచ్చేందుకు ఆమోదిస్తూ అన్ని అనుమతులను రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. అయినా కానీ, కేంద్ర క్యాబినెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఏపీలో మాత్రం ఇలాంటి ప్రాజెక్టుకే కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.

అయితే అక్కడ ఇప్పటివరకు ఎలాంటి భూకేటాయింపులు జరగలేదని, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనా వారికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. కేంద్రం ఇలాంటి చర్యల వల్ల అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి రాజకీయ నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని, కేంద్ర వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం తూర్పారబడుతుందన్నారు.

# వర్షాల్లో వైద్య సేవలు నిరవధికంగా కొనసాగించండి.. మంత్రి దామోదర ఆదేశాలు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి ఇవాళ నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షసూచన ఉన్నందున ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరన్స్ నిర్వహించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఆర్‌ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా హాస్పిటల్స్‌లోనే ఉండాలని.. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు మంత్రి దామోదర రాజనర్సింహ. అందరి సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ దగ్గరగా ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీలను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలని మార్గ నిర్దేశం చేశారు మంత్రి దామోదర రాజనర్సింహ. హాస్పిటళ్లలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, కరెంట్ పోయిన మరుక్షణమే జనరేటర్స్ ఆన్ చేసి రోగులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎలక్ట్రీషన్లను 24 గంటలు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో హాస్పిటల్స్ లోపలకు నీరు చేరకుండా, నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులంతా ఈ మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు.



# వీధి కుక్కలపై సుప్రీం తీర్పు.. నేను పరిశీలిస్తా

దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. దిల్లీలో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టంచేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని స్పష్టం చేసింది. సుప్రీం తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. "దిల్లీలో 3 లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో దిల్లీ ప్రభుత్వం ఉందా?" అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా మనం అనుసరిస్తూ వచ్చిన మానవీయ, సైన్స్ ఆధారిత విధానాల నుంచి వెనకడుగు వేసినట్లుగా ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "వీధి కుక్కలన్నింటినీ గంపగుత్తగా తొలగించాలన్న నిర్ణయం క్రూరమైనది" అని అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ, ప్రముఖ సినీనటులు జాన్ అబ్రహాం, జాన్వీ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ ఆనంద్, అడివి శేష్ తదితరులు వీధి కుక్కల సంరక్షణపై స్పందించారు.



# పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం.. మా అమ్మ కోరిక

**పేదవారికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందించడం తన తల్లి కోరిక అని హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ అన్నారు. అదే బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిగా సేవలందిస్తోందని ఆయన చెప్పారు. లాభాపేక్ష లేని ఈ ఆసుపత్రి.. దాతల సహకారంతో నడుస్తుందన్నారు. అమరావతిలో బసవతారం క్యాన్సర్ ఆసుపత్రికి 2019లో శంకుస్థాపన జరిగిందన్నారు. అప్పటి వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అంధకార పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దీంతో ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టలేకపోయినట్లు చెప్పారు. ప్రస్తుతం ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు చేపట్టామన్నారు. వర్షం రూపంలో భగవంతుడు కూడా ఆశీస్సులు కురిపించాడని ఆనందం వ్యక్తంచేశారు.**




# ఖజానా జ్యువెలరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్: హైదరాబాద్‌లోని చందానగర్ ఖజానా జ్యువెలర్స్‌లోకి మంగళవారం పట్టపగలు తుపాకులతో చొరబడిన దుండగులు 10 నిమిషాలపాటు బీభత్సం సృష్టించారు. సిబ్బందిలో ఒకరిపై కాల్పులు జరిపి వెండి వస్తువులు, 1గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తీసుకొని పరారయ్యారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల కోసం 12 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దుండగులు వెళ్లిన దారుల్లో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. చందానగర్ నుంచి బీరంగూడ- జిన్నారం-వట్పల్లి మీదుగా బీదర్ వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు కర్ణాటక పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. అలాగే బీదర్ పోలీసులతో కలిసి గాలిస్తున్నారు. కాగా, నిన్న జరిగిన దోపిడీ ఘటనలో ఆరుగురు దుండగులు పాల్గొన్నట్లు పోలీసులు తెలియజేస్తున్నారు.

# ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువుల తరలింపు: హరీశ్‌రావు ఆరోపణ



సిద్దిపేట: మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాలోని రాఘవాపూర్‌లో పర్యటించారు. రైతులు ఎరువుల కోసం క్యూలో నిల్చోవడాన్ని చూసి ఆయన ఆగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటీపీ, ఒక బస్తా విధానం తీసేయాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.

**మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ...** నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.

**కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్ హౌస్ నుంచి గోదావరి నదీ జలాల ఎత్తిపోతలు ప్రారంభించారు. మూడు బాహుబలి పంపులతో 9450 క్యూసెక్కుల జలాలను ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి నుంచి మధ్యమానేరు ప్రాజెక్టుకు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నారు. శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి లభ్యత మేరకు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎత్తిపోతలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భారీ స్థాయిలో కాలువలు ద్వారా గోదావరి జలాలు ప్రవహించడంతో ఈ ప్రాంతంలో జలకళ సంతరించుకుంది.**



# మూడు బాహుబలి పంపులతో గోదావరి జలాల ఎత్తిపోత

చురకలు






## వందే 'భారత్': ఆసక్తికర మ్యాప్ షేర్ చేసిన అమితాబ్ కాంత్

వందే భారత్ రైలు దేశాన్ని ఏకతాటిపైకి తీసుకెళ్తోందని జీ20కి భారత్ తరఫున షెర్పాగా వ్యవహరించిన అమితాబ్ కాంత్ అన్నారు. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒక్కో ట్రాక్‌తో దేశాన్ని కలుపుతోంది' అంటూ ఎక్స్ వేదికగా ఒక మ్యాప్‌ను షేర్ చేశారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన 'వందే భారత్' రైలు మార్గాలు భారత భౌగోళిక చిత్రపటాన్ని ఆవిష్కరించేలా ఉండడంతో ఈ పోస్టు ఆసక్తికరంగా మారింది. ఈ పోస్టుపై నెటిజన్లు స్పందించారు. మ్యాప్ బాగుందని కొందరు కొనియాడారు. ప్రస్తుతం వందేభారత్ సగటు వేగం గంటకు 85 కిలోమీటర్లు మాత్రమేనని, మనకు కనీసం గంటకు 150 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెట్టే రైళ్లు కావాలని ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు. అందుకోసం ప్రభుత్వం మౌలిక వసతుల మెరుగుదలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని రాసుకొచ్చారు. ఇటువంటి మౌలిక వసతులే భారత్‌కు అవసరమని మరొకరు కామెంట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2019 ఫిబ్రవరి 15న ఢిల్లీ–వారణాసి మధ్య తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన వందేభారత్ రైళ్ల సంఖ్య 150కి పెరిగింది. ఆదివారం ఒక్కరోజే ప్రధాని మోదీ మూడు కొత్త వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అమృత్‌సర్– శ్రీమాత వైష్ణోదేవి కత్రా, బెళగావి%–%బెంగళూరు, అజ్నీ–పుణె వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ఆయన స్వయంగా ప్రారంభించారు.




గూగుల్‌లో ప్రొడక్ట్ మేనేజర్‌గా తన ప్రయాణం మొదలుపెట్టి.. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు సీఈవో అయ్యారు భారత్‌కు చెందిన సుందర్ పిచాయ్ . పదేళ్లుగా ఆయన ఆ సంస్థకు సీఈవోగా కొనసాగుతున్నారు. ఇటీవల బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. గూగుల్‌ను 2.3 ట్రిలియన్ డాలర్ల సంస్థగా రూపుదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే, ఇన్నేళ్ల కెరీర్‌లో తనకెదురైన అనుభవాలను ఇటీవల అమెరికన్ పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్మాన్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా కెరీర్ ఎదుగుదలకు సంబంధించి జెన్–%g% ఉద్యోగులకు పలు కీలక సూచనలు చేశారు.

**మొదట్లో ఇబ్బందే.. కానీ!...** కెరీర్‌లో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయని, తానూ అలాంటివి ఎదుర్కొన్నానని సుందర్ పిచాయ్ వివరించారు. వృత్తి జీవితంలో తోటి ఉద్యోగుల తీరుతో భయపడిన సందర్భాలూ అనేకం ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. అయితే, వాటిని తన వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడిన అంశాలుగానే చూసినట్లు తెలిపారు. జీవితంలో అనేక సందర్భాల్లో తన కంటే మెరుగైన వ్యక్తులతో పనిచేశానన్నారు.

“మీరు మీకంటే మెరుగైన నైపుణ్యాలు, ప్రతిభ ఉన్న వ్యక్తులతో పనిచేసే అవకాశాన్ని కోరుకోవాలి. ఇలాంటి సందర్భాలు మొదట్లో కాస్త అసౌకర్యంగా అనిపించినా.. అవి నైపుణ్యాలను మెరుగుపరచడానికి, మీరు ఊహించని స్థాయికి ఎదగడానికి దోహదపడతాయి. అలాంటి వ్యక్తులతో పనిచేయడం వల్ల మీరు కొత్త విషయాలు నేర్చుకుంటారు. మీ సామర్థ్యాలు పరీక్షించుకున్నట్టుడే.. మీ పనితీరు మెరుగుపడుతుంది” అని అన్నారు సుందర్ పిచాయ్.

**కంఫర్ట్ జోన్ వద్దు...** “జీవితం ఎంచక్కా ముందుకు సాగుతోంది కదా అని యువ ఉద్యోగులు కంఫర్ట్ జోన్‌లో ఉండిపోవద్దు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోండి. అప్పుడే మీరేంటో మీకు తెలుస్తుంది. చాలాసార్లు మీకు మీరే ఆశ్చర్యంగా అనిపిస్తారు” అన్నారు. ఈ తరహా తత్వమే తనకు బాగా కలిసొచ్చిందని వివరించారు సుందర్. గూగుల్ సహ వ్యవస్థాపకులైన ల్యారీ పేజ్, సెర్గీ బ్రిన్ దృష్టిలో తాను పడటానికి, 2015లో గూగుల్ సీఈవోగా నియమితులవ్వడానికి ఇదే దోహదపడిందన్నారు.

**అభిరుచులకూ పెద్దపీట..** పూర్తిగా కెరీర్ మీద మాత్రమే ఫోకస్ చేయడం కాదు.. అప్పుడప్పుడూ అభిరుచులకూ పెద్దపీట వేయాలని జెన్–%g%కు సూచించారు పిచాయ్. మనసు చెప్పే మాట కూడా వింటూ ఉండాలని సలహా ఇచ్చారు. అప్పుడే జీవితాన్ని ఆస్వాదిస్తున్నామా? లేదా? అనే విషయం తెలుస్తుందన్నారు.

**గూగుల్ విజయం రహస్యం అదే..** సరైన వ్యక్తిని కనుగొనడంలోనే గూగుల్ విజయ రహస్యం దాగి ఉందని సుందర్ పిచాయ్ చెప్పుకొచ్చారు. “ప్రయాణంలో మిషన్ ఓరియెంటెడ్ వ్యక్తులను గుర్తిస్తే.. వారు ప్రతిదీ శ్రద్ధగా చేయాలనే తపనతో ఉంటారు. అంతేకాదు మిగిలిన వ్యక్తులనూ ఆ దిశగా నడిపిస్తారు. దానివల్ల మరింత ఎక్కువ సాధించడం సాధ్యమవుతుంది” అని గూగుల్ విజయ రహస్యాన్ని చెప్పుకొచ్చారు పిచాయ్. తానూ ఉద్యోగులు తమ పనిని బాధ్యతాయుతంగా చేస్తారని విశ్వసిస్తానని పేర్కొన్నారు. టీమ్‌పై నమ్మకం ఉంచడం ద్వారా తాను ప్రశాంతంగా నాయకత్వ బాధ్యతల్లో కొనసాగుతున్నానని వివరించారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే తప్పులు సరిదిద్దే ప్రయత్నం చేస్తానని, కానీ అలాంటి సందర్భాలు చాలా తక్కువేనంటూ సుందర్ తన పాడ్‌కాస్ట్‌లో తెలిపారు.




సింధూ జలాల ఒప్పందం నిలిపివేత విషయంలో పాకిస్థాన్ తన అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. ఓర్వలేక అణు బెదిరింపులకు పాల్పడుతోంది. తాజాగా ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో కూడా తీవ్రమైన హెచ్చరికలు చేశారు. దీనిపై సినీనటుడు, భాజపా నేత మిథున్ చక్రవర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటే భారత్ సహనం నశిస్తుందని అన్నారు. అప్పుడు బ్రహ్మోస్ క్షిపణులు ఒకదాని తర్వాత ఒకటి ఆ దేశంపైకి దూసుకెళ్తాయని హెచ్చరించారు. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో తమ దేశానికి పెద్ద నష్టం జరిగిందని భుట్టో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'ప్రధాని మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు పాక్‌కు చాలా నష్టం కలిగించాయి. మన ప్రజలంతా ఐక్యంగా ఉండాలి. వారి దురాక్రమణలకు వ్యతిరేకంగా కలిసి నిలబడాలి' అని అన్నారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగితే.. పాక్ యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆరు నదులు తిరిగి పొందేందుకు తమ పౌరులంతా యుద్ధానికి సిద్ధంగా ఉన్నారంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. భవిష్యత్తులో భారత్ సిందూర్ లాంటి ఆపరేషన్ చేపడితే.. తమ దేశంలోని ప్రతి ఒక్కరూ పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని బెదిరింపులకు పాల్పడ్డారు. అమెరికా పర్యటనలో ఉన్న పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ సింధూ నదీ జలాల ఒప్పందంపై వ్యాఖ్యల అనంతరం భుట్టో ఇలా మాట్లాడారు. నదీ జలాలను అడ్డుకోవడానికి భారత్ ఆనకట్టలు కడితే పేల్చేస్తామని, తమ దేశ మనుగడకు ప్రమాదం ఏర్పడితే సగం ప్రపంచాన్ని అణ్వాయుధాలతో నాశనం చేస్తామంటూ మునీర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకు భారత్ దీటుగా స్పందించింది. అణు బెదిరింపులకు భయపడేది లేదని, దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేసింది.


## సామాజిక సంస్కర్త గోపరాజు లవణం - ఆగస్టు 14... గోపరాజు లవణం వర్ధంతి

జి. లవణం లేదా లవణంగా సుపరిచితులు అయిన గోపరాజు రామచంద్ర లవణం (10 అక్టోబర్ 1930 – 14 ఆగష్టు 2015)... గోరా గా ప్రసిద్ధి చెందిన గోపరాజు రామచంద్ర రావుకు లవణం పెద్ద కుమారుడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన ఆయనకు లవణం అని పేరు పెట్టారు. తొమ్మిది మంది సంతానం కాగా, గోరా తన కుమారులకు వారు వుట్టినప్పటి ప్రపంచ, దేశ పరిస్థితులకు అద్దం పడుతూ విలక్షణమైన పేర్లు పెట్టాడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన కుమారునికి లవణం అని, భారతీయులు ఛట్ట సభల్లో నిలిచి గెలిచిన కాలంలో పుట్టిన కొడుక్కు విజయం: అని, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పుట్టిన కుమారులకు సమరం, నియంత అని, తొమ్మిదవ సంతానానికి నవ్ అని పేర్లు పెట్టారు. గాంధీ ఇర్విన్ ఒడంబడిక సందర్భంలో పుట్టిన అమ్మాయికి మైత్రి అని, మరో కుమార్తె పేరు మనోరమ అని పెట్టారు. లవణం తండ్రి బాటలో నడిచాడు. లవణం భారతీయ సామాజిక సంస్కర్త. గాంధేయవాది, హేతువాది. ఆయన భారతీయ సమాజంలోని అంటరానితనాన్ని తొలగించడానికి పని చేశాడు. ఆయన నాస్తికుడు. ఆయన సతీమణి హేమలత లవణంతో కలిసి సంస్కార్ సంస్థను స్థాపించారు. నాస్తికమార్గం పత్రికల సంపాదకుడుగా పని చేసాడు. లవణం చిన్నతనం లోనే స్వాతంత్ర్యోద్య మంలో పాల్గొన్నాడు. 1973లో విజయవాడ హేతువాద సంఘ అధ్యక్షుడిగా నియమితుడు అయినాడు. అస్పృశ్యతా నిర్మూలన కుల నిర్మూలన కోసం కృషిచేశాడు. నవయుగ కవి చక్రవర్తి, పద్మ విభూషణ్ గుర్రం జాషువా యొక్క కుమార్తె హేమలతను మహాత్మా గాంధీ ఆశ్రమంలో వివాహం చేసుకున్నాడు. గాంధేయ విలువలకు కట్టుబడి సామాజిక అభ్యున్నతికి అంకితమై పని చేశాడు. మహాత్మాగాంధీ వ్యక్తిత్వం, వినోబా భావేల ప్రభావంతో, నిరాడంబరంగా ఎలా జీవించాలో వారి నుంచే నేర్చుకున్నాడు. సామాజిక జాగృతికి అనేక విధాల కృషి చేస్తున్న లవణం హేతువాదం, నాస్తిక వాదంపై అనేక గ్రంథాలు రచించాడు. సంఘం, ది ఎథిస్ట్, నాస్తిక మార్గం పత్రికలు లవణం సంపాదకీయంలో వెలువడ్డాయి. భారత నాస్తిక కేంద్రం డైరెక్టర్ గా వ్యవహరించాడు. సమాజంలో వేళ్లూనుకున్న మూఢ విశ్వాసాలు, మత మౌఢ్యానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపాడు. హేమలత, లవణం దంపతులు గొప్ప సంఘ సంస్కర్తలు. సంస్కార్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, నిజామాబాద్ జిల్లాలో జోగిని వ్యవస్థను రూపుమాపేందుకు కంకణం కట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో ఉంటూ జిల్లాలో ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుని, అనేక సంఘసేవా, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న 'జోగినీ' దురాచార వ్యవస్థను, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించి, ప్రజలను చైతన్య పరచి, దురాచారాలను పూర్తిగా నిర్మూలించ గలిగారు. “ప్లాన్ ఇంటర్నేషనల్” వారి ఆర్థిక సాయంతో అనేక గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్ని రామకృష్ణారావు సలహా మేరకు అక్బర్ నగర్ గ్రామంలో గ్రామస్థుల సహాయంతో ప్రకృతి ఆశ్రమాన్ని 1997 లో ప్రారంభించడం జరిగింది. అయితే 2006 లో సంస్థతో చేసుకున్న 9 సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి అయిపోవడం వల్ల వచ్చే రోగులు ఇచ్చే ఆదాయంతో ఆశ్రమం నిర్వహించడం కష్టం అయింది. పల్లెటూరు అవడం, మరియు 5,10 కి మించి రోగులు రాకపోవడం వల్ల ఆశ్రమ నిర్వహణ కష్టమయింది.



ఆ సమయంలో లవణం దంపతులు, మార్ని రామకృష్ణారావును కలసి మంతెన సత్యనారాయణ రాజుకు ఆ ప్రకృతి ఆశ్రమం ఉచితంగా 33 సంవత్సరాల లీజు అగ్రిమెంటుతో అప్పగించడం జరిగింది. అలా సంస్కార్ ప్రకృతి ఆశ్రమం అతి తక్కువ ఫీజులతో భారత దేశంలో మరెక్కడాలేనంత తక్కువ ధరలలో వైద్యసేవలందింస్తోంది. నాస్తికత్వం – అభివృద్ధి– చరిత్ర 1978, కోవూర్ జీవితం 1980 తదితర రచనలు చేశాడు. నేను నాస్తికుడిని, దేవుని నమ్మను. పూజించను. ఇతరులు ఎంతోమంది నమ్ముతారు. పూజిస్తారు. ఒకరి భావాలు మరొకరికి నచ్చవు. కొందరు నన్ను వ్యతిరేకిస్తారు. ఇంకొందరు ముఖం మీదనే తిడతారు. అయినా నేను వారి పట్ల ద్వేష భావం పెంచుకోను. పోట్లాటకు, వాదనలకు దిగను నేను స్వతహాగా హాస్య ప్రియుడిని, ఎప్పుడూ సరదాగా ఉండాలనుకునే మనస్తత్వం నాది అని తరుచూ చెపుతుండే వాడు. 1991లో అంతర్జాతీయ నాస్తికత్వాన్ని 1980 నుండి 1990 వరకు ప్రోత్సహించి నందుకు లాస్ ఏంజిల్స్ లోని నాస్తికుల యునైటెడ్ నుండి నాస్తికుడు అవార్డు, 2009లో డీనోటిఫైడ్ తెగల సభ్యులకు పునరావాసం మరియు ఉపాధి అవకాశాలను అందించి నందుకు జమ్నాలాల్ బజాజ్ అవార్డు, 2011లో ప్రపంచ శాంతికి మరియు మానవత్వానికి సేవ చేసినందుకు వైష్ణవ సెంటర్ ఫర్ ఎన్లైటెన్మెంట్తో అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ సర్వీస్ సొసైటీ నుండి లైఫ్‌ఎమ్ అచీవ్ మెంట్ అవార్డు, 2015లో మానవ హక్కులు మరియు సామాజిక సంస్కరణలను ప్రోత్సహించడానికి ఆయన చేసిన కృషికి హైదరాబాద్ లోని ప్రోబ్ రిసోర్స్ సెంటర్ ఫర్ జర్నలిస్ట్ నుండి అంతర్జాతీయ హ్యూమనిస్ట్ అవార్డు తదితరాలు ఆయనకు లభించాయి. కొంత కాలం ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ, 2015, ఆగష్టు 14న విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## భారత స్వాతంత్ర్య చట్టం 1947



పొట్ట కోటికోసం, సుగంధ ద్రవ్యాల వ్యాపారార్ధం 1498లో వాస్కోడ గామా కాలికట్ లోని కోజికోడ్ ఓడ రేవులో కాలూనినది మొదలు ఐరోపా వర్తకుల రాకపోకలు భారత ఉప ఖండంలో ప్రారంభమైనాయి. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలోని బ్రిటీష్ సైన్యం బెంగాల్ నవాబుపై విజయం సాధించటంతో, భారత దేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ప్రారంభమైంది. 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1784లో చేసిన ఇండియా చట్టం, 1833 చార్టర్ చట్టం మెదలైన చట్టాలు భారతదేశంలో బ్రిటీష్ అధికారాన్ని సుస్థిరం చేశాయి. 1849 పంజాబ్ ఆక్రమణ తరువాత అనేక చిన్నచిన్న తిరుగుబాట్లు, అనంతరం 1857 సిపాయిల తిరుగుబాటు ఫలితంగా, బ్రిటీష్ వారు ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనను రద్దు చేసి విక్టో రియా రాణి పరిపాలనను ప్రవేశ పెట్టారు. భారత పాలనా వ్యవహారాలను చూసుకోవటానికి వైస్రా యిని నియమించారు. ఈ విధంగా భారతదేశం నేరుగా బ్రిటీష్ పాలనలోకి వచ్చింది. 90 ఏళ్ల స్వాతంత్ర్య పోరాట క్రమాల అనంతరం చివరి బ్రిటీష్ గవర్నర్ జనరల్ అయిన విస్కౌట్ లూయీస్ మౌంట్ బాటెన్ 1947 జూన్ 3 న బ్రిటీష్ ఇండియాని లౌకిక భారత దేశం గాను, ఇస్లామిక్ పాకిస్తాన్ గాను విభజిస్తున్నట్లు ప్రకటిం చారు. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్, 1947 ఇవ్వబడుతుంది. ఆగస్టు 15 న భారత దేశం స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. భారత స్వాతంత్ర్య చట్టం 1947 అన్నది బ్రిటిషు ఇండియాను భారతదేశం, పాకిస్తాన్ అన్న రెండు స్వతంత్ర డొమినియన్లుగా విభజించేందుకు యునైటెడ్ కింగ్ డమ్ పార్లమెంటు చేసిన చట్టం. జూలై 18, 1947న ఈ చట్టం రాజ సమ్మతి పొందింది. సంప్రదింపుల అనంతరం జవహర్ లాల్ నెహ్రూ, వల్లభ్ బాయి పటేల్, ఆచార్య కృపలానీ ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ, మహమ్మద్ అలీ జిన్నా, లియాఖత్ అలీ ఖాన్, అబ్దుల్ రబ్ నిష్తార్ ప్రాతినిధ్యంలోని ముస్లిం లీగ్, సిక్కుల ప్రతినిధిగా సర్దార్ బల్దేవ్ సింగ్లతో గవర్నర్ జన రల్ ఆఫ్ ఇండియా లార్డ్ మౌంట్ బాటన్ ఒప్పందానికి వచ్చాక, భారత స్వాతంత్ర్య అనుకూలుడైన బ్రిటిష్ ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ ప్రభుత్వం, భారత గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటన్ కలిసి చట్టాన్ని తయారు చేశారు. అధికార బదిలీ కోసం సంప్రదింపులు చేసేందుకు వచ్చిన క్యాబి నెట్ మిషన్ సమైక్య భారత సమాఖ్య ప్రతిపాదన (మే 16 ప్రతిపాదన)కు కాంగ్రెస్, ముస్లింలీగ్ ల ఆమోదం లభించింది. కానీ కేబినెట్ మిషన్ సభ్యుడు క్రిప్స్ ఎవరికి అనుకూలమైన నిర్వచనం వారికి చెప్తూ ఆమోదం పొందడంతో వారు వెళ్ళగానే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవహర్ లాల్ నెహ్రూ ప్రసంగిస్తూ, దాన్ని పూర్తిగా తిరస్కరిం చాడు. దాంతో ఆగ్రహించిన ముస్లిం లీగ్ నాయ కుడు జిన్నా ప్రత్యక్ష కార్యాచరణకు పిలుపుతో హింసాత్మకమైన మలుపుతో కాంగ్రెస్, బ్రిటిషు ప్రభుత్వాలపై ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలో దేశాన్ని సమాఖ్యగా ఉంచే మే 16 ప్రతిపాదన, పూర్తి బెంగాల్, పూర్తి పంజాబ్ లతో పాకిస్తాన్ విభజించి ఏర్పరిచే జూన్ 16 ప్రతిపాదనకు మధ్యగా మరో ప్రణాళికను ముందు సివిల్ సర్వెంట్ వి.కె.మీనన్ తయారు చేశారు. దీని ప్రకారం బ్రిటిషు ఇండియా... భారత దేశం, పాకిస్తాన్లుగా విభజన అవుతుంది. అలాగే బెంగాల్, పంజాబ్ ప్రావిన్సులు కూడా విభజితమై, ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు పాకిస్తాను, హిందువుల సంఖ్యాధిక్యత ఉన్న ప్రాంతాలు భారతదేశానికి లభిస్తాయి. ఇది మౌంట్ బాటన్ ప్రణాళికగా పేరొందింది. బ్రిటిష్ ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ 1947 ఫిబ్రవరి 20న చేసిన ప్రకటన ప్రకారం బ్రిటిషు ప్రభుత్వం బ్రిటిషు ఇండియాకు పూర్తి స్వంత ప్రభు త్వాన్ని కనీసం 1948 జూన్ నాటికి మంజూరు చేస్తుంది. తుది (అధికార) బదిలీ తేదీ నిర్ణయించిన తర్వాత సంస్థానాల భవితవ్యం నిర్ణయమవు తుంది. ప్రధానంగా లార్డ్ మౌంట్ బాటన్ ప్రణాళికగా పేరొందిన బ్రిటిషు ప్రభుత్వం 1947 జూన్ 3న ప్రతిపాదించిన ప్రణాళికలో గల అంశాలు భారత విభజనకు సూత్రాన్ని బ్రిటిషు ప్రభుత్వం అంగీకరించింది. వారసులుగా వచ్చే ప్రభుత్వాలకు డొమినియన్ స్థాయి ఇవ్వ బడుతుంది. బ్రిటిషు కామన్వెల్త్ నుంచి ఎప్పుడైనా తప్పుకునేందుకు షర తులులేని హక్కు ఉంటుంది. అలా భారత స్వాతంత్ర్య చట్టం 1947 అన్నది జూన్ 3 ప్రణాళికకు అమలు వంటిది. 1947 ఆగస్టు 15న బ్రిటీష్ ఇండియాను భారత దేశం, పాకిస్తాన్ అనే రెండు కొత్త దేశాలుగా విభ జించడంబీ బెంగాల్, పంజాబ్ ప్రావిన్సుల విభ జించి, రెండు కొత్త దేశాలకు పంపకం చెయ్యడంబీ రెండు కొత్త దేశాలలో గవర్నర్ జనరల్ కార్యాల యాన్ని బ్రిటన్ రాచరికపు ప్రతినిధిగా ఏర్పాటు చేయడంబీ రెండు కొత్త దేశాల రాజ్యాంగ సభలకు పూర్తి శాసనాధికారాన్ని ఇవ్వడంబీ 1947 ఆగస్టు 15 న సంస్థానాలపై బ్రిటిష్ అధికారాన్ని ముగిం చడం. స్వతంత్రంగా ఉండడానికి గాని, ఏదో ఒక దేశంలో చేరడానికి గాని వాటికి ఉన్న హక్కును గుర్తించడంబీ బ్రిటిషు చక్రవర్తి 'భారత చక్రవర్తి' అనే పేరును వాడడాన్ని రద్దు చేయడం (కింగ్ జార్జ్ %ఎ×% రాజు 1948 జూన్ 22 న రాజ ప్రకటన ద్వారా దీన్ని అమలు చేశాడు). సాయుధ దళాల విభజనతో సహా ఉమ్మడి ఆస్తిని రెండు కొత్త దేశాల మధ్య పంపకానికి ఈ చట్టం ఏర్పాటు చేసింది. ఈ చట్టం ప్రకారం భారతదేశం, పాకిస్తాన్ రెండు కొత్త డొమినియన్లు భారత సామ్రాజ్యం నుండి. ఉద్భవిస్తాయి. 1947 ఆగస్టు 15 ను విభజన తేదీగా నిర్ణయించారు. కొత్త రాజ్యాంగాన్ని రూపొందించే లోపు, కొత్త రాజ్యాలను, దాని ప్రావిన్సులనూ భారత ప్రభుత్వ చట్టం 1935కు లోబడి కొత్త డొమినియన్ల ఏర్పాటు ఫలితంగా...హిస్ మెజెస్టీ ప్రభుత్వం కొత్త డొమినియన్లపై అన్ని బాధ్య తలను కోల్పోయింది. భారతీయ రాష్ట్రాలపై హిజ్ మెజెస్టీ ప్రభుత్వం అధికారం ముగిసింది. ఈ చట్టం ఆమోదించే టప్పుడు అమలులో ఉన్న భారతీయ రాష్ట్రాలు, గిరిజన ప్రాంతాలతో ఉన్న అన్ని ఒప్పం దాలూ, ఒడంబడికలూ ముగిశాయి. బ్రిటిష్ క్రౌన్ బిరుదుల నుండి 'భారత చక్రవర్తి' అనే బిరుదు తొలగించబడింది. సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా కార్యాలయం రద్దు అయింది. 1947 జూన్ 4 న, మౌంట్ బాటెన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తద్వారా దేశంలోని 563 కు పైగా ఉన్న భారతీయ సంస్థానాలకు, బ్రిటన్కు మధ్య ఉన్న ఒప్పందం సంబంధాలు ముగిసిపోతాయని, 1947 ఆగస్టు 15న బ్రిటిష్ అధికారం ముగుస్తుందని, క్రొత్త డొమినియన్లలో ఏదో ఒకదానిలో చేరడానికి, లేదా స్వతంత్రంగా ఉండడానికి వారికి స్వేచ్ఛ ఉంటుందని వివరిం చారు. చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటన్ భారత గవర్నర్ జనరల్గా కొనసాగాలని భారత నాయకులు కోరారు. జవహర్లాల్ నెహ్రూ భారత ప్రధాని, సర్దార్ వల్లభాయ్ పటేల్ హోంమంత్రి అయ్యారు. ఆగస్టు 15 నాటికి 560కి పైగా రాచ రిక రాష్ట్రాలు భారత దేశానికి చేరాయి. తర్వాత జమ్మూ కశ్మీర్ 1947 అక్టోబరు 26 న, హైదరా బాద్ రాజ్యం భారత ప్రభుత్వ 1948 సెప్టెంబరు 13 న సైనిక చర్య జోక్యం ద్వారా సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం అయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చురకలు
## సంపాదకీయం

# ఏఐ విప్లవం
## ఉద్యోగాలు పోతున్నాయి.. ఏం చేయాలి?

ఏఐ విప్లవం వచ్చింది. దీంతో మైక్రోసాఫ్ట్ నుంచి మొదలుపెడితే మామూలు కంపెనీల వరకూ అందరి ఉద్యోగాలు పోతున్నాయి. ఇది కేవలం ఉద్యోగాల సమస్య కాదు. ఇది మనసు మీద బురద పడే భయాల భూతం. ఇది ఒక ఆర్థిక సంక్షోభం మాత్రమే కాదు. మానవ సంబంధాల సంక్షోభం కూడా.. ఎందుకంటే ఉద్యోగం కోల్పోవడం అనేది కేవలం ఆదాయాన్ని కోల్పోవడమే కాదు. ఒక గమ్యాన్ని, గౌరవాన్ని, జీవన ఉద్దేశ్యాన్ని కోల్పోవడమే. అంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడీ ప్రకారం.. మరో ఐదేళ్లలో సగం వైట్ కాలర్ ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. ఉద్యోగ జీవితాన్ని ఆరంభించాల్సిన ఈ తరం ముందు.. ఆదాయానికి తొలి మెట్టు కనిపించకుండా పోతోంది. ఇది చిన్న మార్పు కాదు. ఒక మహా తరంగం. దీన్ని విస్మరించడం, అలమటించడం పరిష్కారం కాదు. పరిష్కారం దిశగా ముందడుగు వేయడమే మార్గం.

**– మానవ మనస్తత్వంపై ముద్ర వేసే ఏఐ ప్రభావం...** ప్రధానంగా మూడు రంగాలలో వ్యక్తులు, వ్యాపార నాయకులు, ప్రభుత్వాలు ఇప్పుడే స్పందించాల్సిన అవసరం ఉంది.


**1. వ్యక్తులు ఏమి చేయాలి?...** మీకు భయంగా ఉంది కదా? నలుగురిలో నలుగురికి ఇదే అనుభూతి. ఇది "ఉద్యోగ భయం" కాదు. ఇది గమనికలేని భవిష్యత్తుపై దుఃఖం. అందుకోసం మొదటి అడుగు ధైర్యంగా వేయాలి. మీ భావాలను గుర్తించండి. మీరు కోల్పోయినది కేవలం జీతం కాదు. మీ కలలు, మీ గుర్తింపు. ఏఐ చేయలేని పనులపై దృష్టి పెట్టండి. విశ్లేషణలు చేయగలిగేది యంత్రమే అయినా, అనుభూతిని అర్థం చేసుకోవడం, నమ్మకాన్ని నింపడం, నైతికతతో వ్యవహరించడం మనుషుల వంతే. ఐటీ స్కిల్స్ కాక, అంతర్దృష్టిని అభివృద్ధి చేసుకోండి. సిస్టమ్స్ థింకింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలు మీకు లాంగ్‌టర్మ్ బలం. పాత "కేరీర్ లాడర్" ను వదిలేసి, కొత్త దారులు తయారు చేసుకోండి. స్టెబిలిటీ కాదు, ఫ్లెక్సిబిలిటీకి సిద్ధపడండి. బంధాలు పెంచుకోండి. భవిష్యత్తు వ్యక్తిగతం కాదు.. సామూహికం అని గుర్తించండి..

**2. వ్యాపార కంపెనీల అధిపతులు ఏమి చేయాలి?...** ఉద్యోగాల్ని తొలగించడం వల్ల లాభాలొస్తాయనుకుంటే ఒక విషయం గుర్తుంచుకోండి. యంత్రాలు ఎప్పుడూ నమ్మదగ్గవి కావు.. మనుషులే మార్కెట్‌కి ప్రాణం. విజ్ఞతతో కూడిన నాయకత్వం ఈ మార్గాలను చూపుతుంది. గౌరవం కోసం వేరే ఉద్యోగాలను డిజైన్ చేయండి. ఆటోమేట్ చేయలేమా అని కాదు. దానివల్ల ఎవరికి ఉపయోగపడుతుంది? ఎవరిని మర్చిపోతున్నాం? అనే ప్రశ్నలు మీకు మీరు వేసుకోండి. ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల స్థానంలో అభ్యాస కేంద్రాలు ఏర్పరచండి. లాభాల మార్గంగా కాకుండా మానవతా సామర్థ్యానికి పెట్టుబడులు పెట్టండి. ఓపికగా మాట్లాడండి, భయాల్ని అర్థం చేసుకోండి.. అస్పష్టత అనేది వికాసానికి అవకాశంగా మారాలే కానీ, భయంగా మిగలకూడదు. సిస్టమిక్‌గా ఆలోచించండి. ఉద్యోగుల పునఃప్రారంభం లేకుండా ఎలాంటి వ్యూహాలూ నిలబడవు.

**3. ప్రభుత్వం ఏమి చేయాలి?...** ప్రభుత్వాలు చూస్తూ ఉండకూడదు. ఇది భవిష్యత్తు సమస్య కాదు. ఇప్పుడే ప్రారంభమైపోయింది. ఇప్పుడు కావాల్సిన చర్యలు చేపట్టాలి. ఏఐ ట్రాన్సిషన్ ఎమర్జెన్సీ ప్రకటించండి. వృత్తి మార్పులకు పెద్ద పథకాలతో ముందుకొచ్చే సమయం ఇది. సేఫ్టీ నెట్‌ను ఆధునీకరించండి. జీవితాలు లీనియర్ కాదంటే, బీమా/పదవీ భద్రతలు కూడా కొత్తగా ఆలోచించాలి. ఏఐపై బాధ్యత పెట్టండి. న్యాయం, పారదర్శకత, ప్రభావ విశ్లేషణలతోనే కొత్త టెక్నాలజీకి అనుమతి ఇవ్వాలి. మానవతా కేంద్రంగా ఉన్న ఆవిష్కరణలకు మద్దతివ్వండి. విశ్వాసాన్ని రాబట్టే కథలు చెప్పండి. భవిష్యత్తును నమ్మేలా ప్రజల్లో నూతన నైపుణ్యం తీసుకురండి.

**ఇది మానవతా పరీక్ష!...** ఏఐ వినియోగాన్ని తప్పుడు దిశలో తీసుకెళ్తే, మనం నిర్మించేది ఒక ఎందుకు పనికిరాని శూన్యమైన భవిష్యత్తు. కానీ ఇప్పుడే స్పందిస్తే ధైర్యంగా, దూరదృష్టితో, దయతో మనం సాంకేతికతతో మన మానవత్వాన్ని విస్తరింపజేసే భవిష్యత్తును నిర్మించగలం. "ఏఐ పనిని చేస్తుందా?" కాదు.. "ఏఐతో కూడిన ప్రపంచంలో మనం ఎలా ఉండాలనుకుంటున్నాం?" అనేదే ఇప్పుడు అసలు ప్రశ్న.

# దేశభక్తి ప్రపూర్ణుడు మాగంటి బాపినీడు - ఆగస్టు 14...మాగంటి బాపినీడు జయంతి



మాగంటి బాపినీడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దక్షిణ భారతానికి చెందిన అగ్రశ్రేణి నాయకులు. తెలుగులో విజ్ఞాన సర్వస్వాన్ని "ఆంధ్ర సర్వస్వము" అన్న పేరుతో ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రచురించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాడిన తొలితరం నాయకులలో ఒకడు. ఆయన సహధర్మ చారిణి మాగంటి అన్నపూర్ణాదేవి కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది. ఆమె మంచి రచయిత్రి, సమాజ సేవిక. బాపినీడు 1895లో ఆగస్టు 14న చాటపర్రు గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. కె. వెంకటరత్నం రెడ్డి వంటి సంఘ సంస్కర్తల ప్రభావం, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి రాజకీయ నాయకుల ప్రభావం అతనిపై బలంగా పడింది. ముందు చూపు కలిగిన ఆయన కుటుంబం కలకత్తాలో ఆయన విద్యాభ్యాసానికి ఏర్పాటు చేసింది. అక్కడ అనేక రచయితల పరిచయం లభించింది. తరచు శాంతినికేతన్ సందర్శించేవారు. తరువాత ఆయన "ఇండియన్ డిఫెన్సు కార్ప్స్"లో చేరారు. అలాంటి మిలిటరీ శిక్షణ పొందిన మొదటి ఆంధ్రుడు మాగంటే. కలకత్తాలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేవారు. బెంగాల్ ఆంధ్రా అసోసియేషన్కు కార్యదర్శిగా పని చేశారు. తరువాత 1920 లో, కలకత్తాలోని సిటీ కాలేజీలో చదువుతున్న సమయంలో, అన్నపూర్ణాదేవిని మాగంటి బాపినీడు వివాహం చేసుకున్నారు. ఆంధ్రదేశంలో సాంఘిక సంస్కరణల చరిత్రలో ఈ వివాహం ఒక చిరస్మరణీయ సంఘటన వివాహం అయిన వెంటనే, బాపినీడు సత్యలింగం ఛారిటీస్ స్కాలర్షిప్ పొందారు, స్వరాజ్ కోసం గొప్ప పోరాటంలో తన భార్యను విడిచిపెట్టి అమెరికాను విడిచి పెట్టారు. ప్రతిభా విద్యార్థిగా ఆయన అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్ళారు. అక్కడ "న్యూయార్క్ స్టేట్ కాలేజి ఆఫ్ అగ్రికల్చర్"లో బి.ఎస్.సి చదివారు. కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో ఎమ్.ఎస్.సి పూర్తి చేశాడు. ప్రొఫెసర్ వెబర్ అనే పండ్ల నిపుణుని వద్ద పని చేశారు. కార్నెల్ విశ్వ విద్యాలయం స్కాలర్షిప్పు లభించింది. కార్నెల్ విశ్వ విద్యాలయం అంతర్జాతీయ వ్యవసాయక సంఘం ఆయన స్థాపకుడు, మొదటి ప్రెసిడెంట్ కూడా. కాలిఫోర్నియాలో హిందూస్తాన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా పనిచేశారు. తరువాత బాపినీడు భారత దేశం తిరిగి వస్తూ మధ్యలో జపాన్ దేశాన్ని సందర్శించారు. 1923లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కిసాన్ ఉద్యమం ప్రాంభించారు. "ఆంధ్ర రైతు సభ" మొట్టమొదటి కార్యదర్శిగా పని చేశారు. గోదావరి – కృష్ణా సెటిల్మెంట్ సెంట్రల్ కమిటీలో చురుకుగా పని చేశారు. కిసాన్ ఉద్యమాలు నడిపినందుకు ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారు. మహాత్ముని మన్నలను పొందిన దేశభక్తురాలు మాగంటి భార్య అన్నపూర్ణ 1926లో మరణం ఆయనకు కోలుకొని పెద్ద దెబ్బ. ఆమె ఆయన దీక్షా కార్యక్రమాలలో చేదోడుగా ఉన్న ప్రతిభా శాలిని. బాపినీడు ఆంధ్ర విశ్వ విద్యాలయం సిండికేట్ మెంబరుగాను, ఆంధ్ర హరిజన సేవక సంఘం కార్యదర్శిగాను కూడా పని చేశారు. 1933 డిసెంబర్ లో గాంధీజీ పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా హరిజన సేవక సంఘ అధ్యక్షునిగా కలిదిండి గంగరాజు, కార్యదర్శిగా చంగల్వల చిట్టి పంతులు, ఆంధ్రరాష్ట్ర హరిజన సేవక సంఘ ప్రధాన కార్యదర్శిగా, మాగంటి బాపినీడు బాధ్యతలు నిర్వహించారు. 1937లో మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యాడు. పబ్లిక్ ఇన్ఫర్మేషన్ పార్లమెంటరీ సెక్రటరీగా పని చేశారు. మొత్తము గాంధీజీ ఆంధ్ర దేశంలో సంచరించిన దినములు 11 రోజులు మాత్రమే. ఈ కాలంలో గాంధీజీ 10 జిల్లాలు సంచారము చేశారు. 1,024 మైళ్ళ రైలుపైన, 667 మైళ్ళ మోటారు వాహనముల పైన, 15 మైళ్ళ స్టీము లాంచి పైన, 2 మైళ్ళ కాలి నడకను మొత్తం 1708 మైళ్ళ సంచారము చేశారు. 76 గ్రామములు, పట్టణములను సందర్శించి, 60 సభలలో ఉ పన్యాసములు ఇచ్చారు. వేలాది మంది ఉపన్యాసములు వినుటకు అవకాశము కలగగా, లెక్కకు మించి మహాత్ముని దర్శించు భాగ్యము దక్కింది. ఈ పర్యటనలో మాగంటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గాంధీజీ దక్షిణ భారత హిందీ ప్రచారసభకు అధ్యక్షత వహించేందుకై మదరాసు వెళుతూ 1946, జనవరి 26వ తేదీన రాత్రి 8గంలకు గాంధీజీ బయలు దేరిన ప్రత్యేక రైలు ఏలూరు స్టేషను నందు ఆగిన సందర్భంలో జిల్లా కాంగ్రెసు అధ్యక్ష కార్యదర్శులు మాగంటి బాపినీడు, సత్తిరాజు రామమూర్తి, డా. మూల్పూరి రంగయ్య, చుక్కమ్మతో పాటు కాంగ్రెసు కార్యకర్తలు అనేకమంది గాంధీజీకి స్వాగతం చెప్పారు. విపరీతమైన జన సందోహం రావటంతో రైల్వేప్లాట్ ఫారం నిండిపోగా, ప్లాట్ ఫారం వెలుపల వేలకొద్దీ జనం నిలబడవలసి వచ్చింది. ఏర్పడింది. గాంధీజీ 15 నిమిషములు విరాళములను స్వీకరించారు. చాల మంది స్త్రీలు బంగారు గాజులు, ఉంగరాలు, ముక్కెరలు, ఆభరణాలను సమర్పించారు. ఒక మహిళ ఎనిమిది నవరసుల తూకం గల బంగారు గొలుసును సమర్పించింది.

మొత్తం రూ.2,500/- నగదు, రూ.2,500/- విలువైన నగలు వసూలైనాయి. దక్షిణాదిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులలో ముఖ్యునిగా గుర్తింపు పొందిన బాపినీడు సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళాడు. ఎ.ఐ.సి.సి. మెంబరుగా కూడా సమర్థ వంతంగా పని చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# "భారత జాతీయ పతాక నేపథ్యం"



త్రివర్ణపతాకం భారత దేశపు గడ్డమీద మొదటి సారిగా బోస్ చేత మణిపూరులో ఆవిష్కరించ బడింది. 1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో – చరఖా స్థానంలో "ఆజాద్ హింద్" అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో – వాడుకొంది. 20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారతదేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. "(భారత) మాతకు వందనం" అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)" ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్లతామర స్వచ్ఛతకు చిహ్నాలు. 1907 లో మేడం భికాజీ కామా ఎగరేసిన జండా మొట్ట మొదటి త్రివర్ణ పతాకం1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్శీబగాన్ స్క్వేర్లో శచీంద్ర ప్రసాద్ బోస్ చే ఆవిష్కరించ బడింది. ఈ పతాకాన్ని "కలకత్తా పతాకం" అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి: పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ పాటు సమాంతర గీతలను కలిగి ఉంది. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, క్రింది పట్టీ మీద నెలవంక, సూర్యుడు మధ్యలో దేవనాగరి లిపిలో "వందేమాతరం" అనే అక్షరాలు ఉన్నాయి. 1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని స్టుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిష భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మధ్యనున్న కాషాయ పట్టీలో దేవనాగరి లిపిలో వందేమాతరం రాసి ఉంది. అడుగున ఉన్న పట్టీలో స్థంభానికి దగ్గరగా నెలవంక, రెండో చివర సూర్యుడు ఉన్నాయి. ఈ జండాను భికాజీ కామా, వీర సావర్కార్, శ్యాంజీ కృష్ణ వర్మలు కలిసి తయారు చేసారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక, బెర్లిన్ కమిటీలోని భారతీయ విప్లవకారులు దీన్ని స్వీకరించాక, ఈ జండా బెర్లిన్ కమిటీ జండాగా పేరు పొందింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు. 1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమవైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తార–నెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి. యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా (రాట్నము)ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపు–ఆకుపచ్చ రంగు పట్టీలమీద రాట్నము గుర్తును రూపొందించి చూపాడు. ఐతే అది అన్నిమతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపుపట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించ బడింది. ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు. 1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగుల, ముస్లిం ఫకీర్లు–దర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సికు?లు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్లైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు. భారత దేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఒక యువకుడు జెండా తయారు చేసి గాంధీజీకి ఇచ్చాడు. ఈ కార్యక్రమం 1921లో బెజవాడ (ప్రస్తుతం విజయవాడ)లో జరిగింది. ఇది రెండు రంగులతో తయారు చేయబడింది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు. ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది. "జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని" కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోందనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు. తర్వాత 1931 కరాచీ కాంగ్రెస్ సమావేశంలో పై నుంచి కిందకు వరుసగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో పట్టీలు, మధ్యలో చరఖాతో పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని స్వీకరిస్తూ జాతీయజెండాపై తుది తీర్మానం ఆమోదించబడింది. స్వతంత్ర భారతదేశ జాతీయ పతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్.అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయపతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి కొన్నిరోజుల ముందు ఏర్పాటైన రాజ్యాంగసభ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్నే అన్ని పార్టీలకు, అన్ని మతాలవారికి ఆమోదయోగ్యమైన మార్పులు చేసి జాతీయపతాకంగా స్వీకరించడానికి నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యమైన మార్పు రాట్నము స్థానంలో అశోకచక్రాన్ని చేర్చడం. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మచక్రాన్ని చేర్చారు. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయ పతాకంగా ఉద్వేగ భరిత వాతావరణంలో 1947 ఆగష్టు 15 నాడు ఆవిష్కరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# వ్యవసాయ రంగానికి సుబ్బారావు ఎనలేని సేవలు - ఆగస్టు 14....ఈడుపుగంటి వెంకట సుబ్బారావు వర్ధంతి



పద్మశ్రీ ఈడుపుగంటి వెంకట సుబ్బారావు (డిసెంబర్ 20, 1934 – ఆగష్టు 14, 2010) ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త. ఐ.వి. సుబ్బారావుగా అయన సుపరి చితులు. సుబ్బారావు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సమీపం లోని పసలపూడి గ్రామం లో జన్మించారు. ఆయ న తల్లిదండ్రులు అచ్చన్న, మున్నెమ్మ. ఆంధ్ర విశ్వ విద్యా లయం నుండి అగ్రికల్చర్ లో మాస్టర్ డిగ్రీ ఎం.ఎస్.సి. చేశారు. ఇండియన్ అగ్రికల్చ రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, న్యూఢిల్లీ నుండి పి. హెచ్. డి.పొందారు. ఆయన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ బాధ్యతలు చేపట్టే ముందు విశ్వ విద్యాలయంలో పరిశోధ న డైరక్టర్ గా ఉన్నారు.

ఆచా ర్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యా లయం ఉపకుల పతిగా వరుసగా రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించి 2003 లో పదవీ విరమణ చేశారు. ఎందరో యువ శాస్త్రవేత్తలకు మార్గ దర్శకులై, పరిశోధనా రంగంలో ప్రోత్సహించి, కొత్త ఆవిష్కారాలకు తెర లేపారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం, సుబ్బారావు ఆధ్వర్యంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించి, దేశంలోనే, దీనిని నిర్వహించిన మొదటి వ్యవసాయ విశ్వ విద్యాల యంగా పేరు తెచ్చు కొన్నది. ఆయన 2006 లో నిర్వ హించిన 93 వ కాంగ్రెస్ కు జనరల్ ప్రెసిడెంట్ గా ఉన్నారు. ఆయన 75 సంవత్సరాల వయస్సులో 2010 ఆగష్టు 14 న క్యాన్సర్ వ్యాధితో మరణించారు. సుబ్బారావు వ్యవసాయ రంగానికి చేసిన ప్రముఖ సేవలకు 2002 లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. బోర్‌లోగ్ అవార్డు (2004), అశు తోష్ ముఖర్జీ స్మారక అవార్డు (2007)ను సుబ్బారావు సొంతం చేసుకున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



## నాటి జినాలయం.. నేటి శివాలయం

కోరుట్ల : కోరుట్ల పట్టణంలోని అత్యంత పురాతన శ్రీమహాదేవస్వామి ఆలయానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. నాటి రట్టమార్తాండ జినాలయాన్ని నేడు మహాదేవస్వామి ఆలయంగా పిలుస్తున్నారు. క్రీ.శ.10వ శతాబ్దానికి ముందు చాళుక్యుల కాలంలో కోరుట్ల వాగు ఒడ్డున రట్టమార్తండ జినాలయాన్ని నిర్మించారు. అప్పట్లో పార్శ్వనాథుడు, బాహుబలి, జైన ప్రభామండలి ఉండేవి. అనంతర కాలంలో శివుడికి పూజలు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయానికి కేవలం గర్భగృహం, ముందు చిన్నమంటపం మాత్రమే ఉండేవి. ఆలయ ఆవరణలో ఇప్పటికీ బాహుబలి, పార్శ్వనాథుల రాతి విగ్రహాలు మనకు దర్శనమిస్తాయి. పది, పదకొండో శతాబ్దాల్లో కొరవట్టుల కేంద్రంగా జైనులు పాలించారు. నాటి కొరవట్టుల నేడు కోరుట్లగా మారింది. పురాతన శివాలయాలన్నీ తూర్పు ముఖంగా ఉంటాయి.



కానీ కోరుట్లలోని మహాదేవస్వామి ఆలయ ప్రధాన ముఖద్వారంతో పాటు గర్భగుడి ముఖ ద్వారం సైతం పశ్చిమాభిముఖంగా ఉంటాయి. గర్భగుడిలోని శివలింగాన్ని భక్తులు తూర్పు వైపు ముఖం పెట్టి దర్శించుకోవాల్సి ఉంటుంది. ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. కార్తిక, శ్రావణ మాసాల్లో వేడుకలు నిర్వహిస్తారు. ప్రతి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారికి అభిషేకాలు చేస్తుంటారు.

## తాండవాల శివుడు.. అతి పెద్ద నంది

మిర్యాలగూడ : సాధారణంగా ఆలయాల్లో ప్రత్యేకతలు అనగానే పురాతన ఆలయాలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ బోటింగ్ పార్కు వద్ద 2018లో ప్రారంభోత్సవం జరుపుకొన్న ఉమామహేశ్వరాలయం ఎన్నో ప్రత్యేకతల ను సంతరించుకుని భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఆలయం ఎదురుగా ప్రతిష్ఠించిన నంది విగ్రహం..వరంగల్ రామప్ప



ఆలయంలోని నందిని పోలి ఉండడంతో పాటు దాని కంటే పెద్దగా ఉంది. సుమారు 9.5 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పుతో ఉన్న ఏకశిలా నంది విగ్రహం రాష్ట్రంలోనే పెద్దదిగా పేరు గాంచింది. ఇక ఆలయంలో ప్రతిష్ఠించిన 84 శివ తాండవాల భంగిమల విగ్రహాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇలాంటి విగ్రహాలు కలిగిన ఆలయం దేశంలో తమిళనాడులోని చిదంబరం నటరాజ స్వామి ఆలయం తర్వాత ఇదేనని చెప్పుకుంటారు. గతేడాది ఆలయ ఆవరణలోని చెరువులో ఏర్పాటు చేసిన కైలాస గిరి శివపార్వతుల విగ్రహాలు సైతం సుమారు 25 అడుగుల పైగా ఉండి భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

## 'బండ' బాదుడు!

సూర్యాపేట : జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల సూర్యాపేటలోని ఓ ఏజెన్సీలో గ్యాస్ బుక్ చేసుకున్నాడు. కానీ గ్యాస్ ఎంతకీ రాకపోవడంతో డిస్ట్రిబ్యూటర్‌కు ఫోన్ చేయగా వాహనం మరమ్మతులకు గురైందని, ఈ రోజు తీసుకురావడం కుదరదని తేల్చిచెప్పాడు. గ్యాస్ ఎలా అని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అదనంగా చెల్లించి బయట కొనుగోలు చేయాల్సి వచ్చిందని వాపోయాడు.జిల్లాలో గ్యాస్ వినియోగం పెరిగింది. పట్టణాల నుంచి మారుమూల పల్లెల వరకు ప్రతి ఒక్కరూ వివిధ కంపెనీలకు సంబంధించి గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. దీంతో ఇప్పటికే సుంకాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచడంతో ప్రస్తుతం రూ.926 వరకు చేరింది. ఎన్నికల హామీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సిలిండర్ గ్యాస్‌పై రూ.500 రాయితీ ప్రకటించింది. కేవలం రేషన్ కార్డులు ఉన్న వారికి ఇస్తుండటంతో మిగతా వారికి భారం తప్పడం లేదు. తీసుకునేటప్పుడు మొత్తం చెల్లిస్తుండగా కొన్ని నెలలుగా రాయితీ జమ కావడం లేదు. దీనికి తోడు పలువురు ఏజెన్సీల నిర్వాహకులు డెలివరీ బాయ్‌లకు వేతనాలు, ఆటోల డీజిల్ ఖర్చులు ఇవ్వకపోవడంతో ఆ భారమంతా లబ్ధిదారులపైనే పడుతోంది.

**ఇంటికి తీసుకొస్తే రూ.50 ఇవ్వాల్సిందే**

జిల్లాలో 2,44,034 కనెక్షన్లున్నాయి. ఒక్కో సిలిండర్ నెల నుంచి మూడు నెలల



పాటు వినియోగిస్తున్నారు. సాధారణంగా నిత్యం గ్యాస్‌ను ఇళ్లకు చేరవేయాల్సి ఉంటుంది. ఇందుకు గాను డెలివరీ బాయ్ ఒక్కొక్కరి నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన రూ.12 లక్షల వరకు భారం పడుతున్నట్లు అంచనా. ఇక బ్లాక్‌లో తెచ్చుకోవాలన్నా, హోటళ్లకు సరఫరా చేయాలన్నా రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. పలువురు ఏజెన్సీ నిర్వాహకు లు ఇంత భారీ స్థాయిలో దందా నడిపిస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

**ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం**

గ్యాస్ వినియోగదారుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అదనంగా వసూలు చేయడం సరికాదు. 20 కి.మీ. దూరం దాటితేనే రూ.15 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. వసూళ్లపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందిస్తే ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.మోహన్‌బాబు, డీఎస్‌వో, సూర్యాపేట

## జలమయం.. అంతా అస్తవ్యస్తం



సిరిసిల్ల : సంజీవయ్య కూడలి పక్కన ఉన్న మురుగు కాలువలు శిథిలావస్థలకు చేరుకోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. సంజీవయ్య విగ్రహం నుంచి కొత్త చెరువు వరకు ప్రధాన మురుగు కాలువల లోతు గతంలో ఎక్కువగా ఉండేది. నూతనంగా నిర్మించిన కాలువల లోతు తక్కువగా ఉండటంతో నీరు ఇలా రోడ్లపైకి వస్తోందని స్థానికులు చెబుతున్నారు.

సిరిసిల్ల పట్టణంలో పాత బస్టాండ్ ఎదుట నిలిచిన మురుగు నీరు ఇది. గత ప్రభుత్వం హయాంలో 2021లో చిన్నబోనాల పెద్ద చెరువు తెగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు రూ.70 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మించాగా.. అది ఇప్పుడు సాంకేతిక లోపం వల్ల నిరుపయోగంగా మారిందని.. దీంతో మురుగు ముందుకు కదలకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

సిరిసిల్ల పట్టణంలో ఆదివారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికే ముంపు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడక్కడ మురుగు నీరు భారీగా నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సమస్యలు, కారణాలపై కథనం.

**వ్యర్థాలు పేరుకొని..**

సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలో ఇటీవల 40 అడుగుల మేరకు రోడ్డు విస్తరించారు. ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించారు. వీటిపై ఇంటి యజమానులు పైకప్పులు వేయడంతో అందులోని వ్యర్థాలు తొలగించే ఆస్కారం లేకుండా పోవడంతో నీరు రోడ్డుపైకి వస్తోంది. ఇటీవల ఈ మురుగు కాలువలోని వ్యర్థాలను మున్సిపల్ అధికారులు యంత్రాల సాయంతో 4 ట్రాక్టర్లు వ్యర్థాలు తొలగించినట్లు పారిశుద్ధ్య అధికారులు చెబుతుండటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. **ఈ ఇళ్లలో నివాసమెలా?** తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరిందని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి ఇళ్లలోకి పైనుంచి వచ్చిన వరద చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి తమ ప్రాంతంలో పెద్దఎత్తున ఇలా నీరు నిలుస్తోందని.. అధికారులు స్పందించి సమీపంలోని కాలువ గుండా నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

## యథేచ్ఛగా అమ్మకాలు.. పడకేసిన తనిఖీలు



జగిత్యాల : జిల్లాలో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అరికట్టాల్సిన ఆబ్కారీ శాఖ సోదాలు మరచిపోవడంతో పేదలు నివసించే ప్రాంతాల్లో యథేచ్ఛగా అమ్మకాలు జరుగుతున్నాయి. జగిత్యాల, మెట్‌పల్లి డివిజన్ల పరిధిలో ఇటీవలి కాలంలో విక్రయాలు పెరిగాయి. జిల్లాకేంద్రం సమీపంలోని నూకపల్లి అర్బన్‌కాలనీ, టీఆర్‌నగర్‌లతో పాటు సమీప ఇటుక బట్టీల్లో గుడుంబా తయారు చేసి ప్యాకెట్లలో అమ్ముతున్నారు. రెండు రోజుల కిందట నూకపల్లి అర్బన్‌కాలనీలో ఇద్దరు మహిళలు నాటుసారా విక్రయిస్తుండగా సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని 7 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు.

**బైండోవర్ చేసి.. మమ అనిపించి..**

ఎక్సైజ్ శాఖ మెట్‌పల్లి డివిజన్ పరిధిలో నాటుసారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కోరుట్ల పట్టణంలోని ఏసుకొనిగుట్ట, అర్బన్‌కాలనీ, అయ్యప్పగుట్ట పరిసర ప్రాంతాల్లో అనుమతి లేకుండా తయారు చేసిన కల్లు ప్యాకెట్లను విక్రయిస్తుండటంతో కూలీలు, నిరుపేదలు, యువకులు విచ్చలవిడిగా తాగుతూ ఆరోగ్యం గుల్ల చేసుకుంటున్నారు.

గోదావరి పరీవాహక ప్రాంతమైన మల్లాపూర్ మండలంలో గుడుంబా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విక్రయదారులను నామమాత్రంగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి చేతులెత్తేస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్, తిమ్మాపూర్ తండాల్లో, వేములకుర్తిలో సారా విక్రయాలు కొనసాగుతున్నాయి.

కథలాపూర్ మండలంలోని అటవీ ప్రాతంలో తయారు చేసిన సారాను గిరిజన గ్రామాల్లో అమ్ముతున్నారు. ః మెట్‌పల్లి మండలంలోని ఓ తండాలో సారా విక్రయిస్తుండగా కొద్ది నెలల కిందట ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కోరుట్ల పట్టణ శివారు గ్రామాల్లోనూ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**పేదల ఆవాసాల్లో దందా**

జిల్లాకేంద్రంలో కూలీలు నివసించే ప్రాంతాల్లో గుడుంబా దందా సాగుతోంది. కొందరు ఆటో డ్రైవర్లు, రిక్షావాలాలు, కొందరు కూలీలు నాటుసారాకు బానిసలవడంతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**నిఘా పెంచుతాం**–సర్వేశ్వర్, ఆబ్కారీ సీఐ, జగిత్యాల

పలు ప్రాంతాల్లో గుడుంబా విక్రయాలు కొనసాగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. సోదాలు నిర్వహించి అరికడతాం. ఇప్పటికే నెలలో ఒకరిద్దరిని పట్టుకుంటున్నాం. ఇంకా నిఘా పెంచుతాం. నూకపల్లి అర్బన్‌కాలనీ, టీఆర్‌నగర్‌లలో అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

## పరీక్షలా.. ప్రైవేటుకు వెళ్లాల్సిందే..!



నల్గొండ :నకిరేకల్ మండల పరిధిలోని కడపర్తి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెండు రోజులక్రితం జ్వరంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు డెంగీ, మలేరియా, ప్లేట్‌లెట్స్, సీబీపీ, లివర్ నిర్ధారణ పరీక్షలు రాశారు. దీనికోసం రక్తపూతలు సేకరించిన స్థానిక ఆసుపత్రి సిబ్బంది టీడీహబ్‌కు పంపారు. ఇక్కడ మిషన్లు పనిచేయడం లేదని తెలుపడంతో బాధితులు రెండు రోజుల తరువాత ప్రైవేటుకు వెళ్లి మరోసారి రక్తపూతలు ఇచ్చి రూ.2వేలు ఖర్చు చేసి పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లు ఏర్పాటు చేసింది. కానీ ఆచరణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల జిల్లా ఆసుపత్రి పునర్నిర్మాణంతో యంత్రాలను మరో ప్రాంతానికి తరలించారు. ఇవి తరచూ మరమ్మతులకు గురి కావడంతో రక్త పరీక్షలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. టీడీహబ్‌లో 130 వరకు రక్తపరీక్షలు జరుగుతాయని అధికారులు చెప్పినా.. ప్రస్తుతం 10 నుంచి 15 రకాల మాత్రమే చేస్తున్నారు.

**నెరవేరని లక్ష్యం...**

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రక్తపూతలు ఏరోజుకారోజు ఫలితాలు ఇవ్వడం లేదు. ఫలితాలను మరుసటి రోజు ఇస్తున్నారు. దీంతో పరిస్థితి మరింత తీవ్రం అవుతుందని బాధితులు వాపోతున్నారు. ప్రారంభంలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉన్న టీడీహబ్ సేవలు ఇటీవల జనరల్ ఆసుపత్రి పరిధిలోకి మార్చారు. అప్పటి నుంచి వసతుల కల్పనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జనరల్ ఆసుపత్రి నుంచి నిత్యం ఇక్కడకి వెయ్యికి పైగా రక్తపూత నమూనాలు వస్తున్నాయి. పరికరాలు పనిచేయని కారణంగా కొద్ది రోజుల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల నుంచి సేకరించడం లేదు. వర్షాకాలం విషజ్వరాలతో పాటు డెంగీ ఇతర వ్యాధులతో జిల్లావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు యంత్రాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

**అన్ని జరుగుతున్నాయి**

టీడీహబ్‌లో అన్నిరకాల అత్యవసర రక్తపరీక్షలు జరుగుతున్నాయి. తాత్కాలిక సమస్యల ద్వారా ఒకటి రెండు రోజులు కొన్నిరకాల పరీక్షలు ఆగినా తిరిగి యథావిధిగా కొనసాగిస్తున్నాం. ఇక్కడ లేని పరికరాలు, వాటికి కావాల్సిన లిక్విడ్ వంటివి ఇతర జిల్లాల నుంచి తెప్పించి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. డా.పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో

## చేపా.. చేపా బంగ్లాదేశ్ ఢాకా..!

దేవరకొండ : చేపా.. చేపా.. నీకెందుకంత డిమాండ్ అని అడిగితే.. 'స్వచ్ఛమైన కృష్ణా జలాల్లో పుట్టి పెరిగాను.. ఒక్కసారి రుచి చూస్తే ఎవరైన మళ్లీ మళ్లీ కావాలంటారూ.. అందుకే నాకంత రేటు' అంటుందేమో.. అవును మరీ నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ పరిధి జలాశయాల్లో చేపలు యమరుచిగా ఉంటాయనే పేరుతో వర్ధిల్లుతోంది. పెంపకంగా దొరికే వాటికన్న వాగులు, వంకలు, చెరువుల్లో ప్రకృతిలో లభించే చేపలను తినడానికి మక్కువ చూపుతారు. నాగార్జునసాగర్ వెనుకజలాల్లో దొరికే చేపలంటే భోజన ప్రియులకు మరీ ఇష్టం. ఇక్కడి ఎండు, పచ్చిచేపలు రాష్ట్రాలు దాటి విదేశాలకూ తరలివెళ్తున్నాయి. కృష్ణానదిలో పెరిగిన ఈ చేపల రుచి కొంత తియ్యగా, చప్పగా ఉండటంతో బంగ్లాదేశ్ దేశ వ్యాపారులు, జల పుష్పాలపై ఎక్కువ ప్రీతి ఉన్న పశ్చిమబెంగాల్‌తోపాటు అసోం రాష్ట్రాల వారు ఎక్కువగా కొనుగోలు చేస్తుండంతో రాష్ట్రంలోనే దేవరకొండ ప్రాంతంలో లభ్యమయ్యే చేపలకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. అందుకే తెలంగాణలోనే దేవరకొండ ఎండు చేపల మార్కెట్ మొదటిస్థానంలో నిలుస్తోంది. రెండోస్థానం కరీంనగర్‌గా ఉంది.

**కిస్కా రకానికి మరింత ప్రాధాన్యం..**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దుల్లోని నాగార్జునసాగర్ జలాశయం దేవరకొండ నియోజకవర్గంలో విస్తరించి ఉంది. సాగర్ వెనుకజలాలు ఈ ప్రాంతంలో 50 కిలోమీటర్ల వరకు ఆవరించి ఉండడంతో ఇక్కడి మత్స్యకారులు వలలతో చేపలు పట్టి విక్రయిస్తూ జీవనం పొందుతున్నారు. నల్లమల అడవులు, కృష్ణపట్టి గుట్టల మధ్య కృష్ణానది ప్రవహిస్తుండటంతో ఆ నీటిలో లభించే అన్ని రకాల చేపలు చాలా రుచిగా ఉండేందుకు



కారణమవుతున్నాయి. ప్రకృతి ఆధారంగా ప్రవహించే పౌష్టిక పోషకాలు, ఇక్కడి ఒండ్రు మట్టి ప్రభావంతో చేపలు యమరుచిగా ఉంటాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఈ నీరు తాగేందుకు సైతం తియ్యగా ఉండటంతో చేపలూ అదే స్థాయిలో రుచిగా ఉండడంతో ఒక్కసారి తిన్నవారు మళ్లీ కావాలని కోరుకుంటుండటంతో దేవరకొండ ప్రాంతలో చేపల విక్రయాలు జోరందుకున్నాయి. 'కిస్కారకం' చేపలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దేవరకొండ మార్కెట్ నుంచి ఎండు చేపలు వారానికి 300 నుంచి 500 టన్నులు బంగ్లాదేశ్ (ఢాకా), అసోం, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

## మిగిలితే పంచు.. ఆకలి తీర్చు

సూర్యాపేట : ఆగస్టు నెలలో వివాహాది శుభకార్యాలు ఎక్కువగా ఉన్నాయి. అంచనాకు మించి ఆహారం వండిస్తారు. గతంలో చికెన్, మాంసం, పప్పు వంటి వాటితో ఆతిథ్యం ఇచ్చేవారు. ప్రస్తుత తరుణంలో బిర్యానీ, రోటీ, చికెన్, మాంసం, చేపలు తదితరాల వేపుళ్లతో వంటకాలు తయారు చేస్తున్నారు. వీటిలో అంచనాలు పాటించక చాలా వరకు వృథా అవుతున్నాయి. దానిని ఎవరికీ ఇవ్వాలో తెలియక పారేస్తున్నారు. కొంచెం ఆలోచన చేస్తే అనాథాశ్రమాలు, యాచకుల కడుపు నింపొచ్చు.

**తర్వాత రమ్మని.. పడేస్తారు**

పెద్దవారి నుంచి మధ్య తరగతి వరకు వివిధ రకాల వేడుకలను వైభవంగా చేస్తున్నారు. వంటలు కూడా వాటికి తగినట్టే పెడుతున్నారు. భోజన సమయంలో భిక్షాటన చేసేవారు వస్తే వారిని తర్వాత రమ్మని పంపిస్తారు. కార్యక్రమాలు పూర్తయి.. భోజనం మిగిలితే వాటిని యాచకులకు అందించటం లేదు. ఉదయం, రాత్రి వరకు వేడుకలు జరుగుతున్నాయి. ఆ సమయంలో వారు ఎక్కడో ఒకచోట కడుపునింపుకొని నిద్రలోకి జారుకుంటారు. తీరా మిగిలిన భోజనాన్ని యజమానులు పడేస్తున్నారు. పండుగలు, అన్నదానాల సమయంలో కూడా భారీగానే వృథా చేస్తున్నారు. పట్టణాల్లో జరిగే ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని తీసుకెళ్లే సేవా సంస్థలు ఉన్నాయి.

**కొందరిలోనే మానవతా దృక్పథం..**

మానవతా దృక్పథంతో ఆలోచించేవారు ఆహారాన్ని వృథా చేయరు.



అనాథలు, బిచ్చగాళ్లు, నిరాశ్రయులకు అందించి వారి కడుపునింపుతారు. ఇలాంటి వారు ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా అనేక మంది ఉన్నారు. బృందంగా ఏర్పడి ఫంక్షన్ల నిర్వాహకులను సంప్రదిస్తూ ఆహారం మిగిలితే తమకు సమాచారం అందించాలంటూ చెప్పి వెళ్తారు. వారే డబ్బాల్లో తీసుకెళ్లి ఆహారాన్ని సేకరించి అనాథలకు అందిస్తూ మానవత్వం చాటుకుంటారు.'శుభకార్యాలు, వివిధ కార్యక్రమాలు జరిగే ఫంక్షన్ హాళ్లు, సామాజిక భవనాల వద్ద అనాథాశ్రమాలు, స్వచ్ఛంద సంస్థలు, ఫుడ్ బ్యాంక్ నిర్వాహకుల ఫోన్ నంబర్లు సమాచార బోర్డు ఏర్పాటు చేస్తే మిగిలిన ఆహారాన్ని సకాలంలో అన్నార్థులకు అందించే అవకాశం ఉంటుంది.'

**ఏటా 6.28 కోట్ల కిలోలు వృథా**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 11,42,708 కుటుంబాలు ఉన్నాయి. ఆహార వృథా సూచిక ప్రకారం ప్రతి కుటుంబం ఏడాదికి సగటున 55 కిలోల ఆహారం వృథా చేస్తున్నట్లు తేల్చింది. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 6.28 కోట్ల కిలోల ఆహారం వృథా అవుతున్నట్లు అంచనా. వీరే కాకుండా వివాహ వేడుకలు, ఇతర కార్యాలలో ఇది ఎక్కువగానే ఉంటుంది

**అనాథాశ్రమానికి అందిస్తున్నా**

హోటల్‌లో మిగిలిన భోజనాన్ని రాత్రిపూట అనాథాశ్రమానికి అందిస్తున్నాను. బస్టాండ్లలో భిక్షాటన చేసేవారికి కవర్లలో కట్టి ఇస్తాను. ఇదివరకు ప్రభుత్వ కార్యాలయంలో క్యాంటీన్ నిర్వహించాను. ఆ సమయంలోనూ మిగిలిన భోజనాన్ని పేదలు, నిరాశ్రయులు, అనాథలకు ఇచ్చాను. మిగిలిన భోజనం అందించి పేదల కడుపునింపడం సంతోషంగా ఉంది.కడారి సతీష్, హోటల్ నిర్వాహకుడు, సూర్యాపేట

## ప్రయాణం.. ప్రేరణ మార్గం

కోదాడ : ఆధునిక కాలంలో యువత పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. దీన్ని తట్టుకోలేక ప్రాణాలు సైతం వదిలేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం లేచింది మొదలు నిద్రపోయే వరకు హడావుడి జీవితం గడుపుతున్నారు. ఒత్తిడి అధిగమించే మార్గాల్లో భాగంగా క్షేత్ర పర్యటనలు, విహారయాత్రలు ముఖ్యమని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల్లో బిజీగా గడిపే యువత క్షేత్ర పర్యటనలకు వెళ్తూ ఒత్తిడిని దూరం చేసుకుంటున్నారు. పనిలో నిమగ్నం అవుతూ కొన్ని రోజులు ఇలా వెళ్తూ తిరిగి పనుల్లో మునిగిపోతున్నారు. మరికొందరు వారాంతాల్లో కుటుంబ సభ్యులతో వినోద, విహారయాత్రలకు ఎక్కువ సమయం కేటాయిస్తూ జీవితాన్ని ఆనందంగా మలచుకుంటున్నారు.

**ప్రణాళికతో పర్యటనలు**

చిన్ననాటి మిత్రులు, తోటి ఉద్యోగులు, ఇరుగు పొరుగు వారు సందర్భం ఏదైనా అంతా ఒకటిగా కలిసి ఎక్కడికి వెళ్లాలో నిర్ణయించుకుంటు న్నారు. కావాల్సిన నగదును పోగు చేసుకోవడం, సదుపాయాల ఏర్పాటు, రవాణా ఖర్చు, తినేందుకు ఆహారం లాంటి వాటిని సమష్టి బాధ్యతగా తీసుకుని



వివిధ ప్రదేశాలకు వెళ్తున్నారు. హైదరాబాద్‌తో పాటు పాఖాల చెరువు, రామప్ప దేవాలయం, బొగత జలపాతం, నాగార్జునసాగర్, దేవరకొండ, అమ్రాబాద్ అటవీ పర్యటనలు వంటి చిన్న చిన్న ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. యువకులు ఒక బృందంగా ఏర్పడి సుదూర ప్రాంతాలకు వెళ్లేలా ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల్లోని జలపాతాలు, బీచ్‌లు, పర్వత ప్రాంతాలు, దేవాలయాలను సందర్శిస్తున్నారు.

**ఒత్తిడి దూరం చేసేలా**

గత నాలుగేళ్లుగా పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాను. మానసిక ఒత్తిడి తీవ్రంగా ఉండేది. మిత్రులతో కలిసి విహారయాత్రలకు వెళ్తుంటాను. ఏడాదిలో కనీసం రెండుసార్లు బయటి ప్రదేశాలకు వెళ్లడం అలవాటుగా మారింది. మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు కర్ణాటకలోని దండేలి, గోకర్ణ, తమిళనాడులోని మహాబలిపురంలాంటి చరిత్రాత్మక ప్రదేశాలకు వెళ్లాం. దీనివల్ల మానసిక ప్రశాంతత ఏర్పడుతోంది.చేకూరి అశోక్, కొత్తగూడెం

**వ్యాపార ఒడిదొడుకులు తట్టుకునేలా**

వ్యాపార రంగంలోకి అడుగు పెట్టినప్పటి నుంచి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కోవాల్సి వచ్చింది. లాభం వచ్చినప్పుడు ఎంత సంతోషిస్తామో, నష్టం వచ్చినా అలాగే నిలబడాల్సి ఉంటుంది. ఒత్తిడిని అధిగమిస్తూ వ్యాపారంలో ముందుకు వెళ్తున్నాను. దీనికోసం మధ్యమధ్యలో అలా విహారయాత్రలకు వెళ్తుంటాం. ఏపీలోని లంబసింగి, మారేడుమిల్లి లాంటి ప్రదేశాలకు మిత్రులతో కలిసి వెళ్తూ ఉంటాను. తిరిగి వచ్చాక ఎవరి పనుల్లో వారు మునిగిపోతాం.పల్లా నవీన్, కోదాడ

# ఆశావహుల్లో చందాల గుబులు

మునగాల : గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి, ఈసారి కూడా ఏదో ఒక పదవిని కైవసం చేసుకోవాలనే ఉత్సాహంతో కొందరు నాయకులు ఉన్నారు. గతంలో ఓడిన అభ్యర్థులు, నూతనంగా పోటీ చేయాలనుకునే వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. స్థానిక ఎన్నికలు వస్తే ఎంత ఖర్చు చేయాలనే లెక్కలు ఇప్పటి నుంచే వేసుకుంటున్నారు. అయితే దీనికంటే ముందు వినాయక చవితి, దేవీ నవరాత్రులు సమీపిస్తుండటంతో ఆశావహుల్లో చందాల బెంగ పట్టుకుంది. యువత ఓట్లను ఆకర్షించాలంటే ఈ ఖర్చుకు వెనకాడే పరిస్థితి లేదు. వార్డుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులను ఆకట్టుకోవాలంటే భారీగా చందాలు ఇవ్వాల్సిందే.



అయితే ఆశావహులను ఓ సందేహం వెంటాడుతోంది. ఒకవేళ తమకు సంబంధించి రిజర్వేషన్ అనుకూలంగా రాకపోతే ఇప్పుడు చేసే ఖర్చు మొత్తం వృథాగా పోతుందనే భావన వారిలో నెలకొంది.

గ్రామాలు, మండలాలు, పట్టణాలు, వార్డుల్లోని పలువురు ఆశావహులు సర్పంచి, ఎంపీటీసీ, జట్పీటీసీ, పట్టణాల్లోని వార్డుల్లో కౌన్సిలర్ పదవులకు పోటీ చేయాలని ఉత్సాహంతో ఉన్నారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తే ఖర్చు కోసం డబ్బులు ఎలా సర్దుబాటు చేయాలి. ఎంత ఖర్చవుతుందనే లెక్కలతో ఇప్పటి నుంచే వారు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. కానీ అనుకోకుండా ఈ ఉత్సవాలు ఖర్చు పెంచుతున్నాయని సతమతమవుతున్నారు.

# పల్లె 'విల్లా'సం

తిరుమలగిరి : ఒకప్పుడు పట్టణాల్లో ధనవంతులు తమ అభిరుచులకు అనుగుణంగా హోదాకు తగినట్లు, విలాసవంతమైన భవనాలు కట్టించుకునేవారు. నేడు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం గ్రామీణులు పట్నం బాట పడుతున్నారు. కానీ పల్లె వాసనలు మరవడంలేదు. ప్రశాంత వాతావరణం కోసం సొంతూళ్లకు వచ్చి సేద తీరుతున్నారు. ఇక్కడే ఆధునిక వసతులతో విల్లాలు నిర్మించుకుంటున్నారు.

**అమెరికా నుంచి వస్తున్నారని..** నూతనకల్ మండలం యడవెల్లి గ్రామానికి చెందిన తక్కెళ్లపల్లి సోమేశ్వరావు, రుక్కమ్మల చిన్న కుమారుడు తక్కెళ్లపల్లి దేవేందర్‌రావు అమెరికాలో ప్రఖ్యాత వైద్యుడిగా స్థిరపడ్డారు. యాభై ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. కొద్దిరోజుల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. తన శేషజీవితం స్వగ్రామంలో గడపాలని నిర్ణయించుకున్నారు. తనతోపాటు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అన్న కుమారుడు ప్రవీణ్‌రావు సైతం కొన్నిరోజులు సొంతూరులో ఉండాలని నిర్ణయించుకున్నారు. తన అన్న పెద్ద కుమారుడు ప్రభాకర్‌రావు దృష్టికి తీసుకురాగా ఆయన కుమార్తె అజిత ఆస్ట్రేలియా నుంచి స్వయంగా గ్రామానికి వచ్చి పాత ఇంటి పక్కనే కొత్తగా రెండంతస్తుల భవనాన్ని పూర్తి చేయించారు. రెండెకరాల విస్తీర్ణమున్న ఆవరణలో కొబ్బరి చెట్లు, ఉదయం నడకదారి, పచ్చిక ఏర్పాటు చేశారు.

**ప్రశాంత జీవనానికి ప్రతీక**

మద్దిరాల మండల కేంద్రానికి చెందిన సరెడ్డి వెంకట్‌రెడ్డి–సులోచన దంపతులకు ఇద్దరు కుమారులు. వారిద్దరూ ఉన్నత చదువులు అభ్యసించి పట్టణాల్లో స్థిరపడ్డారు. వెంకట్‌రెడ్డి దంపతులు మాత్రం పల్లెటూరిలో స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం లభిస్తుందని పట్నంలో ఉన్నట్లే అందమైన ఇల్లు నిర్మించారు.

పిల్లలకు కూడా పల్లె వాతావరణం అంటేనే మక్కువ. గ్రామాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు. వాటిని కాపాడుకుని భవిష్యత్తు తరాలకు అందించడం మన బాధ్యత అంటున్నారు.

**ఇవీ అనుకూలతలు**స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. పిల్లల ఆటపాటలకు అనుకూలమైన స్థలం ఉంటుంది. మరోవైపు పట్టణాల్లో వలెనే నిరంతర విద్యుత్తు సరఫరా జరుగుతోంది. రహదారులు, మిషన్ భగీరథ నీటి సౌకర్యం ఉంది. సొంతూరును చూసినట్లు బంధువులు, గ్రామస్థులను కలిసినట్లుం టుంది.ఎప్పటికైనా గ్రామంలో ఉండాలనివృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాం. ఎప్పటికైనా సొంత గ్రామాలకు రావాల్సి వస్తుందని, మా స్వగ్రామం తాటిపాములలో ఇష్టంతో మంచి ఇల్లు కట్టుకున్నాను. పట్టణాల వలెనే సౌకర్యవంతంగా నిర్మించాం.కోల మహేశ్, తాటిపాముల

# సహకార ఎన్నికలపై ఉత్కంఠ

ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 14తో పాలకవర్గాల గడువు ముగుస్తుంది. ఇంతవరకు ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి సంకేతాలు వెలువడలేదు. దీంతో ఎన్నికలు నిర్వహిస్తారా లేక పాలకవర్గ పదవీకాలాన్ని మరోసారి పొడిగిస్తారా అన్న ఉత్కంఠ నెలకొంది. 2019, ఫిబ్రవరిలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. అయిదేళ్ల తర్వాత వీటికి ఎన్నికలు నిర్వహించాలి. గడువు ముగిసిన తర్వాత ఆరు నెలల పాటు పదవీకాలం పొడిగించారు. అదికూడా మరో మూడు రోజుల్లో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంపై ఆసక్తి నెలకొని ఉంది. గడువు పొడిగింపు విషయంలో గతంలో చివరి నిమిషంలో ప్రభుత్వం నిర్ణయం వెలువరించింది. ఆగస్టు 15న సంఘాలు, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల ఎదుట జాతీయ జెండాను ఎగురవేయాల్సి ఉంటుంది. ఈ అవకాశం తమకు దక్కుతుందా లేదా అనే దానిపై అధ్యక్షుల్లో ఆసక్తి నెలకొంది.

**నామినేటెడ్ విధానంలో..?**

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రస్తుతం నామినేటెడ్ విధానంలో పదవులను భర్తీ చేస్తున్నారు. సహకార సంస్థల్లో కూడా ఇదే పద్ధతిని ప్రభుత్వం అనుసరించే యోచన ఉన్నట్లు కొంత ప్రచారం జరుగుతోంది. ఎన్నికల వ్యయాన్ని తగ్గించుకోవటంతోపాటు ప్రభుత్వ అనుకూల వర్గాలకు చెందిన వారికి పదవులను కట్టబెట్టుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇది ఎంతవరకు సాధ్యమన్నదాన్నీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

**ఖమ్మం డీసీసీబీ పరిధిలో సంఘాలు...**


ఖమ్మం 76

భద్రాద్రి 21

ములుగు 02

మహబూబాబాద్ 02 వీటితోపాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు(డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల(డీసీఎంఎస్) పదవీ కాలం ఈ నెల 17తో ముగుస్తుంది. ఉమ్మడి జిల్లాల స్థాయిలో ఇవి కీలక పదవులు. సంఘాలపై తీసుకునే నిర్ణయాన్ని బట్టే వీటి పరిస్థితి ఆధారపడి ఉంటుంది.

# మరోసారి నిరాశే



పెద్దపల్లి : ప్రతిపాదిత ఎన్‌హెచ్‌లు..

1.జగిత్యాల నుంచి ధర్మారం, పెద్దపల్లి, మంథని మీదుగా కాటారం

2.పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ మీదుగా మోరంచపల్లి (భూపాలపల్లి జిల్లా)

3.జనగామ నుంచి సిద్దిపేట, సిరిసిల్ల, కోరుట్ల

4.కరీంనగర్ నుంచి సిరిసిల్ల మీదుగా కామారెడ్డి, పిట్లం

5. రాజీవ్ రహదారి

రాష్ట్ర రహదారుల ఉన్నతీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు కేంద్రం తిరస్కరించడంతో ఉమ్మడి జిల్లాకు మరోసారి నిరాశే ఎదురైంది. ప్రధానమైన రాజీవ్ రహదారితోపాటు మరికొన్ని ముఖ్య రహదారులను అభివృద్ధి చేసి, జాతీయ హోదా కల్పించాలని గత డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం పలు సాంకేతిక అవరోధాలు ఎదురవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వమే వాటిని స్వయంగా అభివృద్ధి చేసుకోవాలని లేఖలో పేర్కొనడంతో ప్రతిపాదిత రహదారుల అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**ఎప్పటికీ రాష్ట్ర రహదారిగానే?**

నిత్యం వాహనాల రద్దీతో ఉండే రాజీవ్ రహదారిపై బొగ్గు, ఇసుక రవాణాతో ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. కానీ ఈ రహదారి నేరుగా ఇతర రాష్ట్రాలకు అనుసంధానం లేకపోవడంతో జాతీయ హోదా కల్పించేందుకు మొదటి నుంచి కేంద్రం మోకాలడ్డుతోంది. సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల జిల్లా ఇందారం వరకు విస్తరించిన ఈ రహదారి ఉమ్మడి జిల్లా పరిధిలో 115 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డు ఇందారం వద్ద రెండు వైపులా వెళ్లే జాతీయ రహదారితో అనుసంధానమవుతుంది. ఒకవైపు గడ్చిరోలి, మరోవైపు నాగపూర్ వైపు వెళ్లే రహదారులకు అనుసంధానమవుతుంది. కానీ రెండింటికి కూడలిగా మారిన ఈ రోడ్డు మాత్రం ఇప్పటికీ రాష్ట్ర రహదారిగానే మిగిలిపోయింది. ఇదేమాదిరిగా కోదాడ నుంచి కరీంనగర్ మీదుగా రాయపట్నం వెళ్లే రాష్ట్ర రహదారిలో కరీంనగర్ వరకు జగిత్యాల– వరంగల్ జాతీయ రహదారి పరిధిలోకి వెళ్తుండగా కరీంనగర్ నుంచి రాయపట్నం వరకు రాష్ట్ర రహదారిగానే మిగిలిపోనుంది. ఈ రెండు కూడా రెండు వైపులా జాతీయ రహదారులతో అనుసంధానమవుతాయి.

**పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల మీదుగా..**

ఉమ్మడి జిల్లాలో జగిత్యాల మీదుగా ఇప్పటికే ఒక జాతీయ రహదారి ఉండగా, కరీంనగర్, వరంగల్ మీదుగా కోదాడ వరకు రహదారి నిర్మాణ దశలో ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి పలు ప్రాంతాల్లో భూసేకరణ జరగాల్సి ఉంది. కాగా రాజీవ్ రహదారితోపాటు పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు జాతీయ రహదారులు పత్రాలకే పరిమితయ్యాయి. రహదారుల ఉన్నతీకరణకు చేసిన ప్రతిపాదనలు పట్టాలెక్కేలా ఉమ్మడి జిల్లా నేతలు మరోసారి ప్రయత్నించాల్సిన అవసరం ఉంది..

# రంగు చెప్పేస్తారు.. గుట్టు విప్పేస్తారు



సారంగాపూర్ : ఆ బాలికలు కళ్లకు గంతలు కట్టుకొని ముందు నిలబడిన వారి దుస్తుల రంగులు చెబుతారు.. ఎదుట ఉంచిన అక్షరాలను చదువుతారు.. నంబర్లు చెబుతారు.. పరిచయం ఉన్న వ్యక్తులెవరైనా ముందు నిలబడితే స్పర్శతోనే వారెవరో గుర్తిస్తారు.. చరవాణిలోని చిత్రాలనూ చెప్పేస్తారు.. వీరి ప్రతిభను స్వయంగా చూసిన కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేలా వారి ఆలోచనలను నియంత్రించడానికి చేపట్టిన బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా మారుతోంది. మెదడు చురుగ్గా ఉండటం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడానికి ఇది దోహదపడుతోంది. ఇటీవల సారంగాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలోని 9వ తరగతి విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. దీంతో వారు కళ్లకు గంతలు కట్టుకుని ఏదైనా చెప్పగలుగుతున్నారు.

**తొమ్మిది వారాలపాటు..**

హైదరాబాద్‌లోని శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలోని కన్హా శాంతివనం ధ్యాన కేంద్రం నిర్వాహకులు జగిత్యాల, సారంగాపూర్ కస్తూర్బాగాంధీ విద్యాలయాల నుంచి పలువురు ఉపాధ్యాయినులను బ్రైటర్ మైండ్స్ కార్యక్రమానికి ఎంపిక చేశారు. సారంగాపూర్ కేజీబీవీ ఉపాధ్యాయినులు రజిత, ప్రియదర్శిని, మంజులత శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా గతేడాది చివరి నుంచి ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు నేర్పించారు. ఇందులో మెదడు, కళ్లు, శ్వాస వ్యాయామం, మోటివేషన్ ప్రసంగం, రిలాక్సేషన్ వంటి అంశాలను నేర్పిస్తున్నారు. 40 నిమిషాల పాటు బ్రైటర్‌మైండ్స్ సంగీతాన్ని వింటూ పడుకోవాలి. లేచిన తరువాత కళ్లకు గంతలు కట్టి స్పర్శ, వాసన, శబ్దం.. ఆధారంగా ఎలా గుర్తించాలో సాధన చేయిస్తారు. దాదాపు తొమ్మిది వారాల పాటు శిక్షణ ఇస్తున్నారు. 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు ఏకాగ్రత ఎక్కువగా ఉండటం వల్ల సులభంగా నేర్చుకోగలుగుతారని వారిని గుర్తించి శిక్షణ ఇస్తున్నారు.

**ఆలోచనల నియంత్రణకు ఉపయుక్తం**

– ముత్తునూర్ ప్రణీత, విద్యార్థిని

ఒత్తిడికి లోనవకుండా ఆలోచనలు నియంత్రించేందుకు బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది. నేర్చుకోవడం సులభంగా ఉండటంతో పాటు ఏకాగ్రతతో పని చేస్తే ఏదైనా సాధించవచ్చని అర్థమైంది. కళ్లకు గంతలు కట్టుకుని కూడా సులభంగా చెప్పవచ్చని తెలిసింది.

**వ్యసనాల నుంచి విముక్తికీ మార్గం**

– ప్రియదర్శిని, శిక్షణ ఉపాధ్యాయురాలు

15 ఏళ్లలోపు పిల్లలు ఏది చెప్పినా త్వరగా గ్రహించి గుర్తుంచుకుంటున్నారు. వ్యసనాల బారిన పడిన యువతకు ఈ కార్యక్రమాలు ఉపయోగతాయి. జగిత్యాలకు చెందిన వ్యాపారి మంచాల కృష్ణ బ్రైటర్‌మైండ్స్ కిట్స్ సమకూర్చడంతో పాఠశాల బాలికలందరికీ శిక్షణ ఇచ్చే వీలు కలిగింది.

# నిర్మాణ లోపాలే శాపాలు



చిట్యాల : దక్షిణ భారతదేశంలోనే రద్దీగా ఉండే దారుల్లో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి(65) ఒకటి. ఇది ఉమ్మడి జిల్లాలోని పది మండలాలు 54 గ్రామాల నుంచి వెళ్తూ 158 కిలోమీటర్లు విస్తరించి ఉంది. రాచబాట నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణలో చేపట్టిన నిర్మాణ లోపాల వల్ల జరిగే ప్రమాదాలను ఎవరూ పట్టించుకోవడం లేదు.

**పెరుగుతున్న ప్రమాదాలు**

బారికేడ్లు, వేగ నియంత్రికలు, విద్యుత్తు దీపాలు, ప్రమాదపు హెచ్చరిక బోర్డులు, రోడ్డుకిరువైపులా గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. హైవే వెంట విస్తరించి ఉన్న గ్రామాల్లో 22 చోట్ల అండర్‌పాస్ వంతెనలు నిర్మించాలి. జిల్లా వ్యాప్తగా 23 ప్రాంతాల్లో గ్రిల్స్ అమర్చాలి. జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే చోట వైజంక్షన్లు అసంపూర్ణంగా నిర్మించడంతో అవి వినియోగించడం లేదు. దీంతో వాహనదారులు వీటిని ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్‌హెచ్ 65పైన నిత్యం సగటున ఇద్దరు మృతి చెందుతున్నారని గతంలో పోలీసులు నిర్వహించిన సర్వేలో తేలింది. గుత్తేదారు సంస్థ పర్యవేక్షణ లోపం, వేగ నియంత్రణలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం, అధికారులకు, జాతీయ రహదారి ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)కు మధ్య ఉన్న సమన్వయ లోపం తదితర కారణాలతో ప్రమాదాలు పెరుగుతున్నాయి.

**సమస్యలు ఇలా..**

చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి వద్ద ప్రధాన రహదారి వెంట కొంతకాలంగా విద్యుద్దీపాలు వెలగడం లేదు. వట్టిమర్తి స్టేజీ వద్ద విద్యుద్దీపాలు, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ఏళ్లుగా స్థానికులు కోరుతున్నారు. పెట్రోల్ బంకులు, దాబా హోటళ్ల వద్ద వాహనాలు నిలిపి తిరిగి వచ్చే క్రమంలో రహదారిపై మట్టి పేరుకుపోతుంది. రెండు నెలలకు ఓసారి అయినా మట్టి తొలగించకపోవడంతో ద్విచక్రవాహనాలు జారి కిందపడుతున్నాయి. పదేళ్ల క్రితం రోడ్డు పక్కన నిర్మించిన డ్రైయినేజీలు ధ్వంసమయ్యాయి. హైవే విస్తరణ పూర్తయి పదేళ్లు దాటిపోతున్నా నేటికి మురికి కాల్వలను గ్రామాల్లో నిర్మించలేదు. దీంతో వర్షాకాలం మురుగంతా రోడ్లపైనే పారుతోంది.

సర్వీస్ రోడ్ల నిర్మాణం ప్రణాళికా ప్రకారం చేపట్టకపోవడంతో వాటిని దాటేందుకు వాహనదారులు అడ్డదారుల్లో వెళ్తున్నారు. ఎదురెదురుగా ప్రయాణిస్తున్న క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అండర్‌పాస్‌ల నిర్వహణ లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే ఈ బ్రిడ్జిల కింద నీరు నిలుస్తోంది.

**బస్‌షెల్టర్లు నిర్మించాలి**వట్టిమర్తిలో జాతీయ రహదారి విస్తరణలో బస్‌షెల్టర్‌ను తొలగించారు. సర్వీస్ రోడ్డులో నిర్మించకపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే నిల్చోవాల్సి వస్తుంది. అండర్‌పాస్ వంతెన లేక గ్రామస్థులు రోడ్డు దాటుతూ చాలామంది మృతి చెందారు. తొలగించిన డ్రెయినేజీలు, బస్‌షెల్టర్‌తో పాటుగా అండర్ పాస్ వంతెన నిర్మించాలి.బెల్లి సైదులు, చిట్యాల

# నిధులు నీళ్ల'పాలు'

ఖమ్మం : ప్రజాధనాన్ని ఆదా చేయాలన్న ఆలోచన ఎంతమాత్రం ఉన్నా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించరు. నెలకు అక్షరాల రూ.లక్ష నీళ్ల'పాలు' కానీయరు.. పోనీ అందుబాటులో వనరులు లేవా అంటే అదీనూ కాదు. ఖమ్మం నగరంలోని విజయ డెయిరీ చుట్టూ నగరపాలక సంస్థ నీటి పైపులైన్లు ఉన్నాయి. సమీపంలోనే భారీ సామర్థ్యంతో మిషన్ భగీరథ తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు ఉంది. అయినా నిత్యం ప్రైవేటుగా నీరు కొంటూ ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. ఇదేదో పదిపరకో కాదు ఏటా రూ.12 లక్షలు అంటే నమ్మక తప్పదు. కొసమెరుపు ఏమిటంటే అమాత్యులు ఆదేశించేదాకా అటు డెయిరీ అధికారులు, ఇటు పురపాలక యంత్రాంగంలో దీనిపై కదలికే లేదు. ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీలో ప్రస్తుతం ఉభయ జిల్లాల్లో రోజుకు 4వేల లీటర్ల పాలసేకరణ, 8వేల లీటర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో పాల దిగుబడి తక్కువగా ఉండటంతో జనగామ నుంచి అదనంగా 5వేల లీటర్లు తెప్పిస్తున్నారు. నిర్వహణలో భాగంగా ప్రస్తుతం రోజుకు 15వేల లీటర్ల నీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. గత రెండేళ్లకు పైగా ఇదే పరిస్థితి. ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్ దాటిన తర్వాత రోడ్డు పక్కనే సంస్థకు చెందిన బోరు ప్రత్యేకంగా ఉండేది. అక్కడి నుంచే డెయిరీకి నీటి సరఫరా అయ్యేది. రోడ్డు విస్తరణలో బోరు దెబ్బతింది. తర్వాత డెయిరీ ప్రాంగణంలో వేసిన బోరు ద్వారా చాలా తక్కువగా నీళ్లు వస్తున్నాయి. నగరపాలక సంస్థ నీటి కనెక్షన్ ఉన్నా దీనిదీ ఇదే పరిస్థితి. బల్దియాకు వినతులు ఇచ్చి మిన్నకున్న డెయిరీ అధికారులు, డబ్బులు పోతేం ఏం? ఏదో



రూపంలో నీళ్లు వస్తున్నాయికదా అనే భావనలో ఉన్నారు.


**నీరు తప్పనిసరి**

డెయిరీ లోపల ఉన్న మిల్క్‌ప్లాంట్, ట్యాంకులు, పైపులైన్లు, సింటెక్స్ ట్యాంకులు, కూలింగ్ అవసరాల కోసం నీరు అవసరం. పెద్ద పాలక్యాన్లు 200, పాల ప్యాకెట్ల క్రేట్లు 1000 వరకు ఉన్నాయి. వీటన్నింటినీ శుభ్రం చేయాలంటే వేడి, చల్లటి నీరు ఉపయోగించాలి. పాల ఉత్పత్తులు, ఐస్‌క్రీముల తయారీకి ఎక్కువ జలం కావాలి. పాత్రలు శుభ్రం చేయాలంటే వేడి నీరు తప్పనిసరి. వీటితో పాటు 20 మంది సిబ్బంది అవసరాలు సైతం తీర్చేలా ఉండాలిఇటీవల డెయిరీలో పర్యటించిన క్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్రీడయా నీటి కనెక్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ విషయమై విజయ డెయిరీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉప సంచాలకుడు కోడిరెక్క రవికుమార్‌ను సంప్రదించగా నీటి వసతుల కల్పనకు అధికారులు దరఖాస్తు చేసినట్లు చెప్పారు. నగరపాలక సంస్థ ద్వారా నీరు అందితే సుమారు మూడొంతుల నీటి ఖర్చు తగ్గుతుందని, డెయిరీపై ఆర్థిక భారం తొలగుతుందని చెప్పారు.

# రాములోరికి మరిన్ని వన్నెలద్దాలి..!

భద్రాచలం : ఏళ్లుగా అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి ప్రభుత్వాలు వసతుల బాట పట్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రసాద్ 1.0 ద్వారా భద్రాచలం, అనుబంధ పర్ణశాల దేవస్థానాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మూడేళ్ల క్రితం దాదాపు రూ.42 కోట్లతో ప్రారంభమైన పనుల్లో కొన్ని ఇప్పటికే పురోగతిలో ఉన్నాయి. గుత్తేదారు జాప్యంతో ఇంకొన్ని నిదానంగా సాగుతున్నా కొలిక్కివచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాడవీధుల విస్తరణకు పూనుకుంది. ఇదిలా ఉంటే భవిష్యత్తు అవసరాలను అంచనావేసి చూస్తే రాములోరి క్షేత్రానికి మరిన్ని వసతులు అందించాలి. భక్తుల దీర్ఘకాలిక వినతుల్ని పట్టాలెక్కించాలి. ప్రస్తుతం ఆలయ అధికారులు 'ప్రసాద్ 2.0' ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రానికి పంపే ప్రయత్నాల్లో ఉన్నారు. ఆ వివరాలు బయటకు రానప్పటికీ ప్రసాద్ 2.0 ద్వారా భక్తుల ఆశిస్తున్న వాటిపై ప్రత్యేక కథనం.

1. రామాలయాన్ని ఏటా 24లక్షల మంది దర్శించుకుంటున్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సదుపాయం ఉండడంతో ఈ ఏడాది భక్తుల సంఖ్య ఇంకా పెరగనుందని అంచనా.. పర్ణశాలలోనూ రద్దీ కనిపిస్తుంది. భద్రాచలంలో ఇప్పుడున్న కాటేజీలు, సత్రాలు ముఖ్య ఉత్సవాల తరుణంలో కిక్కిరిసిపోతున్నాయి. రెండుచోట్లా వసతి,



కుటీరాలు నిర్మించాలి.

2. ఇప్పుడున్న క్యూలైన్లు రద్దీ వేళల్లో, ఉత్సవ సమయాల్లో అవసరాలు తీర్చలేకపోతున్నాయి. ఆలయ విస్తరణకు అనుగుణంగా క్యూలైన్లు ఎక్కువ సంఖ్యలో నిర్మించాలి.

3. భద్రాద్రి, దుమ్ముగూడెంలో శాశ్వత స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలి. 4. భద్రాచలం వస్తేనే ఆలయ సమాచారం తెలుస్తుంది. ఉభయ జిల్లాల్లో సమాచార కేంద్రాలు, హోర్డింగ్‌లు, సూచీ బోర్డులు అమర్చాలి.

5. ఉత్సవాల సమయంలో కాకుండా నిరంతర శాశ్వత విద్యుద్దీపాల అలంకరణ. 6. గోదావరి కరకట్టను భక్తులు కూర్చునేలా, సేదదీరేలా అభివృద్ధి చేయాలి.

7. రామాలయం నుంచి గోదావరి నది వద్దకు వెళ్లేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

# అన్నంలో పురుగులు.. తినలేక పస్తులు



పరిగి : సంక్షేమ గురుకులాలు, వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. కలుషిత ఆహారంతో గతంలో జరిగిన ఘటనలతో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. అయినా క్షేత్రస్థాయిలో చోటు చేసుకుంటున్న నిర్లక్ష్యం విద్యార్థులకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. గతేడాది వరుసగా కుల్కచర్ల, పరిగి, వికారాబాద్ ప్రాంతాల్లోనూ విద్యార్థులు అవస్థలు పడ్డారు. తాజాగా మర్పల్లి మండల కేంద్రంలోని విద్యార్థులు అన్నంలో పురుగులు వచ్చాయని తినలేమని ధర్నాకు దిగారు. ఈ ఘటన మరువక ముందే అదే మండలంలోని సిరిపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో మరో ఘటన జరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

**కొరవడిన పర్యవేక్షణ..**

మధ్యాహ్న భోజన నిర్వహణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు ఎక్కడా కనిపించడం లేదు. అమలు చేసేందుకు కమిటీలున్నా పట్టించుకోవడం లేదు. గురుకులాలు, వసతిగృహాల వద్ద అపరిశుభ్రత నెలకొనడం, బియ్యాన్ని జల్లెడ పట్టకపోవడం తదితర కారణాలతో అన్నంలో పురుగులు వస్తున్నాయి. కలెక్టర్ మొదలుకుని మండల స్థాయి అధికారుల వరకు తరచూ భోజనాలు చేస్తున్నా, పునరావృతం అవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పాఠశాలల్లోనూ పలుచోట్ల వంటగదులు శుభ్రంగా లేవు. పైకప్పులు దెబ్బతిన్నాయి. చెట్లకింద భోజనం వండాల్సి వస్తోంది. కొన్ని వసతిగృహాల్లో ఇటీవల సరఫరా చేసిన బియ్యం కాకుండా, గతంలో పంపిణీ చేసినవి పురుగు పట్టినా, వాడడంతో విద్యార్థులు తినలేకపోతున్నారు.

**అమలు కాని మెనూ:** వసతిగృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కొందరు వసతిగృహ సంక్షేమాధికారులు (వార్డెన్లు) పాటించడం లేదు. హెడ్‌క్వార్టర్‌లో ఉండకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. పోషకాహారాన్ని అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నా, గాడితప్పి విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సి వస్తోంది.

**నాణ్యమైనవి వినియోగించేలా చర్యలు..**

మర్పల్లి ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాం. పాత బియ్యం వినియోగించడంతో నల్ల పురుగులు వచ్చాయని గుర్తించాం. వాటిని తిప్పి పంపి, కొత్తగా వచ్చిన వాటిని వాడాలని సంక్షేమాధికారికి ఆదేశాలు జారీ చేశాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నాం. అవసరమైతే జల్లెడ పట్టించి నాణ్యమైన బియ్యం వాడుతాం.

కమలాకర్‌రెడ్డి, గిరిజన సంక్షేమాధికారి

**దర్యాప్తు కమిటీని నియమించాం**

మర్పల్లిలో కేజీబీవీలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి దర్యాప్తు కమిటీ నియమించాం. ఎంపీడీవో, తహసీల్దారుతో కూడిన మరో కమిటీని కూడా కలెక్టర్ ఏర్పాటు చేశారు. నివేదిక రాగానే చర్యలు చేపడతాం.

రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

# సర్కారు జాగా.. కనిపిస్తే పాగా



శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లో సర్కారు స్థలాలను కొందరు యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువు శిఖం, కుంట భూములు, పల్లె శివారులోని ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమిస్తున్నారు. ఇళ్ల పట్టాలు లేకపోయినా.. గ్రామ పంచాయతీల అనుమతి తీసుకోకుండానే, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు.

**ఉదాహరణలు కొన్ని ఇలా..**

కేశవపట్నంలో ఇటీవల ఓ వ్యక్తి జాతీయ రహదారి ఆనుకొని ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. పనులు తుది దశకు చేరినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

కరీంపేట్ గ్రామంలో ఒకరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నా.. ఇప్పటివరకు అధికారులు ఆ దిశగా వెళ్లలేదు. ఆక్రమించినట్లు తెలిసినా చర్యలకు ఉపక్రమించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

ఎరడపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు ప్రారంభించారు.

శంకరపట్నం వాగు ప్రాంతంలోని సర్కారు స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని స్థానికులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించే లోపు ఆ భూమి ఆక్రమణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. మండలంలో బయటకు రాని ఆక్రమణలు ఇంకెన్నో ఉన్నాయి. అక్రమ ఇళ్ల నిర్మాణాలపై గ్రామాల ప్రత్యేకాధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. కొన్ని నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని తుది దశలో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

**కార్యదర్శులదే బాధ్యత**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం చట్ట విరుద్ధం. అలాంటి చోట నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలో ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. అక్రమ నిర్మాణాలు వెలిస్తే ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. – కృష్ణప్రసాద్, ఎంపీడీవో

# తప్పులు.. జనన ధ్రువీకరణకు తిప్పలు

ధర్మపురి : నేరెల్లకు చెందిన దావనపెల్లి పూజ ఏప్రిల్ 29న జగిత్యాలలోని మాతాశిశు ఆసుపత్రిలో పాపకు జన్మనిచ్చింది. జనన ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసేందుకు మీ సేవకు వెళ్తే ఆన్‌లైన్‌లో దావనపెల్లికి బదులు దావన్‌పెల్లి అని వచ్చింది. ఇంటి పేరులో ఏ అనే అక్షరం పడకపోవడం, చిరునామా ముందు ఇంటి నంబరు లేకపోవడం అడ్రస్ నమోదు సరిగా కాలేదు. దీంతో అఫిడవిట్ కోసం రూ.300 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది.

జిల్లాలో ఆసుపత్రుల్లో జనన ధ్రువీకరణపత్రాల్లో వివరాలు తప్పుగా నమోదు చేయడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. తప్పుగా నమోదయిన వివరాలు సరి చేసుకోవడానికి మీసేవలో దరఖాస్తుతోపాటు అఫిడవిట్ జత చేయాల్సి రావడంతో రూ.300 నుంచి రూ.400 వరకు అదనంగా ఖర్చవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. జగిత్యాల జిల్లాలో 44 ప్రైవేటు ఆసుపత్రులతోపాటు జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్లలోని ప్రధాన ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరుగుతుంటాయి. జూన్ నెలలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 396 మంది శిశువులు జన్మించగా ప్రైవేటు ఆసుపత్రుల్లో 278 మంది శిశువులు జన్మించారు.

**నమోదు ఇలా..**

ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం కోసం వెళ్లినప్పుడు ఆధార్‌కార్డు ఆధారంగా సంబంధిత డాక్టర్ వివరాలను ధ్రువీకరిస్తారు. అనంతరం సిబ్బంది ఆధార్‌కార్డులో విధంగా తల్లి, తండ్రి పేర్లు, చిరునామా నమోదు చేయాలి. ఈ వివరాలన్నీ ఆ ఆసుపత్రి పట్టణ పరిధిలో ఉంటే మున్సిపల్, గ్రామ పరిధిలో ఉంటే పంచాయతీ లాగిన్‌కు వెళ్తాయి. దీని ఆధారంగా జనన ధ్రువపత్రం కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో ధ్రువపత్రం జారీ అవుతుంది.

**తప్పులు జరిగేది ఇలా..**

తండ్రి, తల్లి పేరులో అక్షర దోషాలు, పేరుకు ముందు ఇంటి పేరు లేకపోవడం, చిరునామాలో ఇంటి నెంబరు లేకపోవడం, స్పష్టంగా చిరునామా లేకపోవడం, కొన్నిసార్లు జెండర్ నమోదులో తప్పులు దొర్లడంతో ఆధార్‌కార్డు తీసేటప్పుడు, ఇతర సమయాల్లో ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారు. ఇలా జరిగినప్పుడు తప్పనిసరిగా సవరణ కోసం మళ్లీ మీ సేవలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సవరణ కోసం డబ్బులు, సమయం వృథా అయ్యే అవకాశం ఉంటుంది.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

ప్రసవ సమయంలో కుటుంబ సభ్యులు ఆధార్‌కార్డు ఆధారంగా ఇంటి పేరుతో సహా పేర్లను నమోదు చేయించాలి. ఇంటి నెంబర్‌తోపాటు పూర్తి చిరునామా నమోదు చేసేలా దగ్గరుండి చూసుకోవాలి. జెండర్ నమోదును కూడా పరిశీలించుకోవాలి. మౌఖికంగా చెప్పకుండా సిబ్బందికి ఆధార్‌కార్డు ఇచ్చి నమోదయ్యేలా చూడాలి. ఆసుపత్రిలో వివరాలను నమోదు చేసేటప్పుడు సరిగా చూసుకుంటే సవరణ చేయించుకోవాల్సిన అవసరం ఉండదు.

నమోదు చేసేలా ఆదేశిస్తాం

కుటుంబ సభ్యులు సిబ్బందికి అందించే సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలి. ఆధార్‌లో ఉన్న విధంగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేసేలా సిబ్బందిని ఆదేశిస్తాం.

– డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, జగిత్యాల

# మళ్లీ వచ్చింది.. మండేకాలం..!

సూర్యాపేట : వర్షాకాలం ఆరంభానికి ముందు మురిపించిన వరుణుడు అనంతరం ముఖం చాటేశాడు. జిల్లా వ్యాప్తంగా జూన్ నెలలో సాధారణం కంటే 24 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా వాతావరణం ఎండాకాలన్ని తలపిస్తోంది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి జంకుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పత్తి పంట ఎండుముఖం పడుతోంది. మరికొద్ది రోజులు పరిస్థితి ఇలానే ఉంటే పంట పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆశలు ఆవిరి....**

జిల్లాలో మే నెలలో ముందస్తుగా వర్షాలు కురవడం, రుతు పవనాలు ముందుగా రావడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నదాతలు ఆశించారు. అందుకు భిన్నంగా జూన్ నెలలో చిన్నచిన్న జల్లులు మినహా భారీ వర్షం కురిసిన దాఖలాలు నేటికీ కనిపించలేదు. జూన్‌లో సాధారణ వర్షపాతం 192.9 మి.మీ కాగా కేవలం 120.6 మి.మీ మాత్రమే నమోదైంది. అవసరమైన నీటి లభ్యత లేకపోవడంతో వరి సాగు చేయాలనుకున్న అన్నదాతలకు ఎదురు చూపులు తప్పడం లేదు. రెండు రోజులుగా సాయంత్రం సమయంలో మేఘాలు కమ్ముకుంటున్నా వర్షం కురవడం లేదు. జిల్లాలో దాదాపు 4.89 లక్షల ఎకరాల్లో



వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కాగా ఇప్పటి వరకు దాదాపు లక్ష ఎకరాల్లోనే పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎక్కువగా వర్షాధార పంటలే ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

సూర్యాపేట పట్టణం విద్యానగర్‌లో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. వేసవి కాలంలో ట్యాంకర్ల ద్వారా పలువురు నీటిని తెప్పించుకున్నారు. వర్షాకాలం మొదలైనా నేటికీ మోస్తారు వర్షాలు కురవకపోవడంతో నీటికోసం ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాకాలంలో సైతం మూడు, నాలుగు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న పత్తి పంట ఆత్మకూర్(ఎస్) మండలంలోనిది. విత్తుకుని నెల రోజులు కావొస్తున్నా ఏ మాత్రం ఎదుగుదల లేదు. సరైన సమయంలో వర్షాలు కురిస్తే ఇప్పటికే కలుపు తీయడంతో పాటు యూరియా కూడా చల్లేవారమని.. వానలు లేకపోవడంతో మొక్కల ఎదుగుదల లేక పత్తిపంటకు తీవ్రనష్టం వాటిల్లుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఒడిసిపడితేనే జలం.. భూగర్భానికి బలం

సూర్యాపేట: వాన నీటిని ఒడిసిపట్టేలా పురపాలికల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వాననీటిని భూమిలోకి పంపితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. పట్టణాల్లో చేపడుతున్న 100 రోజుల ప్రణాళికలో ప్రతి నివాసంలో దీనిని నిర్మించుకొనేలా చర్యలు తీసుకోవాలని పుర కమిషనర్లకు రాష్ట్ర పురపాలికశాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలక సంఘాలున్నాయి. వాటిలో 2,36,556 నివాసాలున్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ఇంకుడు గుంతలు లేవు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇంకుడు గుంతలు లేని ఇళ్ల గుర్తింపునకు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య జవాన్లతో సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఇళ్లకు వెళ్లి ఇంకుడుగుంతలు ఉన్నాయో లేదో నిర్ధారిస్తారు. లేకుంటే నిర్మించుకోవడానికి నెల రోజులు గడువు ఇస్తారు. తర్వాత ఇంకుడు గుంత తవ్వకుంటే నోటీసులు జారీ చేస్తారు.

కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చే సమయంలో బోరుబావి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకొనేలా పురపాలికలు కఠినంగా వ్యవహరించాలని ప్రణాళికా విభాగాలకు సీడీఎంఏ నుంచి ఆదేశాలు



ఉన్నాయి. అయినా పట్టింపులేక ఈ ప్రక్రియ అనుకున్న రీతిలో సాగడం లేదు. ఇంటి అనుమతిలిచ్చే ముందే దస్త్రంలో ఇంకుడు గుంత తప్పనిసరి అని ఉంటుంది. స్థలం విస్తీర్ణంతో నిమిత్తం లేకుండా ప్రతి ఇంటి ఆవరణలోని బోరు వద్ద ఇంకుడుగుంత ఉండాలన్న నిబంధన ఉంది. కాగా నూతన ఇంటి నిర్మాణం చేపట్టే వారు దీనిని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**చర్యలు తీసుకుంటాం**

–సీహెచ్ హనుమంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టేందుకు బృందాలను ఏర్పాటు చేస్తాం. లేనివాటిని గుర్తించి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

# పల్లె పోరు.. కసరత్తు జోరు

నాంపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీనిని అనుసరించి ఆర్డినెన్స్ జారీ చేయడంతో పాటు సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎన్నికల సంఘం ఆదేశానుసారం మండలం, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాల నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే నోటిఫికేషన్ జారీ చేయగా, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తికి యంత్రాంగం సిద్ధంగా ఉంది.

**గత ఎన్నికలకు భిన్నంగా..**

ఇప్పటి వరకు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సామాజిక వర్గాల నిష్పత్తి ఆధారంగా జిల్లాను యూనిట్గా



తీసుకొని ఎంపీటీసీ స్థానాలు, సర్పంచి పదవుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. మండలం యూనిట్గా వార్డు సభ్యుల రిజర్వేషన్లు నిర్ధారించారు. రానున్న ఎన్నికల్లో మండలం యూనిట్గా ఎంపీటీసీ స్థానాలు, సర్పంచి పదవుల రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు, ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా నల్గొండ జిల్లాలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తు పూర్తి చేసే పనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

**బీసీ రిజర్వేషన్లకు ఆమోదం లభిస్తే..**

మంత్రి మండలి నిర్ణయం మేరకు స్థానిక సంస్థల రిజర్వేషన్ల ఖరారుపై ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపాలి. ఈ సారి నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం భారీగా పెరగనుంది.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు అవకాశం ఉంటే.. నల్గొండ జిల్లాలోని 353 ఎంపీటీసీ స్థానాల్లో బీసీలకు 148–149 స్థానాలు రిజర్వ్ కానున్నాయి. 868 గ్రామ పంచాయతీల్లో 364–365 స్థానాలు బీసీలకు దక్కే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం స్థానాల్లో 50 సీట్లు మహిళలకు కేటాయించనున్నారు. వీటిలో సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు అమలు చేయనున్నారు.

2018లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 27 శాతం బీసీలకు, 15 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు సీట్లు కేటాయించారు.

# పరీక్షలో నెగ్గిన భగీరథ

సిద్దిపేట : ప్రభుత్వం ఇంటింటికి సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తోంది. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా సరఫరా అయ్యే నీటిని శుద్ధి చేసిన తర్వాత గ్రామాల్లో ప్రజలకు నీటిని అందిస్తున్నారు. కొందరు తాగడానికి ఉపయోగించడం లేదు. ప్రైవేటు నీటి శుద్ధి ప్లాంట్ల వద్దనే కొనుగోలు చేసి తాగుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లీకేజీల కారణంగా ప్రజలకు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించగా పూర్తిస్థాయిలో స్వచ్ఛతతో ఉన్నాయని అధికారులు తేల్చారు.

**నియోజకవర్గంలో 300 చొప్పున..**

భగీరథ గ్రిడ్ నుంచి గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులకు నీరు వస్తోంది. కొన్ని చోట్ల నీరు సరిపోకపోవడంతో ఆయా గ్రామాల్లో స్థానిక నీటి వనరుల నుంచి నీటిని ట్యాంకుల్లోకి పంపిస్తున్నారు. అక్కడి కుళాయిల ద్వారా ప్రతి రోజు ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి నెల నీటి నమూనాలు సేకరిస్తున్నారు. జూన్‌లో మొత్తం 1500 నమూనాలకు పరీక్షలు చేపట్టారు. ప్రతి నియోజకవర్గంలో రోజుకు మూడు చొప్పున నెలకు 300 వరకు పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సిద్దిపేటలోని మిషన్ భగీరథ భవన్‌లో నిర్వహించారు. 50 నమూనాలను బ్యాక్టీరియా లాజికల్, 250 నమూనాలను రసాయనిక పరీక్షలు చేశారు. పంచాయతీల్లో క్రమం తప్పకుండా నీటి పరీక్షలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ట్యాంకుల నుంచి సరఫరా చేసే నీరు పైపులైన్ లీకేజీలతో కలుషితం అయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

సందేహం లేకుండా తాగొచ్చు : శ్రీకాంత్, మిషన్ భగీరథ ఈఈ

మిషన్ భగీరథ నీరు తాగడం ఆరోగ్యకరం. ప్రస్తుతం భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధమైన నీటిని అందిస్తున్నాం. ప్రజలు ఎలాంటి అనుమానాలు లేకుండా తాగవచ్చు.

# కోచ్ నియామకానికి పచ్చజెండా

మెదక్ : గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలకు కొదవ లేదు. వారికి సరైన శిక్షణ లేక వెనకడుగు వేస్తున్నారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకో శిక్షకుడిని నియమించాలని నిర్ణయించింది. దీంతో మెదక్‌లోని స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ ఇండియా (సాయ్) అవుట్‌డోర్, పీఎన్ఆర్ స్టేడియాలకు కోచ్‌లను నియమించే అవకాశం ఉంది.

**పర్యవేక్షణ కొరవడి..**

మెదక్‌లోని సాయ్ అవుట్‌డోర్ స్టేడియంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.7.50 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం, ఫుట్‌బాల్ మైదానం ఏర్పాటు చేశారు. అందుబాటులోకి తీసుకొచ్చి ఏళ్లు గడుస్తున్నా కోచ్, నిర్వాహకులను నియమించలేదు. దీంతో నిర్వహణ కొరవడింది. రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మైదానం నిరుపయోగంగా మారింది. సరైన పర్యవేక్షణ లేక ఆట వస్తువులు ధ్వంసమయ్యాయి. మైదానం అధ్వానంగా మారింది. నిబంధనల ప్రకారం ఆరుగులు శిక్షకులు, సిబ్బంది, అటెండర్లు, కాపలాదారులు ఉండాలి. పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి. ఇందుకు ప్రభుత్వాలకు పలుమార్లు ప్రతిపాదనలు పంపించినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కోచ్‌ను నియమించడానికి అంగీకరించడంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఉత్తర్వులు వస్తాయని.. : దామోదర్‌రెడ్డి, డీవైఎస్‌వో**

స్టేడియానికి ఒకరి చొప్పున కోచ్‌ను నియమించాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు రెండు స్టేడియాలకు కోచ్‌లు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. స్యాట్ నుంచి త్వరలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వస్తాయని ఆశిస్తున్నాం.

## లెక్క తేలుస్తున్న.. విజిలెన్స్

పుత్తూరు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో తుడా (తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ)లో జరిగిన అక్రమాలు, అవినీతి, అవకతవకలపై నిజాలు నిగ్గుతేల్చేందుకు రంగంలోకి దిగిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే భారీ నివేదిక సిద్ధం చేసిన విజిలెన్స్ తాజాగా తుడాకు సంబంధించిన కీలక అధికారులను విచారించింది. వీరిని విజయవాడకు ఇటీవల పిలిపించి రెండ్రోజుల పాటు రహస్యంగా అన్ని కోణాల్లో విచారించి వారి స్టేట్మెంట్లు రికార్డు చేసింది. ఐదేళ్లలో తుడా పరిధిలో ఉన్న నియోజకవర్గాల్లో నాటి ఛైర్మన్లుగా బాధ్యతలు చేపట్టిన చెవిరెడ్డి భాస్కర్రెడ్డి ఆయన తనయుడు మోహిత్రెడ్డి భారీఎత్తున నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు తమదైన శైలిలో విచారించి ఒక నివేదిక రూపొందించారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్న నేపథ్యంలో ఇద్దరు కీలక



అధికారులను విచారించడం చర్చనీయాంశమైంది. 2023లో తిరుపతి రూరల్ ఎంపీడీవోగా పనిచేసిన వెంకటనారాయణను.. నాటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్రెడ్డి ఎలాంటి అర్హత లేకున్నా తుడా కార్యదర్శిగా నియమించారు. వాస్తవానికి తుడా కార్యదర్శి స్థాయిలో పనిచేయాలంటే ఆర్డీవో స్థాయి అధికారులు అవసరం. గతంలో ఆర్డీవోగా పనిచేసిన మాధవీలత, అంతకుముందు వెంకటేశ్వర్రెడ్డి.. ఇలా ఇక్కడ పనిచేసిన వారంతా ఆర్డీవో స్థాయి అధికారులే కావడం గమనార్హం. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు మాత్రమే నిధులు పెద్దఎత్తున దోచిపెట్టేలా రూపొందించిన కార్యాచరణ అమలులో కీలకపాత్ర పోషించిన ఆయన ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సహా అప్పట్లో పరిపాలనాధికారి(ఏవో)గా వ్యవహరించిన మరో అధికారిని సైతం విచారణకు పిలిచారు. తమకేమీ తెలియదని, అప్పటి ఛైర్మన్ల ఆదేశాలకు అనుగుణంగా నడుచుకున్నామని వారు స్టేట్మెంట్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తంమీద కీలక అధికారుల తాజా రహస్య విచారణ ఇటు తుడాలో అటు జడ్పీలో కలకలం రేపుతోంది.

## పర్యాటక సిరి.. ప్రతిపాదనలతో సరి

కర్నూలు : శ్రీశైలం, సున్నిపెంట ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా అధికారులు దృష్టి సారించడం లేదు. శ్రీశైలం ఆలయానికి నిత్యం 30 వేల మందికిపైగా భక్తులు వస్తుంటారు. పర్యాటక ప్రాంతాలను అందుబాటులోకి తీసుకొస్తే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని సీఎం భావించారు. మంత్రుల కమిటీ ఏర్పాటుచేశారు. సీఎం ఆదేశించి ఎనిమిది నెలలైనా తీసుకున్న చర్యలు శూన్యమే.


**భూబదిలీ ఎప్పుడో..**

శ్రీశైలం ఆలయ పరిధిలోకి 4,433 ఎకరాలను అధికారికంగా తీసుకురావాలన్న ప్రతిపాదన ఏళ్లుగా పెండింగులోనే ఉంటోంది. ఇందులో అత్యధిక భాగం అటవీ ప్రాంతంలో ఉండడంతో అభివృద్ధికి అవకాశం లేకుండా పోతోంది. బృహత్తర ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయాలంటే ముందుగా అటవీ శాఖ పరిధిలోని భూమిని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాల్సి ఉంది.

**ప్రకటనల్లోనే ఎలివేటెడ్ కారిడార్**

శ్రీశైలం నుంచి సున్నిపెంట వెళ్లాలంటే 15 కి.మీ.ల దూరం వెళ్లాలి. ప్రత్యామ్నాయంగా శ్రీశైలం నుంచి రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. ఈ పనుల్లోనూ అధికారులు అంతులేని తాత్సారం చేస్తున్నారు.

**తీసుకున్న చర్యలు శూన్యమే**



శ్రీశైలాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక హబ్గా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించింది. దేశ, విదేశీ భక్తులు శ్రీశైలానికి వచ్చేలా ఎలా అభివృద్ధి చేయాలన్న అంశంపై జనవరిలో అధికారులు చర్చించారు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు శూన్యమే.

**శాటిలైట్ టౌన్షిప్ ఎప్పటికయ్యేనో..**

సున్నిపెంటను శ్రీశైలానికి శాటిలైట్ టౌన్షిప్గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా ఎలాంటి పనులు చేపట్టాలన్న అంశంపై అధికారులు స్పష్టతనివ్వలేదు. సున్నిపెంట పంచాయతీకి ఎన్నికలు జరపాలంటూ కొందరు హైకోర్టుకు వెళ్లారు. రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని వారు పేర్కొంటున్నారు.

**సీప్లేన్ సేవలేవీ..**విజయవాడ నుంచి నేరుగా శ్రీశైలం వచ్చేందుకు వీలుగా సీప్లేన్ సర్వీసులు ఈ ఏడాది మార్చిలో ప్రారంభమవుతాయని ప్రకటించారు. అది కూడా అందుబాటులోకి రాలేదు. సున్నిపెంటలో ఐదు నక్షత్రాల హోటల్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించినా అడుగులు పడలేదు.

## 'సృష్టి'.. మరింత మందిపై దృష్టి..!




విశాఖపట్నం : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న సృష్టి సంతాన సాఫల్య కేంద్రం కేసులో తీగ లాగితే డొంక కదులుతోంది. విశాఖ కేంద్రంగానే సరోగసీ పేరుతో పెద్ద ఎత్తున పిల్లల విక్రయాలు జరిగినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. ఇప్పటికే ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో కలిసి 1988లో ఆంధ్ర వైద్య కళాశాలలో వైద్యవిద్యను చదివిన ముగ్గురు వైద్యులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు కేజీహెచ్‌లో పనిచేస్తుండగా, మరొకరు శ్రీకాకుళం జిల్లాలో సేవలందిస్తున్నారు. వీరిలో ఒకరు బెయిల్‌పై విడుదలవగా, మరో ఇద్దరు రిమాండ్‌లో ఉన్నారు. 1988 బ్యాచ్‌లో వైద్య విద్య చదివి వైద్యులుగా స్థిరపడ్డ మరికొందరి పాత్ర కూడా ఇందులో ఉందని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. వారి వివరాలను ఇప్పటికే తీసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా వైద్యుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి భారీగా నిధులు జమైన సందర్భాలపై ఆరా తీస్తున్నారు.

**కొందరి ఫోన్లు స్విచ్ఛాఫ్:** 'సృష్టి' కేసు బయటకు రావడం..ముగ్గురు 1998 బ్యాచ్ వైద్య విద్యార్థులను అరెస్టు చేయడంతో మిగతావారి ఫోన్లు దర్యాప్తు అధికారులకు అందుబాటులోకి రావడం లేదని సమాచారం. దీంతో పోలీసుల్లో అనుమానాలు బలపడుతున్నాయి. మరింత మంది ఈ దందాలో ఉన్నట్లు పోలీసులకు తెలియడంతో వైద్య వర్గాల్లో గుబులు రేపుతోంది. గౌరవనీయమైన వైద్య వృత్తిలో ఉంటూ సరోగసి ముసుగులో అక్రమాలకు పాల్పడడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

**అధికారుల సహకారం ఏమైనా ఉందా?:** సృష్టి పేరుతో విశాఖ కేంద్రంగా కొన్నేళ్లుగా పిల్లల విక్రయాలు జరుగుతుంటే ఎందుకు బయటకు రాలేదనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఎవరు సహకరించారనే దానిపైనా వివరాలు రాబట్టారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురు మధ్యవర్తులను సైతం అరెస్టు చేశారు. అనుమతుల్లేకుండా సృష్టి కేంద్రం నిర్వహిస్తున్నా ఎందుకు తనిఖీలు చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ దందాల్లో అధికారుల సహకారం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సృష్టి వైద్యురాలు డాక్టర్ నమ్రతను పోలీసులు మరోసారి కస్టడీకి తీసుకోనున్నారు. త్వరలో ఈ కేసులో మరికొంత మంది అరెస్టు జరిగే అవకాశం కనిపిస్తోంది.

## జలవనరుల బలోపేతం దిశగా..



నర్సీపట్నం : సాగునీటి వనరులను మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు దృష్టిసారించారు. కొన్నేళ్లుగా వదిలేసిన నీటి తీరువాను మళ్లీ వసూలు చేయాలని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఇటీవల రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారుల సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. చిన్నతరహా నీటి వనరులున్న చోట ఎకరాకు రూ.100, మధ్య, భారీ ప్రాజెక్టుల కింద ఎకరాకు రూ.200 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. రైతులను చైతన్యం చేసి కొద్దిరోజుల కిందట రూ.27 లక్షలు వసూలు చేశారు. మూడేళ్ల బకాయిలు ఇప్పుడు వసూలు చేయాలని మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

అనకాపల్లి జిల్లాలో తాండవ జలాశయం పరిధిలో 32,689 ఎకరాలు, రైవాడ దిగువన 15,344 ఎకరాలు, కోనాం జలాశయం కింద 12,276 ఎకరాలు, పెద్దేరు ప్రాజెక్టు దిగువన 15,105 ఎకరాలు, చెరువులు, కాలువలు, ఆనకట్టలు తదితర 2,880 వనరుల కింద 2,30,579 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి నుంచి ఏటా రూ.3,81,40,700 వసూలు కావాల్సి ఉంది.

తహసీలార్ల పర్యవేక్షణలో వీఆర్వోలు వసూలు చేసిన నీటి తీరువా నేరుగా కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అధారిటీ (కడా)కి వెళుంది. వీటి వివరాలు జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీరుకు చేరగానే సాగునీటి వనరుల అభివృద్ధి, మరమ్మతులు ఎక్కడెక్కడ అవసరమో జలవనరుల శాఖ సిబ్బంది గుర్తిస్తారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో చర్చించి అత్యవసర పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తారు. రూ.పది లక్షల్లోపు విలువైన పనులు చేపట్టేందుకు కార్యనిర్వాహక ఇంజినీరు, రూ.పది లక్షలు దాటితే రాష్ట్ర ముఖ్య ఇంజినీరు అనుమతులు ఇస్తారు.


వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ సాగునీటి రంగానికి పెద్దగా నిధులివ్వలేదు. కొన్ని వనరులపై పూర్తిగా నిర్లక్ష్యం చూపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అత్యవసరంగా ఎక్కడ ఏ పనులు చేపట్టాలో గుర్తించి నిధులిచ్చింది. జిల్లాలోని ఏకైక మేజర్ ప్రాజెక్టు తాండవ జలాశయానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రూ.6.32 కోట్లు మంజూరు చేశారు. ఉపాధి హామీ పథకం కింద రూ.2 కోట్ల విలువైన పనులు చేపట్టారు. మరో రూ.6 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

సాగునీటి వినియోగదారుల సంఘాలకు కూటమి ప్రభుత్వం ఇటీవల ఎన్నికలు నిర్వహించింది. దీంతో ఆయకట్టు ప్రాంతాల్లో పర్యవేక్షణ పెరిగింది. ఎక్కడైనా సమస్య ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో నీటితీరువా చెల్లించేందుకు రైతులు చాలాచోట్ల ముందుకొస్తున్నారు. కాలువల్లో నీరు పారని చోట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోందని నీటి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

**రైతులకే మేలు**– బాలసూర్యం, ఈఈ, జలవనరుల శాఖ

నీటి తీరువా చెల్లించడం వల్ల రైతులకు పరోక్షంగా ఉపయుక్తమే. చెల్లించిన సొమ్ములో అధిక భాగం తిరిగి ఆయా నీటి సంఘాల సిఫార్సుల ప్రకారం సాగునీటి వనరుల అభివృద్ధికే వినియోగిస్తారు. తద్వారా అత్యవసర పనులు చేపట్టేందుకు వీలుంటుంది. సాగునీటికి ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందున నీటి తీరువా చెల్లించేందుకు ఆయకట్టుదారులు సుముఖంగానే ఉన్నారు.

## సర్కారు భూములే.. సాగించేయ్ దందా



శాంతిపురం : శాంతిపురం, రామకుప్పం మండలాల సరిహద్దు ప్రాంతంలోని విమానాశ్రయం ప్రతిపాదిత భూములకు సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి పంచాయతీ కేంద్రానికి కూతవేటు దూరంలో చెంచప్ప చెరువులో పోటాపోటీగా తవ్వి తరలిస్తున్నారు. రెండు మండలాల్లోని సరిహద్దు ప్రాంతంలో పారిశ్రామిక ప్రగతితో పాటు విమానాశ్రయం సాకారం లక్ష్యంగా ప్రభుత్వం భూసేకరణ చేపడుతోంది. గతంలో సేకరించిన భూములకు సంబంధించి రైతులకు పరిహారం సైతం అందజేశారు. తాజాగా చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలోనూ పరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓవైపు, వ్యవసాయ, వాణిజ్య రంగాల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపునకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తుండగా.. మరోవైపు నిర్దేశిత భూముల్లో మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వకాలను సాగిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెరువుల పటిష్ఠత ప్రశ్నార్థకం..!

**వర్షపు నీటి సంరక్షణ..** భూగర్భ జలాల వృద్ధికి ఆదరువుగా ఉన్న చెరువుల్లోనూ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. గతేడాది ఆశించిన వర్షాలు లేకపోవడం.. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు మట్టి వ్యాపారులకు వరంలా మారింది. పలుచోట్ల కట్టలు, తూములు ఆనుకొని మట్టిని పెకలించడంతో జలవనరుల పటిష్ఠత ప్రశ్నార్థకంగా మారిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**శాంతిపురం మండలం రామాపురం, వెంకటేశపురం, నిమ్మనపల్లె, పాళ్యంగట్టు, రామకుప్పం మండలంలోని విజలాపురం, కిలాకిపోడు తదితర గ్రామాల సమీపంలోని ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. రామాపురం విమానాశ్రయం భూముల సమీపంలో.. శాంతిపురం–విజలాపురం డబుల్ రోడ్డును ఆనుకొని ప్రభుత్వ స్థలంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.

**తవ్వకాలు అడ్డుకుంటాం..**

– శివయ్య, తహసీల్దార్, శాంతిపురం

ప్రభుత్వ భూములు, విమానాశ్రయ ప్రతిపాదిత భూముల్లో మట్టి తవ్వకాలు అరికడతాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది ద్వారా నిఘా ఏర్పాటు చేస్తాం. మట్టిని తరలిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

## లింకు తెగిన చెరువులు

శ్రీకాళహస్తి : సోమశిల–స్వర్ణముఖి లింకు కాల్వ నీళ్లు మల్లెమడుగు, బాలాజీ జలాశయం చేర్చాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో కాల్వ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అయితే గత ఐదేళ్లలో కాల్వతో పాటు చెరువుల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో కాల్వకు అనుబంధంగా ఉన్న చెరువుల రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం కాల్వతోపాటు చెరువుల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోవడంతో కాల్వగుండా గ్రావిటీ మీద వచ్చే నీటిని నిల్వ చేయడం, ఆ నీటిని మల్లెమడుగు, బాలాజీ జలాశయానికి తరలించడం కష్టసాధ్యమే మరి. చెరువుల దుస్థితిపై ఆయకట్టు రైతులు పెదవి విరుస్తుండటం గమనార్హం.

**వ్యయం.. నిష్ఫలం**

చెరువుల్లో రివిట్‌మెంట్ ఏర్పాటు చేశాక ఏడాదికో, రెండేళ్లకొకపర్యాయం పిచ్చి మొక్కల తొలగింపు (జంగిల్ క్లియరెన్స్) చేస్తుంటారు. ఎస్ఎస్‌కెనాల్ పనుల్లో ప్రధాన భూమికను ఏర్పేడు మండలంలోని మేర్లపాక జలాశయం చేపట్టనుంది. కాల్వకు చివరి భాగంగా ఉన్నది ఈ చెరువు మాత్రమే. దీన్ని రూ.4 కోట్లు వ్యయంతో జలాశయంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో 2019 నాటికి రివిట్‌మెంట్ పనులు పూర్తి చేశారు. వైకాపా ఐదేళ్లు రివిట్‌మెంట్‌ను పట్టించుకున్న పాపాన



పోలేదు. దీంతో మేర్లపాక చెరువు కట్ట వెంబడి చేసిన రివిట్‌మెంట్‌పై చెట్లు పెరిగాయి. రివిట్‌మెంట్ రాళ్లు ఊడిపోయాయి. ఇదే విషయమై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు జలవనరుల శాఖ అధికారులు మేర్లపాక చెరువును పరిశీలించారు. మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సి ఉందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. కాల్వల పొడవునా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఆయకట్టు రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

**సామర్థ్యం పెంపు**

రూ.450 కో ట్ల అంచనాతో సోమశిల–స్వర్ణముఖి లింకు కాల్వ పనులు ఏళ్లతరబడి కొనసాగుతూనే ఉన్నాయి. 20 15లో శ్రీకాళహస్తి మండలంలోని మామిడిగుంట, ఇలగనూరు, గుంటకిందపల్లి, ఉడమలపాడు, జింగిలిపాళెం, ఏర్పేడు మండలంలోని రాజులపాళెం, చింతలపాళెం, మేర్లపాక, మన్నసముద్రం చెరువుల సామర్థ్యం పెంచడంతో పాటు పంగూరు, మేర్లపాక చె రువులను జలాశయాలుగా అభివృద్ధి చే యాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేశా రు. రూ.40 కోట్ల వ్యయంతో ఈ చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కట్ట పటిష్ఠతకు రివిట్‌మెంట్ పనులు పూర్తిచేశారు.

## మేల్కోకుంటే ముప్పే..!

పుత్తూరు : మున్సిపాలిటీలోని ఎస్ఆర్ చెరువు కలుజు కాలువ పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో చెరువు నిండితే ఆ నీరంతా ఇళ్లలోకి ప్రవహిస్తోంది. ఏటా జెండామాను వీధి ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పుత్తూరు చెరువు నుంచి కలుజు నీరు పారే కాలువలను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ కారణంగా భవానీనగర్ ప్రాంత వాసులు వర్షం పడితే కునుకు లేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి. అయితే గతేడాది ప్రధాన కాలువలో పూడిక తొలగించడం వల్ల కాస్త పర్వాలేదు.

పలమనేరు మున్సిపాలిటీలో ఎద్దుల చెరువు, కాకతోపు వీధి, ఓంశక్తి ఆలయం ప్రాంతాల్లో వర్షం వస్తే అక్కడి వాసులు ఖాళీ చేయాల్సిందే. వర్షాలు పడితే ఇక నిద్ర ఉండదు. కారణం ఆ చెరువులకు నీరు చేరే సప్లయ్ ఛానల్స్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ సమస్య పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

తిరుపతి నగరపాలక సంస్థలో ప్రధాన కాలువలు ఆక్రమించారు. దీంతో పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఆయా కాలనీల వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి. ప్రధానంగా మధురానగర్, రైల్వే కాలనీ, శివజ్యోతి నగర్, దొడ్డాపురం వీధి, రెడ్డిరెడ్డి కాలనీ, సత్యనారాయణపురం, జీవకోన, బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది.

పుంగనూరు మున్సిపాలిటీలో ఏటిగట్టుపాళ్యెం, మారుతీనగర్, కౌండిన్య కాలువ ఆక్రమణల వల్ల పలు కాలనీల్లోకి నీరు చేరుతోంది. దీంతో వర్షాకాలం వస్తే ముంపునకు గురవడం వల్ల ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, చిత్తూరు నగరపాలికలు, పుత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం, శ్రీకాళహస్తి,



వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు మున్సిపాలిటీలు ఉన్నాయి.. ఏ పురపాలక చూసినా ఇదే పరిస్థితి.. ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పరిస్థితి మెరుగుపడటం లేదు.. చిన్న చినుకుపడితే కంటిపై కునుకు లేని కాలనీలు ఎన్నో ఉన్నాయి.. గతేడాది కురిసిన వర్షాలకు పలు కాలనీలు నీట మునిగాయి.. అయినా అధికారులు ఇప్పటివరకు అక్కడి పరిస్థితిని అంచనా వేసి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.. ప్రస్తుత వర్షాలకు వీధులన్నీ జలమయం అవుతున్నాయి.

**కాలువలపైనే నిర్మాణాలు..**ఉమ్మడి జిల్లాలోని నగర పాలికలు, పురపాలికల్లో ప్రణాళికాబద్ధంగా మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టలేదు. ఎప్పుడో దశాబ్దాల కిందట నిర్మించినవే నేటికీ ఉన్నాయి. దీనికితోడు పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో డ్రైన్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేశారు. దీంతో వర్షం వస్తే వీధులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ డ్రైన్లపై నిర్మాణాలు చేపట్టడంతో కనీసం ఏడాదికి ఒక్కసారి కూడా శుభ్రం చేస్తున్న దాఖలాల్లేవు. దీంతో ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. వట్రపాళెం పూర్తిగా మునకకు గురవుతోంది. సాయిన గర్, గిరిజన కాలనీ, మహదేవయ్యనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి. కాళంగి పరివాహక ప్రాంతంలోనూ మునక ప్రాంతాలు ఉన్నాయి.

చురకలు



# అడుగడుగునా నిర్లక్ష్యం.. గతి తప్పిన లక్ష్యం

మదిగుబ్బ : మదిగుబ్బ మండలంలోని గంగిరెడ్డిపల్లి-కొడవండ్లపల్లి గ్రామాల మధ్య తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు ఆదివారం మద్దిలేరువాగు పారదంతో కొట్టుకుపోయింది. దీంతో 15 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ గ్రామాల మధ్య ప్రధాన వంతెన 2021లో వరదలకు మూడు ప్రాంతాల్లో కొట్టుకుపోయింది. అప్పటి వైకాపా ప్రభుత్వంలో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా.. ఇసుక టిప్పర్లు వెళ్లడంతో రెండోసారి కుంగింది.

**పిల్లర్ల దశలోనే వంతెన నిర్మాణం**

మద్దిలేరువాగుపై వంతెన నిర్మాణం కోసం 2023 జులైలో రూ.2.97 కోట్లు మంజూరయ్యాయి. అనంతపురానికి చెందిన ఓ గుత్తేదారు రూ.2.20 కోట్లకు పనులు దక్కించుకున్నారు. ఆరు నెలల గడువులోపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే పనులు ప్రారంభించక పోవడంతో గడువు ముగిసింది. తర్వాత 2024లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రీటెండర్ ప్రక్రియ నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రీటెండర్ నిర్వహించి 2025 ఏప్రిల్‌లో పనులు



ప్రారంభమయ్యాయి. మూడు నెలల్లోపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా నేటికీ వంతెన పిల్లర్ల దశలోనే ఉంది. రాకపోకలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు మద్దిలేరు వాగు పారదంతో పూర్తిగా కొట్టుకుపోయింది. తెదేపా ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ వెంటనే స్పందించి కొట్టుకుపోయిన కల్వర్టు ప్రాంతంలో యంత్రాలతో మట్టి తోలించారు. తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బంది లేకున్నా భారీ వర్షం కురిస్తే మళ్లీ కల్వర్టు కొట్టుకుపోయే ప్రమాదముంది. అధికారులు త్వరితగతిన వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆటో.. గుత్తాధిపత్యం

తిరుపతి : పుణ్యక్షేత్రం తిరుపతిలో ఆటో మాఫియా చెలరేగుతోంది. భక్తులు, ప్రయాణికులు వారు చెప్పినంత ధర చెల్లించి అక్కడి స్టాండులోని ఆటో ఎక్కాల్సిందే. కాదని మరోటి ఆశ్రయించినా.. మరో వాహనం వచ్చి అక్కడ ఆపినా దాడికి దిగుతారు. లేదంటే వారి తిట్లదండకం భరిస్తూ నడుచుకుంటూ వెళ్లాల్సిందే. ఇంతలా బరితెగించే ధైర్యం వారికి ఎలా వచ్చిందంటే.. ఆ స్టాండు వెనుకున్న నాయకులు, సంఘాలే. వారికి నజరానాగా నెలవారీగా ఆటోకు కొంత సొమ్ము, ఆటోస్టాండు సభ్యత్వానికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లిస్తూ రుబాబుకు దిగుతున్నారు.

**కొవిడ్ తరువాత ఇలా..**

తిరుపతిలో ఏ ఆటోకు చూసినా మీటర్లు ఉండవు. ఎవరు వద్ద ఎంత వసూలు చేసినా అడిగే దిక్కు లేదు. కొవిడ్ ముందు ఆటోలకు మీటర్లు ఏర్పాటుచేసి ఛార్జీలు నిర్ణయించారు. అవి కొంతకాలం మాత్రమే నడిచాయి. ఇంధన ధరలు పెరిగాయంటూ మీటర్లను పక్కన పెట్టారు. రైల్వేస్టేషన్ నుంచి కి.మీ. దూరంలోని శ్రీనివాసం సముదాయానికి ఏకంగా రూ.100 వసూలు చేస్తున్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు, తిరుచానూరుకు వెళ్లాలంటే రూ.వేల్లో గుంజుతున్నారు. రాత్రివేళ రైలు, బస్సు దిగే స్థానికులు సైతం రెట్టింపు ఛార్జీలు ఇవ్వాల్సిందే. రోజూ వేలమంది ఆటోలను ఆశ్రయించే తిరుపతిలో నిర్దిష్ట విధానమంటూ లేకుండాపోయింది.

**నగరంలో 40 స్టాండ్లు**



తిరునగరిలో ఐదేళ్లలో ఆటోల ఆగడాలు పెరిగాయి. స్థానిక అవసరాలు దృష్టిలో ఉంచుకుని సంఘాల పేరుతో వీధివీధినా ఆటోస్టాండ్లు ఏర్పాటు చేశారు. రద్దీ నగరంలో ఏకంగా 40 ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయగా వీటివెనుక రాజకీయ నాయకులు పెత్తనం చేస్తున్నారు. పోలీసులు, ఇతరులతో సమస్యలు వస్తే తాము చూసుకుంటామని మామూళ్లు దండుకుంటున్నారు. అధికారుల నిర్ణయాలకు అడ్డుపడుతూ అమలుకాకుండా చూస్తున్నారు. గత ఎన్నికల్లో వైకాపాకు అనుకూలంగా ఓట్లు వేయాలని ఆటో డ్రైవర్లతో సంఘం నేతలు ప్రమాణం చేయించే వీడియోలు వెలుగులోకి రావడం దుస్థితిని చెబుతోంది.

**నిరుపయోగంగా ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్**

రైల్వేస్టేషన్ వద్ద ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్ నిరుపయోగంగా మారింది. గతంలో భక్తులు, ప్రయాణికులు కౌంటర్ వద్దకు చేరుకుంటే వరుసలో ఉన్న ఆటోలను నిర్ణయించిన ధరలకు పంపేవారు. కొవిడ్ తర్వాత మళ్లీ దాన్ని తెరవలేదు. కనీసం ఎక్కడికి ఎంత ఛార్జీ వసూలు చేయాలో నిర్ణయించలేదు. గతంలో ప్రవేశపెట్టిన త్రిచక్ర యాప్‌ను అమలుపరిస్తే ఆటోలపై నిఘా ఉంటుంది.

**కమిటీ ఆధ్వర్యంలో ధరల ఖరారు**

– రామకృష్ణాచారి, ట్రాఫిక్ డీఎస్పీఆటో ప్రయాణ ఛార్జీలను ఎస్పీ హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో కమిటీ త్వరలో నిర్ణయిస్తుంది. రవాణా శాఖ మీటర్ల ఏర్పాటు అంశం చేపడుతోంది. భక్తులపై దాడులు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

# బృహత్తర ప్రాజెక్టుకు గ్రహణం



శింగనమల : నాలుగు మండలాల్లోని 120 గ్రామాల ప్రజల దాహం తీర్చేందుకు రూ.230 కోట్ల అంచనాతో రూపకల్పన చేసిన తాగునీటి ప్రాజెక్టు ముందుకు సాగడం లేదు. ఆయా పనులకు గ్రహణం పట్టింది. మొదటి దశలోనే ఆగి పోయింది. నిధులున్నా ప్రాజెక్టు పనులు చేయలేక పోతున్నారు. 2017లో నాటి తెదేపా ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టారు. ఖర్చు చేసిన నిధులకు ప్రతిఫలం లేకుండా ఒక్క గ్రామానికి తాగునీరు అందడం లేదు.

శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, శింగనమల మండలాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. కొన్నేళ్లుగా వేసవిలో తాగునీటి కోసం ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. 2017లో ఎంపీఆర్‌డ్యాం తాగునీటి ప్రాజెక్టును తీసుకొచ్చారు. మొదటి దశ పనులు చేపట్టారు. ప్రభుత్వం మారడంతో ఆ తర్వాత ప్రాజెక్టును పట్టించుకొనే నాథుడు కరవయ్యారు.

**కూటమి ప్రభుత్వం వచ్చాక..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.20 లక్షలు మంజూరు చేశారు. పనులు చేపటేందుకు గుత్తేదారులను ఆహ్వానించారు. ఆ తర్వాత సరైన మార్గదర్శకాలు లేవని టెండరు రద్దు చేశారు. గత ఆరు నెలలుగా ఈ ప్రక్రియ జరగడం లేదు.

**వైకాపా నిర్లక్ష్యంతో..**

పెనకచెర్ల డ్యాం నీటిని శుద్ధి చేసి గార్లదిన్నె మీదుగా బుక్కరాయసముద్రం, నార్పల, శింగనమలకు శుద్ధి జలం అందించాలి. 2017లో మొదటి దశలో రూ.40 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో మొదటగా గార్లదిన్నె మండలంలోని 25 గ్రామాలకు శుద్ధి నీరు అందించాలి. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును బహుళ తాగునీటి పథకం కింద చేర్చారు. ఆ పథకం నిధులు రానే లేదు. దీంతో పనులు ముందుకు సాగలేదు.

**నిధులు లేక నిలిపి వేశాం**

శ్రీరాములు, డీఈ, గ్రామీణ తాగునీటి సరఫరా

ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు నిధుల్లేకనే పనులు నిలిపి వేశాం. త్వరలో రూ.20 లక్షలకు టెండర్లు ఆహ్వానిస్తాం. పనులు ప్రారంభించేందుకు అనుమతులు తీసుకుంటాం.

ప్రాజెక్టు పేరు : ఎంపీఆర్‌డ్యాం తాగునీటి ప్రాజెక్టు
పథకం ప్రారంభం : 2017
నిధుల అంచనా : రూ.230 కోట్లు
మొదటి దశకు ఖర్చు చేసిన నిధులు : రూ.40 కోట్లు
ఇప్పటి వరకు చేసిన పనులు : ట్యాంకుల నిర్మాణం, 25 గ్రామాలకు పైప్‌లైన్
ప్రస్తుత పరిస్థితి : పథకం మరుగున పడింది

# కొండలు కొల్లగొట్టి.. గుట్టలు కరిగించేసి..!



విశాఖపట్నం : జిల్లాలో కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. అక్రమార్కులు గ్రావెల్‌ను భారీ యంత్రాలతో తవ్వేసి, లారీల్లో యథేచ్ఛగా తరలించేసి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, గనులశాఖ అధికారులు అటువైపు కన్నెత్తయినా చూడటం లేదు. వరుసగా సెలవులు వచ్చిన రోజుల్లో అక్రమార్కులు మరింత చెలరేగిపోతున్నారు. ముఖ్యంగా శివారు కాలనీల్లో ఒక సెంటు లేఅవుట్లను ఆనుకొని ఉన్న కొండలను లక్ష్యంగా చేసుకుని కొట్టేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఆనందపురం, పద్మనాభం, సబ్బవరం, పరవాడ, పెందుర్తి మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

**20 అడుగుల లోతుకు తవ్వేసి..:** ఆనందపురం మండలం గండిగుండం, తంగుడుబిల్లిలో ఒక సెంటు స్థలాల లేఅవుట్‌ను ఆనుకొని ఉన్న కొండలను భారీగా తవ్వేస్తున్నారు. గండిగుండంలో కొండవాలు నుంచి ఐదారు అడుగుల లోతు వరకు గ్రావెల్ తవ్వేస్తున్నారు. కొన్నిచోట్ల 20 అడుగుల లోతు వరకు తొలిచేస్తున్నారు. గిడిజాల రోడ్డులో, గుడిలోవకు వెళ్లే మార్గంలో కొండ ప్రాంతాలను భారీ యంత్రాలతో తవ్వేశారు. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం లేఅవుట్‌ను ఆనుకొని పలు చోట్ల మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పరవాడ మండలం దేశపాత్రునిపాలెంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పెందుర్తి రామవరం లేఅవుట్ ఆనుకుని ఉన్న కొండ ప్రాంతంలో, జెర్రిపోతులపాలెం కాలనీ లేఅవుట్‌ను ఆనుకొని భారీగా గ్రావెల్ తవ్వేశారు. దీంతో ఇక్కడ కొండవాలు ప్రాంతాలు ప్రమాదకరంగా మారాయి.

**రాత్రుళ్లు గుట్టుచప్పుడు కాకుండా..:** తవ్విన గ్రావెల్‌ను ఎవరికీ అనుమానం రాకుండా రాత్రుళ్లు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో నిర్మాణ పనులు, లేఅవుట్ల చదును పనులకు ఈ గ్రావెల్‌ను విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం గ్రావెల్‌ను రవాణా చేయాలన్నా అనుమతి తీసుకోవాలి. స్థానికంగా ఉన్న కొందరు నేతలు కాలనీల్లో నిర్మాణాల కోసమని తీసుకొచ్చి అధిక ధరకు అమ్మేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**నెలకు అక్రమార్కుల జేబుల్లోకి రూ.6కోట్లు:** గండిగుండంలో రోజుకు 80 నుంచి 100 లారీలు, తంగుడుబిల్లిలో 30 నుంచి 50, రామవరం నుంచి 50 లారీల్లో గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. దూరం ఆధారంగా చిన్న లారీలోడు రూ.8 వేలు, పెద్ద లారీ లోడు రూ.15 వేల నుంచి రూ.18వేల వరకు విక్రయిస్తున్నారు. రోజుకు సుమారు రూ.20లక్షలు, నెలకు రూ.6కోట్ల మేర అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోందని సమాచారం. ఈ లెక్కన ప్రభుత్వ ఆదాయానికి నెలకు సుమారు రూ. 3కోట్ల మేర గండిపడుతోందని చెబుతున్నారు. అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకొని అపరాధ రుసుం విధించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులకు తెలిసే ఈ దందా జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాకు పూర్తి స్థాయి గనులశాఖ అధికారి లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఆడిందే ఆట..పాడిందే పాటగా సాగుతున్నారు.

# పల్లెలు వెలుగుతున్నాయ్..!




చిత్తూరు : పట్టణాలతోపాటు పల్లెల్లోనూ త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు అడుగులు వేగంగా పడుతున్నాయి.. పల్లెల్లోనూ 24 గంటలపాటు నిరంతర వెలుగులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.. కేంద్రం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 60 శాతం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం డిస్కంల నిధులతో ఆర్డీఎస్ఎస్ (రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పథకాన్ని అమలు చేస్తోంది.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.1400 కోట్లతో ఆర్డీఎస్ఎస్ పథకాన్ని 2023 జూన్‌లో ప్రారంభించగా గత ప్రభుత్వం ఆటంకాలు సృష్టించడంతో పనులు నత్తనడకన సాగాయి.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లా పరిధిలో 195 ఫీడర్ల పరిధిలో పనులు పూర్తిచేసి 1,174 గ్రామాల్లో నిరంతరం త్రీఫేజ్ వెలుగులు మొదలయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లోనూ శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి.

**చిన్నతరహా పరిశ్రమలకు ప్రయోజనం..**

ప్రస్తుతం పట్టణాలకు త్రీఫేజ్ సౌకర్యం ఉంది. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లోని గృహ, వ్యవసాయ, పరిశ్రమలు ఇలా అన్ని కేటగిరీలకు 24 గంటలు త్రీఫేజ్ సౌకర్యం రానుంది. ప్రస్తుతం పల్లెల్లోనూ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. పిండి మిషన్లు, ధాన్యం మిల్లింగ్, ఉద్యాన పంట ఉత్పత్తుల ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఆర్‌డీఎస్ఎస్‌తో 24 గంటలూ పరిశ్రమలు పరుగెత్తనున్నాయి.

**వేగంగా పనులు..**

ఉమ్మడి జిల్లా పరిధిలోని నింద్ర, ఏర్పేడు మండలాలో వంద శాతం పనులు పూర్తయ్యాయి. పాకాల, చిన్నగొట్టిగల్లు, గంగాధరనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, వెదురుకుప్పం మండలాల్లో 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన మండలాల్లో 50-45 శాతం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

**తంబళ్లపల్లెలో ముఖ్యనేత అడ్డంకులు..**

అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూటమి పార్టీకి చెందిన ఓ ముఖ్య నాయకుడి జోక్యంతో పనులు ఆగిపోయాయి. సదరు పనులు కొనసాగడానికి వీల్లేదని ఆయన గట్టిగా చెప్పడంతో ముందుకు కదల్లేదు. ఆర్‌డీఎస్ఎస్ పనుల పురోగతిపై డిస్కం ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తే తప్ప నిర్దేశిత సమయానికి పనులు పూర్తయ్యే పరిస్థితులు లేవని ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు.

**నిరంతరం సమీక్ష..**

– అయూబ్‌ఖాన్, డైరెక్టర్(ప్రాజెక్ట్స్), ఏపీఎస్‌పీడీసీఎల్

పనుల పురోగతిపై నిరంతరం అధికారులు, గుత్తేదారులతో సమీక్షిస్తున్నాం. ఈ పథకం కుటీర పరిశ్రమలకు ఎంతో ఉపయుక్తం. సరఫరాలో హెచ్చుతగ్గులు అరికట్టవచ్చు. 2026 మార్చి నెలాఖరులోగా ఈ పథకాన్ని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

# ఇగ్నోలో ఉపాధి కోర్సులు

మద్దిలపాలెం : ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రస్తుత కాలానికి, ఉపాధికి దోహదపడే సరికొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది నుంచి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇగ్నో కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయా కోర్సుల్లో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ జి.ధర్మారావు తెలిపారు.

పర్యాటక రంగానికి అనుగుణంగా బ్యాచిలర్ ఇన్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ డిగ్రీలో మూడేళ్ల కోర్సు ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. ఇంటర్ పూర్తిచేసిన వారు ఎవరైనా అర్హులే. ఆన్‌లైన్‌లో కూడా ఈ కోర్సును అందుబాటులో ఉంచారు.

బీఏ ఒకేషనల్ విభాగంలో డిగ్రీ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్, హోమ్ సైన్స్ రంగం(బీఏ)లో మానవ అభివృద్ధి ఫ్యామిలీ స్టడీస్, సామాజిక వనరుల నిర్వహణ, పౌష్టిక ఆహారం, దుస్తుల తయారీ నిర్వహణ




వంటి విభిన్న శాస్త్రాల కలయికతో రూపొందించిన కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అంకుర సంస్థలు స్థాపించాలనుకునే వారికి ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి.

సోషల్ వర్క్ విభాగంలో కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సోషల్‌వర్క్‌ను ప్రవేశపెట్టారు. వీటితోపాటు ఆన్‌లైన్‌లో ఎం.ఎస్.డబ్ల్యూ, మాస్టర్ ఇన్ సోషల్ వర్క్ కోర్సులు ప్రారంభించారు.

వైద్య ఆరోగ్య రంగంలో ఆరు నెలల కాల వ్యవధితో నర్స్ మేనేజర్ కోర్సు, సర్టిఫికెట్ ఇన్ జరియాట్రిక్ హెల్త్ అండ్ కేర్(వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి) కోర్సు అందుబాటులో ఉంచారు.

జిల్లాలో గాజువాక ఎంవీఆర్, ప్రభుత్వ మహిళ డిగ్రీ, కేజీహెచ్ నర్సింగ్ కళాశాలల్లో, ఆంధ్రా యూనివర్సిటీలో, విశాఖ డెయిరీ పరిశ్రమలోని ఓ కార్యాలయంలో ఇగ్నో కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశాల కోసం ఈనెల 15 వరకు గడువు పొడిగించారు. ఆసక్తిగల వారు 0891-2511200 నెంబరులో, %www.ignou.ac.in% వెబ్‌సైట్‌ను సందర్శించాలని ధర్మారావు సూచించారు.

# ఆశ చూపి.. ముఖం చాటేసి!

నర్సీపట్నం : ఇంటిగ్రేటెడ్ ఫార్మర్ కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ (ఇఫ్కో) పేరిట అనకాపల్లి జిల్లా పెదబొడ్డేపల్లిలో గత ఏడాది డిసెంబర్‌లో ఏర్పాటైన ఓ కార్యాలయం ఏడాది తిరగకముందే బోర్డు తిప్పేసింది. అధిక లాభాలొస్తాయని ఆశ చూపడంతో ముందూ వెనుకా ఆలోచించకుండా పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరకులను పొదుపు సంఘాల మహిళలకు అరువు ఇచ్చి వారపు వాయిదాలు వసూలు చేసే పద్ధతిలో ఇఫ్కో పేరిట అప్పట్లో వ్యాపారం మొదలుపెట్టారు. తొలుత నర్సీపట్నంలో కొంతమందికి అరువు పద్ధతిలో రూ.వెయ్యి విలువైన సరకులు ఇచ్చారు. వారానికి రూ.250 చొప్పున తిరిగి చెల్లించాలన్నది నిబంధన. ఈ విధానంలో వ్యాపారం చేయడం వల్ల లాభాలు బాగానే వస్తాయని, ఆసక్తి ఉన్నవారు ఎవరైనా పెట్టుబడి పెట్టవచ్చని కార్యాలయ సిబ్బంది ద్వారా ప్రచారం చేయడంతో పది మంది సుమారు రూ.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. వీరందరికీ ప్రతి నెలా రూ.5 వడ్డీ గిట్టుబాటయ్యేలా లాభాలు పంచుతామని ఆశ చూపారు.

రెండు, మూడు నెలలు గడిచినా పెట్టుబడికి అనుగుణంగా లాభాలు పంచకపోవడంతో కొందరు ఇఫ్కో యజమాని పి.శ్రీనివాసరావును నిలదీశారు. శారదానగర్‌కు చెందిన ఓ మహిళ రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టారు. రెండు నెలలైనా లాభం ఇవ్వకపోవడంతో ఒప్పందం నుంచి తప్పుకొంటున్నట్లు చెప్పారు. ఒప్పందం రద్దయిన 45 రోజుల తర్వాత పెట్టుబడి, లాభం సొమ్ము తిరిగిస్తామని నమ్మించారు. ఆ గడువు ముగిసిపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. శ్రీనివాసరావు ఆచూకీ లేకపోవడంతో కార్యాలయ నిర్వాహకుడు రెండు నెలల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్టుబడిదారులు ఫోన్ చేస్తే యజమాని ఇదిగో అదిగో అంటున్నారు. ఆయన ఎక్కడ ఉన్నారో కనిపెట్టేందుకు కొందరు ఆరా తీయగా తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో డి.మార్ట్ సమీపంలోని రోడ్డు నంబరు 5 బ్యాంకు కాలనీలో కార్యాలయం తెరిచినట్లు తెలిసి పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. సరకులు పొందిన వారికి ఎలాంటి నష్టం లేకపోవడం, పెట్టుబడిదా రులు కొద్దిమందే ఉండటంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. నర్సీపట్నం మండలంలో మోసపోయిన వారిలో ఓ ప్రజాప్రతినిధి భర్త, ఓ సోషల్ మీడియా ప్రతినిధి, పలువురు గృహిణులు ఉన్నారు.

# కబళించి.. ఆక్రమించి

బనగానపల్లి : నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికే చెరువుల్లో పూడిక పేరుకుపోవడం, ముళ్లకంపలతో నిండిపోవడం.. తూములు అధ్వానంగా ఉండటంతో రైతులు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఆక్రమణలకు గురవుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరవైంది. నియోజకవర్గ పరిధిలో మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో సుమారు 20 చెరువులు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా దద్దణాల, కుక్కలగుంట, ముక్కమల్ల, కానాల, రామభద్రునిపల్లె, వేములపాడు, ఉప్పలపాడు, సంగపట్నం, మెట్టుపల్లె, తిమ్మనాయునిపేట చెరువులున్నాయి.

**కొద్దికొద్దిగా మాయమవుతూ..**

బనగానపల్లి మండలం బత్తులూరుపాడు పరిధిలో రాచెరువు ఉంది. సర్వే నంబరు 99 నుంచి 103 వరకు వంద ఎకరాల్లో విస్తీర్ణం ఉండాలి. పలువురు దీనిని ఆక్రమించుకోవడంతో పట్టుమని 20 ఎకరాలు కూడా కనిపించడం లేదు. గతంలో రెవెన్యూ అధికారులు 40 మందికి ఒక్కొక్కరికి ఎకరా చొప్పున చెరువుకు సంబంధించిన స్థలంలో పట్టాలిచ్చారు. మిగిలిన పొలాన్ని కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. పట్టణానికి సమీపంలో ఉండటంతో గతంతో ఈ చెరువును అభివృద్ధి చేసి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవుకు రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేసి నీటి కొరత లేకుండా చేయాలని నిర్ణయించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. పదేళ్ల కిందట చెరువు అభివృద్ధికి రూ.30 లక్షలు ఖర్చు పెట్టి తూములు, కాలువ పనులు చేపట్టినా ఫలితం లేకపోయింది.

**150 ఎకరాలకుపైగా ఆయకట్టు**

బనగానపల్లి పట్టణానికి 4 కి.మీ. దూరంలో కైప చెరువు ఉంటుంది. వంద ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండాల్సి ఉంది. దీనికి ఎస్సార్బీసీ నీరు అందుతుంది. 150 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. చెరువులో నీరుంటే చుట్టుపక్కల 200 ఎకరాల్లో బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. ఇలాంటి చెరువును కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఐదేళ్ల కిందట చెరువుకు తూము, అలుగు నిర్మించి పంట కాలువలు బాగు చేశారు.

చురకలు




# మగువ మెచ్చే.. వెంకటగిరి చీర

వెంకటగిరి : రాచరికపు ఠీవితో రాజ్యమేలిన వెంకటగిరి చీరలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎన్ని చీరలున్నా ఒకటైనా వెంకటగిరి చీర ఉండాలని కొని మురిసిపోయే మహిళలున్నారు. దేశవిదేశాల్లో అతివలందరూ మెచ్చే వెంకటగిరి జరీ చీరలకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) జాతీయ పురస్కారానికి వెంకటగిరి జరీ చీర ఎంపికైంది.

**పోటీలో గెలిచి:** రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన చేనేత, హస్తకళా ఉత్పత్తులు ఈ పోటీలో నిలిచాయి. కేంద్ర బృందం ఆయా ఉత్పత్తులను పరిశీలించి వాటిలో ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులను ఎంపిక చేసింది. ఈ పోటీలో వెంకటగిరికి చెందిన జరీ చీర ఎంపికైంది. గతంలో కేంద్ర బృంద సభ్యులు పర్యటించి వెంకటగిరి చీరను పరిశీలించారు. వెంకటగిరి జరీ చీర ఎంపిక కాలేదు. నేటి కూటమి పాలనలో వెంకటగిరి జరీ చీరకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ఎంపిక చేశారు.

**చెక్కుచెదరని చేనేత రంగం**



వందల ఏళ్ల క్రితమే సన్నని నూలుపోగుతో తయారు చేసే ఈ వస్త్రాలను రాజకుటుంబీకులు ధరించేవారు. 120, 100 నంబర్ నూలుదారంలో చీరలు తయారు చేసేవారు. పూర్తిగా చేతితోనే అనేక డిజైన్లు నేసి మగువలకు అందించేవారు. కాలానుగుణంగా చేనేత రంగంలో పెనుమార్పులు తెచ్చారు. అధునాతన పద్ధతితో జరీ చీరలతో పాటు తక్కువ తూకంతో, మెరుగైన డిజైన్లతో పట్టు చీరలు తయారు చేస్తున్నారు. వెంకటగిరి ప్రాంతానికి చెందిన 14 మంది చేనేత కళాకారులకు చేనేత జాతీయ పురస్కారాలు దక్కడమే కాకుండా, ఇద్దరు సంత్‌కబీర్ అవార్డులు పొందారు.

# అవినీతి ప'గూళ్లు'

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వం ఆప్షన్-3 ద్వారా అందరికీ నాణ్యమైన గృహాలు నిర్మించి ఇస్తామని మభ్యపెట్టింది. చివరకు ఆ పార్టీ నాయకులే గుత్తేదారుల అవతారమెత్తి.. ముందస్తుగా రూ.కోట్లలో అడ్వాన్సులు తీసుకుని యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. కొందరు నాణ్యతను గాలికొదిలేస్తే.. మరికొందరు నిర్మాణాలే ప్రారంభించకుండా ఇనుము, సిమెంటు, నిధులు స్వాహా చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.వందల కోట్లు వ్యయం చేసినా వంద నిర్మాణాలు పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న కాలనీల్లో జరిగిన మోసాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విచారణను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించగా.. గృహ నిర్మాణశాఖ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి చిత్రాలు తీసి అందులో నిక్షిప్తం చేసే ప్రక్రియను ప్రారంభించారు.

**25 సంస్థలకు అప్పగింత**

ఆప్షన్-3 కింద ఆదోని, ఆలూరు, చిప్పగిరి, దేవనకొండ, గోనెగండ్ల, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు గ్రామీణ, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాల్టీల్లో 10,566 ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు 25 గుత్తేదారు సంస్థలకు పనులు అప్పగించారు. నెల్లూరు జిల్లాకు చెందిన వైకాపా నేతలే బోయిళ్ల, బోయిళ్ల జనార్దన్ సంస్థల పేరుతో పనులు దక్కించుకున్నారు. గతేడాది జూన్ వరకు వంద ఇళ్లను కూడా పూర్తి చేయలేదు.

**నాణ్యత ప్రశ్నార్థకం**

ఆప్షన్-3 పేరుతో గుత్తేదారు సంస్థలు నిర్మిస్తున్న గృహాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. వైకాపా ప్రభుత్వంలో ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు, మరో రూ.35 వేలు కలిపి రూ.2.15 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. గుత్తేదారులు తొమ్మిది అడుగుల లోతులో పునాదులు తీయాల్సి ఉండగా.. నాలుగైదు అడుగులే తీసి నాసిరకంగా పిల్లర్లు నిర్మిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన హౌసింగ్ ఇంజినీర్లు తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. గుత్తేదారులకు బిల్లులు, సామగ్రికి కలిపి రూ.200 కోట్ల చెల్లింపులు జరిగాయి. ప్రస్తుతం పూర్తయిన ఇళ్లు మూడునాలుగేళ్లు నిలవడం కూడా కష్టమేనని కొందరు ఇంజినీర్లు చెబుతున్నారు. గుత్తేదారుల దోపిడీపై ప్రస్తుత ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టి సమగ్ర విచారణ జరిగేలా చూస్తేనే అక్రమాలు వెలుగులోకి వస్తాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

**అడ్వాన్సుల పేరుతో రూ.కోట్లు దోచిపెట్టారు**

బోయిళ్ల జనార్దన్ సంస్థ ఎమ్మిగనూరు మండలంలో 125, ఎమ్మిగనూరు పురపాలక సంస్థలో 1,022, మంత్రాలయంలో 397 ఇళ్లను నిర్మించేందుకు ముందస్తుగా రూ.19.16 కోట్లు అడ్వాన్సు రూపంలో తీసుకుంది.

బోయిళ్ల కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆదోని పురపాలక సంస్థలో 4,970 ఇళ్లు నిర్మించేందుకు ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థకు అడ్వాన్సుల రూపంలో మూడేళ్ల కిందటే రూ.55.95 కోట్లు చెల్లించారు.

నెల్లూరు జిల్లాకు చెందిన ఓ వైకాపా నేత జేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ పేరుతో ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాల్టీలు, ఎమ్మిగనూరు రూరల్, మంత్రాలయం మండలంలో కలిపి 6,530 ఇళ్లు నిర్మించుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటి వరకు 3,981 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇక మరో 2,549 నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. మరో 22 గుత్తేదారు సంస్థలు 1,857 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది.

**ఒక్కటీ పూర్తిచేస్తే ఒట్టు**

గతేడాది అక్టోబరులో బోయిళ్ల కన్‌స్ట్రక్షన్, బోయిళ్ల జనార్దన్, ఆర్టా వెంచర్స్ సంస్థలు 6,954 ఇళ్ల నిర్మాణం చేపడతామని నాలుగేళ్ల కిందట ఒప్పందం చేసుకున్నాయి.

2024 అక్టోబరు వరకు ఈ మూడు సంస్థలు ఒక్కటీ పూర్తి చేయలేదు. వీటికి రూ.77.31 కోట్ల బిల్లులు చెల్లించారు.

ఆయా సంస్థలు వైకాపా నేతలకు సంబంధించినవి కావడంతో గత ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించకుండానే ముందే బిల్లులు తీసేసుకున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఆలూరులో ఆర్టా వెంచర్స్ సంస్థకు 309 ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు మూడేళ్ల కిందటే ప్రభుత్వం రూ.2.20 కోట్లు అడ్వాన్స్ రూపంలో చెల్లించింది. మరో మండలంలో 115 ఇళ్ల నిర్మాణ బాధ్యతలు దీనికే అప్పగించారు. ఇప్పటి వరకు ఒక్కటీ పూర్తి చేయలేదు.

ఆప్షన్-3 కింద మంజూరు చేసినవి : 10,566
2024 మే 31 నాటికి పూర్తయినవి : 57
2024 జూన్ నుంచి ఇప్పటి వరకు పూర్తయినవి :4,352
పూర్తయ్యే దశలో ఉన్నవి :327
కూటమి ప్రభుత్వంలో పూర్తయినవి :4,679
గత ప్రభుత్వంతో కలిపి, ఇప్పటి వరకు కట్టినవి :4,736
ఇంకా గుత్తేదారులు నిర్మించాల్సినవి : 5,830

# బృహత్తర ప్రణాళిక.. ప్రగతి వీచిక



రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (రుడా) పరిధిలోని పురపాలికలకు కలిపి కొత్త బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమలు చేయనున్నారు. ఇప్పటికే డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధం చేశారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు కూడా స్వీకరించారు. దీనికి త్వరలో సర్కారు నుంచి ఆమోదం లభించనుంది. పట్టణాలతో పాటు వాటిని ఆనుకొని ఉన్న శివారు గ్రామాలను కలిపి పట్టణ సౌకర్యాలు కల్పించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో కొత్త మాస్టర్ ప్లాన్‌లో రుడా పరిధిలోని పురపాలికల్లో సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ప్రణాళిక తయారు చేశారు. రుడా పరిధిలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థతోపాటు, రామచంద్రాపురం, కొవ్వూరు, నిడదవోలు పురపాలికలు ఉన్నాయి.

**విలీనం కానున్న గ్రామాలు**

కొవ్వూరు పురపాలిక పరిధిలో చుట్టుపక్కల తొమ్మిది గ్రామాలను విలీనం చేస్తూ 36.63 చ.కి.మీ విస్తీర్ణంతో డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధమైంది. దీని కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. నమోదైన అభ్యంతరాలు పరిశీలిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 12 గ్రామాలను విలీనం చేసి ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం నగర విస్తీర్ణం 44.5 చదరపు కి.మీ ఉండగా, కొత్తగా కలిపిన గ్రామాలతో 162 చ.కి.మీ విస్తీర్ణంతో మహా రాజమహేంద్రవరంగా అభివృద్ధి కానుంది. దీంతో నగరాన్ని ఆనుకొని కాతేరు, తొర్రేడు, కోలమూరు, గాడాల, పాలచర్ల, లాలాచెరువు, దివాన్‌చెరువు, పిడింగొయ్యి, హుకుంపేట, శాటిలైట్‌సిటీ, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామ పంచాయతీలు ప్లాన్‌లో కలుస్తాయి.

రామచంద్రాపురంలో చుట్టుపక్కల 14 గ్రామ పంచాయతీలను కలిపి 43.94 చ.కి.మీతో ప్లాన్ సిద్ధం చేశారు. తాజాగా అభ్యంతరాలు స్వీకరణకు గడువు విధించారు. ప్రస్తుతం దీనిని మున్సిపల్ కార్యాలయంతోపాటు రెవెన్యూ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

నిడదవోలు పురపాలికలో శివారు ప్రాంతాల్లో 14 గ్రామాలను కలిపి 47 చ.కి.మీ విస్తీర్ణంతో ప్లాన్ తయారు చేయగా.. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ముసాయిదా ప్లాన్ సిద్ధమవుతుంది. రుడా నేతృతంలో ప్రణాళికా విభాగం అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

**పట్టణీకరణతో మౌలిక వసతులు**

కూటమి ప్రభుత్వం పట్టణీకరణ పేరుతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలని నిర్ణయించింది. ఆ బాధ్యతలను అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీకి అప్పగించారు. దీంతో పురపాలికలకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో అర్బన్ తరహాలో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తారు. తద్వారా పట్టణాల తరహాలో రోడ్ల విస్తరణ, కాలువల ఆధునికీకరణ చేపడతారు. గ్రామాల్లో తాగునీటి సదుపాయం మెరుగుపరుస్తారు. విద్య, ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తారు. గ్రామాల్లో ప్రాథమిక కేంద్రాలను విస్తరించడం, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తారు. పీపీపీ విధానంలో నిర్మాణ రంగాన్ని తీసుకొస్తారు. హోటళ్లు, పర్యాటక అభివృద్ధి, పార్కులు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు కార్యాచరణ అమలు చేస్తారు. వాస్తవానికి రుడా పరిధి 3156.67 చ.కి.మీ విస్తీర్ణంతో ఉంది. 392 గ్రామాలు, 27 మండలాలు ఉన్నాయి. అయితే 4 పురపాలికలను మినహాయిస్తే మిగిలిన గ్రామాల్లో కూడా ఇదే తరహాలో యూఎల్‌బీలను కూడా విస్తరిస్తారు.

# క్వారీ శకటాలు.. ఛిద్రమవుతున్న మార్గాలు..!



కాకినాడ : ఓ వైపు గుంతల మార్గాలను ప్రభుత్వం బాగుచేస్తుంటే మరోవైపు క్వారీలు, క్రషర్ల లారీలు ఛిద్రం చేస్తున్నాయి. వీటి ధాటికి దుమ్ము, ధూళితోపాటు ఈత కొలనులను తలపించేలా గోతులు పడుతున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో కత్తిపూడి, రౌతులపూడి మార్గంలో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. కంకర, బండరాళ్లతో లారీలు రయ్..రయ్‌మంటూ దూసుకెళుతుంటాయి. పరిమితికి మించి బరువుతో ఊరి మధ్య నుంచే భారీ టిప్పర్లు తిరుగుతుండటంతో క్షణ క్షణం భయం భయంగా గడుపుతున్నామని ఎదుట స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

**రాత్రి..పగలు తేడా లేకుండా**

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో మెటల్, గ్రావెల్ నల్లరాతి క్వారీలున్నాయి. పైడిపాల ప్రాంతంలో క్రషర్లు ఎక్కువగా ఉన్నాయి. దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా బమిడికలొద్ది లేటరైట్ క్వారీ ఉంది. వీటి నుంచి రౌతులపూడి, శంఖవరం మండల కేంద్రాల మీదుగా కత్తిపూడి కూడలిలో జాతీయ రహదారి వరకు 20 కి.మీ పొడవునా రాత్రి, పగలు తేడా లేకుండా భారీ వాహనాలు తిరుగుతూనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 20 టన్నుల బరువు వాహనాలకు వీలుగా రోడ్లు నిర్మిస్తున్నారు. కానీ క్వారీ ట్రిప్పర్లు 50 నుంచి 60 టన్నుల బరువుతో తిప్పుతున్నారు. ఇరుకురోడ్లు, గ్రామాల మధ్య నుంచి వెళుతుండటంతో దుమ్ము, ధూళి ఇళ్లల్లోకి చేరుతోంది.

**అంతా సెటిల్‌మెంట్లే..**

క్వారీ లారీలతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎవరినైనా క్వారీ లారీ ఢీకొంటే అక్కడ కేసులేవీ నమోదు కావు. అప్పటికప్పుడు సెటిల్‌మెంట్ చేసి విషయం బయటకురాకుండా చేస్తున్నారు. దీనికి స్థానిక పెద్దలు సహకారం అందిస్తున్నారు. క్వారీలు, క్రషర్ల నుంచి వెళ్లే ప్రతి లారీకి కొంత మొత్తం చొప్పున నేతలకు ముట్టజెప్పుతున్నారనే ఆరోపణలున్నాయి. 'క్వారీ లారీలు నిమిషానికి 30 తిరుగుతున్నాయి. దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నాం. చాలా మంది అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నారు.' అని రౌతులపూడికి చెందిన సుభాషిణి వాపోయారు. 'ఈ మార్గంలో ఆటో తిప్పడానికే భయపడుతున్నాం. వచ్చిన ఆదాయం కంటే వాహనం మరమ్మతులకే ఎక్కువ ఖర్చవుతోంది. అడుగడుగునా గోతులు, వేగంగా వచ్చే లారీలతో నిత్యం భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం.' అని ఆటో డ్రైవర్ గోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. 'క్వారీ లారీలు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా.. అనుమతికి మించి రవాణా చేస్తున్నారా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు...వంటి అంశాలపై పరిశీలన చేయిస్తాం. నిబంధనలు అతిక్రమించే వాహనాలపై చర్యలు తీసుకుంటాం.' అని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు.

# అబ్బే.. ఆ అభ్యంతరాలు ఓ లెక్కా!



కాకినాడ: ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వం వివిధ పద్దుల కింద ఇచ్చే నిధుల వ్యయంలో స్థానిక సంస్థలు పారదర్శకత పాటించడం లేదు. చేసే పనులకు, రాస్తున్న లెక్కలకు పొంతన ఉండడంలేదు. ఉమ్మడి జిల్లా పరిషత్తుకు సంబంధించి వైకాపా హయాంలో గత అయిదేళ్లలో సుమారు రూ.85.45 కోట్ల లెక్కల్లో తేడాలపై ఆడిట్ అధికారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందులో కొన్ని అవకతవకలు, మరికొన్ని విధాన లోపాలున్నా అధికారులు కిమ్మనడంలేదు.

**దస్త్రాల్లో లెక్కలు.. అన్నీ చిక్కులే**

జడ్పీలో 2019 నుంచి 2024 మధ్యలో 397 లావాదేవీలు, వ్యవహారాల్లో రూ.85.45 కోట్ల లెక్కలు తేలడంలేదు. కొన్ని పనులకు ఎం.బుక్‌లో ఒకలా, చెల్లింపుల రిజిస్టర్‌లో మరోలా ఉన్నాయి. వాణిజ్య సముదాయాలు, జడ్పీ ఆస్తుల నుంచి లీజు ఆదాయాలు, వేలం పాటల నిర్వహణలో తేడాలున్నాయి. ( జడ్పీ కల్యాణ మండపంలో లైటింగ్, డెకరేషన్, సౌకర్యాల కల్పనకు 2021-22 నుంచి 2023-24 వరకు వేలం లేక రూ.10 లక్షలకుపైగా కోల్పోవాల్సి వచ్చింది. ఎన్నికల సామగ్రి నిల్వకు ఉపయోగిస్తున్నామని చెబుతున్నారు. మరి 2023-24 మండపం రికార్డు పరిశీలిస్తే 49 బుకింగ్స్ ఉన్నట్లు రాసిపెట్టారు. వేలం వేయకుండా అద్దెలకు ఇవ్వడంతో నష్టం చేకూరినట్లే. ( బిక్కవోలు మండలం కాపవరంలో 11 ఎకరాలు, మండపేట మండలం కేశవరంలో 15.28 ఎకరాలు జడ్పీ గ్రావెల్ భూములున్నా లీజుకు ఇవ్వలేదు. మరో 20 చోట్ల భూములు, కొబ్బరి చెట్ల ద్వారా ఆదాయం వచ్చే మార్గమున్నా వదిలేశారు. ( జిల్లాలో 63 సమగ్ర నీటి పథకాలున్నాయి. వీటిలోకి కాలువల ద్వారా వచ్చి పెరిగిన చేపలను వేలం, అమ్మకాలు చేయకుండా వదిలేస్తున్నారు. కరప, కొమ్మనపల్లి పథకాల్లో ఒకరోజు చేపల విక్రయంతో రూ.2.25 లక్షలు వచ్చింది. మిగతా పథకాల ద్వారా ఇదేమాదిరి ఆదాయం పొందొచ్చు.

**జగనన్న సేవలో ఆస్తులు మాయం..**

వేమగిరిలో 22.89 ఎకరాల క్వారీ భూములు జడ్పీకి ఉండేవి. జగనన్న కాలనీ స్థలాల కోసం సీఈవో అప్పగించేశారు. ( 2023-24లో పది విద్యార్థులకు అధ్యయన సామగ్రి కోసం రూ.33 లక్షలు ఖర్చుచేశారు. జగన్ బొమ్మలు వేసి ప్రచారం చేసుకున్నారు. వీటిని ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ద్వారా కాకుండా ఓపెన్ టెండర్ పిలిచి గుత్తేదారుకు అప్పగించేశారు.

**అభ్యంతరాలను పరిశీలించాలి**

ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంది. రికార్డులు ఒక ఏడాది చూపకుంటే తర్వాత చూపించి అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అలా జరుగుతుందో లేదో చూడాలి. నిధుల దుర్వినియోగం తేలితే బాధ్యుల నుంచి రికవరీలు చేయిస్తాం. లక్ష్మణరావు, సీఈవో

# 'యాప్'సోపాలతో అందని పోషకాహారం

చిత్తూరు : యాదమరి మండలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ముఖ ఆధారిత గుర్తింపు సరిపోలక ఓ గర్భిణి, బాలింతకు ఈ నెల పోషకాహార సరకులు వరకూ అందలేదు.

జీడీనెల్లూరు మండలం ముక్కలత్తూరు పంచాయతీలోని ఓ కేంద్రంలో రెండ్రోజుల పాటు సర్వర్ పని చేయకపోవడంతో ఈ నెల 14 వరకూ 75 శాతం మాత్రమే పోషకాహార పంపిణీ చేశారు.

పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా వరకూ పోషకాహార పంపిణీ పూర్తి కాలేదు. ఒక్కో కేంద్రంలో ఒక్కో సమస్య ఉన్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొంటున్నారు. సర్వర్ సమస్య అన్ని చోట్లా ఉన్నా, ముఖ ఆధారిత గుర్తింపు సరిపోలక పోవడం, కొన్ని కేంద్రాల్లో సరకులు ఉన్నా లేనట్లు యాప్‌లో చూపుతుండటంతో పలువురికి పంపిణీ సాధ్యం కాలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీకి సాంకేతిక సమస్య తలెత్తుతోంది. గర్భిణులు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లల తల్లులకు ప్రభుత్వం వారి ఇళ్ల వద్దకే పోషకాహారాన్ని అందిస్తోంది. పారదర్శకత కోసం లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపును (ఫేషియల్ రికగ్నేషన్) ప్రవేశపెట్టింది. బాల సంజీవని, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో నమోదు తర్వాతే సరకులు అందించాలి. సర్వర్ సమస్య కారణంగా లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 4,768 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ప్రతి నెలా 47 వేల మంది పోషకాహారం ఇంటికి తీసుకెళ్తున్నారు.



సరకుల పంపిణీకి కేంద్ర ప్రభుత్వం పోషణ ట్రాకర్ యాప్‌ను, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని యాప్‌ను తెచ్చాయి.. ఇదివరకు లబ్ధిదారులు ముఖ ఆధారిత గుర్తింపు నమోదు కాకున్నా, రిజిస్టర్‌లో సంతకం తీసుకుని వస్తువులు ఇచ్చేవారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల నుంచి ముఖ ఆధారిత గుర్తింపును తప్పనిసరి చేసింది. ఇందులో సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధిదారులు గంటల కొద్దీ కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది.

**వస్తువులు లేనట్లు చూపడంతో..**

బాల సంజీవని యాప్‌లో పోషకాహారం వివరాలు నమోదు చేసి, లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు నమోదుకు యత్నిస్తే ప్లీజ్ కాంటాక్ట్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అని చూపుతోంది. కొన్నిచోట్ల సరకులు నిల్వ ఉన్నా లేవని చూపడంతో లబ్ధిదారులకు సరకులు ఉన్నా ఇవ్వడానికి వీలు కావడం లేదు. రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకున్న ముఖ ఆధారిత గుర్తింపు వివరాలు, వారికి సరకులు అందించేటప్పుడు తీసుకునే ఫేషియల్ రికగ్నేషన్‌కు సరిపోలడం లేదు. పోషణ ట్రాకర్ యాప్‌లో ఈకేవైసీ నమోదులోనూ జాప్యమవుతూ, తరచూ ఎర్రర్ అని చూపుతున్నట్లు వారు వాపోతున్నారు.

**పంపిణీ కాకుంటే కోత..**

ప్రతి నెలా 15లోగా పోషకాహారం పంపిణీ చేయాలి. యాప్‌లో నమోదైన పంపిణీ వివరాల ఆధారంగానే మరుసటి నెలలో సరకులు కేటాయిస్తారు. నిర్దేశిత సమయంలోగా పంపిణీ జరగకపోతే మరుసటి నెలలో సమస్య తలెత్తుతుంది.

**సమస్యలు పరిష్కరిస్తున్నాం..**

పోషకాహార పంపిణీ విధానంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. వాటిని ప్రతి రోజూ పర్యవేక్షించి సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. త్వరలో అన్నీ పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నారు.
– వెంకటేశ్వరి, పీడీ, ఐసీడీఎస్

# టిడ్కో ఇళ్లు.. సమస్యల గూళ్లు

ఆళ్లగడ్డ : ఇల్లు అలకగానే పండగ కాదన్న సామెత అక్షర సత్యమని ఆళ్లగడ్డ పట్టణంలోని టిడ్కో గృహాలను చూస్తే అర్థం అవుతుంది. గత ప్రభుత్వం ప్రచార్భాటం కోసం ఎన్నికల ముందుగా హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించారు. మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లు లేకపోవడంతో ఇళ్లలో చేరిన లబ్ధిదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొందరైతే ఇళ్లలో ఉండలేక ఖాళీ చేసి వెళ్లిపోయారు.

ఏడేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం రూ.72.63 కోట్లతో 30 ఎకరాల విస్తీర్ణంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. వైకాపా హయాంలో 1392 గృహాలను నిర్మించారు. మురుగు నీటి శుద్ధ కేంద్రం రూ.2.71 కోట్లతో నిర్మించారు. తుది పనులు పూర్తికాకపోవడంతో నిరుపయోగంగా మారింది. తాగు నీటి కోసం నిర్మించిన నీటితొట్టె వృథాగా ఉంది. శుద్ధజలం అందించే క్లోరినేషన్ ప్లాంట్ ఉపయోగంలోకి రాలేదు. గృహ సముదాయాల్లో తప్పకుండా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, ప్రార్థనాలయాలు ఉండాలి. ఇవి ప్రారంభమేకాలేదు.



పచ్చదనం ఎక్కడా కన్పించని స్థితి ఉంది.

మొత్తం ప్రాజెక్టు వ్యయంలో రూ.72.63 కోట్లు కాగా ఇప్పటికే రూ.70.14 కోట్ల మేర ఖర్చుచేశారు. మిగిలిన రూ.2.49 కోట్లలో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మొత్తం గృహాలు : 1392
మొత్తం విస్తీర్ణం : 30 ఎకరాలు
గృహ ప్రవేశాలు : 1300
ఖాళీ చేసి : 130 వెళ్లిన వారు

వెలుగోడులో విజిలెన్స్ దాడులు

**రూ.13 లక్షల విలువైన ఎరువుల అమ్మకాల నిలిపివేత**

వెలుగోడు పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. దుర్గాభవాని ఎరువుల దుకాణంలో రూ.13 లక్షల విలువైన ఎరువులకు సంబంధించి విక్రయాలను ఆపేసినట్లు ఏవో స్వామి తెలిపారు. అనుమతులు లేని ఎరువులు, మందులు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేసి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు ప్రసాద్, శ్రీనివాసులు, ఆత్మకూరు ఏడీఏ శశికళ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక తరలింపు.. ప్రమాదముప్పు!

తాడిపత్రి : తాడిపత్రి పరిసరాల్లోని పెన్నానది నుంచి గుట్టుగా రాత్రి,పగలు అన్న తేడా లేకుండా ట్రాక్టర్ల కొద్దీ ఇసుక తరలిపోతోంది. ఈక్రమంలో ప్రధాన రహదారుల్లో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను నడుపుతున్నారు. ఆమార్గాల్లో వెళ్లే జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. తాడిపత్రి పరిసరాల్లో సుమారు 12 కిలోమీటర్ల మేర పెన్నానది ప్రవహిస్తోంది. నందలపాడు, వరాలుతోట, కొత్త, పాత పెన్నా వంతెనల వద్ద నుంచి రోజూ 60 ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరును రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు ఒక్కో ట్రాక్టర్



4 ట్రిప్పులు పైగానే ఇసుకను నదిలో నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమార్కులు రాత్రి వేళల్లో పెన్నానది నుంచి ఇసుకను తెచ్చుకుని ఉదయం పూట ఆయా నిర్మాణాల వద్దకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఎవరైనా అధికారులు చూస్తారని అతివేగంతో ప్రధాన దారుల గుండా వెళ్తున్నారు. దీంతో పలువురు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. రెండు వారాల క్రితం మున్సిపల్ షాదీఖానా వద్ద అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ అతివేగంతో వచ్చి ఆటోను ఢీకొనడంతో డ్రైవర్‌కు కాలు విరిగింది.

నంద్యాల రోడ్డులో ఇటీవల అక్రమంగా ఇసుకను పట్టణంలోకి తీసుకొస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం: సాయిప్రసాద్, సీఐ, తాడిపత్రి సీఐ తాడిపత్రిలోని పెన్నానది, యల్లనూరు మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తాడిపత్రిలోకి తీసుకొచ్చే వారిపై ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణా, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

## నైపుణ్య వెలుగులు

చిత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెదేపా ప్రభుత్వం నిరుద్యోగ యువతతో పాటు, ఇంజినీరింగ్, యూనివర్సిటీ స్థాయిలో పీజీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు గతంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు, సీమెన్స్ కేంద్రాలతో పాటు సీఎంఎస్ఈ కేంద్రాలు, డెసాల్ట్, ఈఎస్సీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వేలాది మంది యువత శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, సీమెన్స్ కేంద్రాలు మూతపడటంతో యువత భవిత అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తెస్తే వృత్తి నైపుణ్యాలు సాధించడంతోపాటు ఉద్యోగాలు దక్కే అవకాశం ఉంది. మంగళవారం ప్రపంచ యువ నైపుణ్యం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్కిల్ హబ్, సీఎంఎస్ఈ, ఈఎస్సీ కేంద్రాల్లో



శిక్షణ పొందిన యువత నాలుగు వేల మంది పైచిలుకు ఉద్యోగాలు సాధించారు. వృత్తివిద్యలో శిక్షణ పొందిన యువత, మహిళలు చేతివృత్తుల్లో ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు అధునాతన టెక్నాలజీలో శిక్షణ పొంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించి తమ కాళ్లపై నిలబడి జీవిస్తున్నారు.

**ప్రతి నియోజకవర్గంలో..**

ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని స్కిల్‌హబ్ కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రతి బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నాం. తద్వారా ఎంతో మందికి ప్రయోజనం కలుగుతోంది. నిరుద్యోగ యువత స్కిల్‌హబ్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి. – ఆర్.లోకనాథం, గుణశేఖర్, తిరుపతి, చిత్తూరు జిల్లాల నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు

## కానరాని భద్రతా చర్యలు..!

రాజమహేంద్రవరం : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 6,56,341 క్యూసెక్కుల అదనపు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. పుష్కరఘాట్ వద్ద ఏకంగా 50 అడుగులకు వరద చేరింది. ఘాట్లపైకి నీరు చేరడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. ఆదివారం రాత్రికి కొంతమేర ఉద్ధృతి తగ్గినా, ఇక్కడ ప్రవాహం జోరుగా ఉంది. గోదావరిని చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. నదిలో స్నానాలు చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఇలాంటి సందర్భాల్లో పలువురు గల్లంతైన సందర్భాలు ఉన్నాయి.

పెరుగుతున్నసందర్శకులు: వరద సమయంలో జలవనరులశాఖ, నగరపాలక సంస్థ, పోలీసు తదితర శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం. పుష్కరఘాట్ వద్ద, వీఐపీ ఘాట్, సరస్వతీ ఘాట్, గౌతమీ తీరానికి సందర్శకులు భారీగా వస్తున్నారు. ఇక్కడ ఊబిలు కూడా ఉన్నాయి. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏటా నదీ తీర ప్రాంతాల్లో డ్రెడ్జింగ్ చేపట్టాలి. నాలుగేళ్లుగా డ్రెడ్జింగ్ పనులు నిలిపేశారు. దీంతో నదీ సమతుల్యత దెబ్బతింటుంది. ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. పుష్కరఘాట్‌లోకి ప్రవేశం లేకుండా తాళాలు వేస్తారు. మిగిలిన ఘాట్లు మూసేస్తారు. పోలీసుల బందోబస్తు కూడా ఉంటుంది. ప్రస్తుతం ఎలాంటి రక్షణ చర్యలు లేవు. నదిలో బోటు షికారును తాత్కాలికంగా ఆపేశారు. పాపికొండలు యాత్ర రద్దు చేశారు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గట్టుపై ఏమాత్రం జారినా నదిలో పడి కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# గజానికో గజదొంగ!!



పెనుకొండ : నగరంలో వీలు చిక్కితే చాలు ఉద్యానవనాల స్థలాలు స్వాహా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గత ఏడాదిగా జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలు, పార్కులే లక్ష్యంగా కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. విలువైన స్థలాలను పరిరక్షించాల్సిన జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు కళ్లు మూసుకొని వారికి మేలు చేస్తున్నారు. ఇటీవల పలు చోట్ల ఇవి బయటపడ్డాయి. అదే రీతిగా మరో చోట అక్రమార్కులు పంజా విసిరారు.

వాల్తేరు ప్రాంతంలోని 28వ వార్డులో 'ఫేకర్ లే అవుట్ ఉంది. ఇక్కడ ఓపెన్ స్పేస్ స్థలం తమదని, అందులో జీవీఎంసీ పార్కు నిర్మాణం చేపడుతున్నందున టీడీఆర్ విడుదల చేయాలని, లేదంటే స్థలం అప్పగించాలని కోరుతూ అధికారులకు ఓ దరఖాస్తు వచ్చింది. ఈ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినవారంతా నిబంధనల మేరకు జీవీఎంసీకి 'ఓపెన్ స్పేస్'గా 4,500 గజాల స్థలాన్ని గిఫ్ట్‌డీడ్ చేశారు. అనంతరం జీవీఎంసీ దానిని పార్కుగా అభివృద్ధి చేయడానికి రూ.1.60 కోట్లు కేటాయించి పనులు చేపట్టింది. అయితే అదే స్థలంలో ఓ వ్యక్తి దర్జాగా షెడ్డు వేయడంతోపాటు, దానికి అవసరమైన విద్యుత్తు కనెక్షన్‌ను తీసుకున్నాడు. జీవీఎంసీ నియంత్రణలో ఉన్న అత్యంత విలువైన స్థలంలో రేకుల షెడ్డు వేసి, విద్యుత్తు మీటరు ఏర్పాటు చేసే వరకూ అధికారులు ఎందుకు అడ్డుకోలేదనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

**ఇంజినీరింగ్ పనుల్లోనూ...**

ఈ ఓపెన్ స్పేస్‌లో పార్కు నిర్మాణానికి ఒక్కొక్కటి రూ. 20 లక్షల చొప్పున ఎనిమిది పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. నడక మార్గం, కారు పార్కింగ్, షెడ్డు నిర్మాణం, ఫౌంటెయిన్, ప్రహరీ వంటివి ఇందులో ఉన్నాయి. అయితే గుత్తేదారు, ఇంజినీరింగ్ అధికారులు కలిసి కేవలం ఎల్ ఆకారంలో ప్రహరీ నిర్మించి వదిలేశారు. దానికి చేసిన వ్యయం రూ. 40 లక్షలే ఉంటుందని అంచనా. ప్రతిపాదనలు ఒక రకంగా.. చేసిన పనులు మరో రకంగా ఉన్న తీరుపై విచారణ చేపట్టాల్సి ఉంది.

**ఫిర్యాదుల వెల్లువ**

నగరంలో పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలపై పత్రికల్లో వరుసగా కథనాలు వస్తున్న నేపథ్యంలో సోమవారం పీజీఆర్ఎస్‌కు పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

8వ వార్డు షిప్‌యార్డు లే అవుట్ లో బింద్రానగర్ సర్వే నెంబరు 281/8,9,10లో... 81 సెంట్ల పార్కులో షెడ్ల నిర్మాణం జరిగింది. దీని విలువ రూ.20కోట్లు ఉంటుంది. గత ఐదారేళ్లలో దశలవారీగా కబ్జా చేశారు. స్థానికులు దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. నరవలో సర్వే నెంబరు 53, 54లో ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ లో రెండు పార్కు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. 400 గృహాలిక్కడ ఉండగా, వారు వినియోగించడానికి కేటాయించిన పార్కు స్థలాల్లో 23 సెంట్లలో ఓ వాణిజ్య సముదాయం నిర్మాణం చేపట్టగా, మరో పార్కు 1200 గజాల స్థలం ఆక్రమణకు గురైంది, అందులో షెడ్లు, పాకలు వేయడం గమనార్హం.

# మిరప వేయాలా.. వద్దా?



అనంతపురం : తుంగభద్ర జలాశయంలో గేట్ల మరమ్మతు కారణంగా 105 టీఎంసీలకు గాను 80 టీఎంసీలే నిల్వ ఉంచనున్నారు. దీంతో హెచ్చెల్సీ వాటా 32 టీఎంసీల నుంచి 18 టీఎంసీలకు కుదించారు. నవంబరు చివరి వరకు మాత్రమే కాలువకు నీరందిస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు పరిధిలో మిరప రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మిరప సాగు చేయాలా? ప్రత్యామ్నాయం చూసుకోవాలా? అనే సందిగ్ధంలోకి వెళ్లిపోయారు.

**గత అనుభవం పట్టదా?**

2023లోనూ మిరప రైతులకు ఇదే పరిస్థితి ఎదురైంది. ఆ ఏడాది నవంబరు 25నే నీటిని నిలిపేశారు. దీంతో పంటను కాపాడుకోవడానికి ఎన్నో అవస్థలు పడ్డారు. కొందరు అప్పటికప్పుడు బోర్లు వేయించుకున్నారు. మరికొందరు రైతులు రూ.వేలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీరందించారు. అయినా 50 శాతానికి పైగా దిగుబడి కోల్పోయారు. గత అనుభవం ఉన్నా హెచ్చెల్సీ అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముందుగానే మేల్కోకపోతే ఈ ఏడాది రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

**40 వేల ఎకరాల్లో...**

హెచ్చెల్సీ ప్రధాన కాలువ కింద రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు బ్రాంచి కెనాల్ కింద ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నారు. ఇప్పటికే నారు సిద్ధం చేసుకుంటున్నారు. ఆగస్టు మధ్య నుంచి నాటుకుంటే ఫిబ్రవరిలో కోతకు వస్తుంది. తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి నవంబరు వరకే నీరు ఇస్తే మిరప రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. చివరి దశలో తడులు అందకపోతే దిగుబడి చేతికందదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల చొప్పున రైతులు రూ.800 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ లెక్కన రూ.1400 కోట్లు విలువైన దిగుబడి నష్టపోయే ప్రమాదం ఉంది.

**జనవరి వరకు నీరివ్వాలి: వన్నూరుస్వామి, ఛాయాపురం**

జీబీసీ కింద మూడు ఎకరాల్లో మిరప సాగు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నా. పెట్టుబడికి రూ.5 నుంచి రూ.6 లక్షలు ఖర్చవుతుంది. కాలువకు నవంబరు వరకే నీరు ఇస్తే పంట చేతికి రాదు. ప్రభుత్వం స్పందించి జనవరి నెలాఖరు వరకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే మిరప పంట వేయవద్దని అధికారికంగా చెప్పాలి.

# పెనుకొండ మీద నగరవనం



పెనుకొండ : పెనుకొండ పర్యాటక అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ప్రభుత్వం గతేడాది అటవీశాఖ ఆధ్వర్యంలో కొండ మీద నగరవనం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసింది. అక్కడ నీటి సౌకర్యం లేకపోవడంతో పనుల ప్రారంభానికి ఆలస్యమైంది. ప్రస్తుతం నగరవనంలో భాగంగా కొండమీద పర్యావరణ విద్యా కేంద్రం, ఫుడ్‌కోర్ట్ భవనాల నిర్మాణం ఇటీవల ప్రారంభించారు. వారాంతంలో పెనుకొండకు పర్యటనకు వచ్చే బైకర్లు కొండమీద కనీసం తాగునీరు, తేనీరు, అల్పాహారం లభించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోటను చూసేందుకు బెంగళూరు నుంచి 150 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే యాత్రికులకు ఇక్కడ ఏమీ సౌకర్యాలు లేకపోవడం శోచనీయం. నగరవనం పూర్తవ్వగానే ప్రజలకు అవసరైన మౌలిక వసతులతో పాటు, అల్పాహారం, వసతి అందుబాటులోకి వస్తాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధికారులు పాలకులు ప్రత్యేక చొరవచూపి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

కొండమీద శ్రీఘనగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు 8 కిలోమీటర్ల మేరకు ఘాట్రోడ్డులో తిరుపతి మలుపులను తలపించేలా రెండు వరుసల రహదారి నిర్మించడంతో వారాంతంలో కర్ణాటకలోని బెంగళూరు, చిక్కబళ్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకుల తాకిడి పెరిగింది. ఇప్పటికే ఇస్కాన్ మందిరానికి ప్రభుత్వం దాదపు 5 హెక్టార్ల భూమి కేటాయించింది. 108 అడుగుల శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహం నిర్మించడం కోసం కొంతకాలంగా భూమి చదును పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయనగర సామ్రాజ్యం వేసవి విడిది, రెండోరాజధాని పెనుకొండలోని అలనాటి రాచరికపు పాలను అద్దం పట్టే పురాతన కట్టడాలకు పురావస్తుశాఖ ఆధ్వర్యంలో మెరుగులు దిద్దితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. గతంలో కొండ మీదికి రోప్‌వే మంజూరైనప్పటికీ గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిధులు సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమవ్వడంతో అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. పర్యాటక అభివృద్ధితో ఈప్రాంతంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. రోప్‌వే నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తాం: శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఆర్వో, అటవీశాఖ, పెనుకొండ**

గతంలో కొండమీద నీటి సౌకర్యం లేకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం కొండమీద ఉన్న కోనేరులోని నీటిని భవనాల నిర్మాణం కోసం వినియోగిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయించి, పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం.

## గాడినపడని.. పోషణ్ ట్రాకర్

తిరుపతి : అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టేలా తీసుకొచ్చిన యాప్‌లను సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. సాంకేతిక సమస్యలతో కార్యకర్తలు, లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకున్న ముఖ ఆధారిత గుర్తింపు వివరాలు సరకులు అందించేటప్పుడు సరిపోలడం లేదని, రెండు యాప్‌లు కాకుండా ఒకే యాప్‌లో వివరాలు నమోదు చేసేలా వెసులుబాటు కల్పిస్తే పరిస్థితి చక్కబడే అవకాశం ఉందని కార్యకర్తలు విన్నవిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బియ్యం, గుడ్డు, నూనె, పాలు, రాగులు, అటుకులు, బెల్లం, ఖర్జూరం వంటి పోషకాహారాన్ని ప్రభుత్వం ప్రతినెలా రెండుసార్లు లబ్ధిదారులకు అందిస్తుంది. పంపిణీ తీరును పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వం బాలసంజీవని యాప్‌లను తీసుకొచ్చాయి. సర్వర్, సాంకేతిక సమస్యల కారణంగా కేంద్రాల్లో సరకులు నిల్వఉన్నా లేనట్లు చూపడం, రిజిస్ట్రేషన్ సకాలంలో పూర్తికాకపోవడం, బాల సంజీవని యాప్‌లో పోషకాహార వివరాలు



నమోదుచేసి లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపునకు యత్నిస్తే 'కాంటాక్ట్ సిస్టం అడ్మిన్' చూపుతూ మొరాయిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రతినెలా 15వ తేదీలోపు యాప్‌లో నమోదైన పంపిణీ వివరాల ప్రకారం మరుసటి నెలలో ఆయా కేంద్రాలకు సరకులు కేటాయిస్తారు. సర్వర్ ఇతర సమస్యల కారణంగా పంపిణీ జరగకపోతే మరుసటి నెలలో సమస్యలు తలెత్తుతున్నట్లు కార్యకర్తలు వాపోతున్నారు. కేంద్రం జులై నుంచి ముఖఆధారిత గుర్తింపు తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఈ తరహా సాంకేతిక సమస్యలు లేకుండా అధికారులు చూడాల్సిన అవసరం ఎంతో ఉంది.

**పరిష్కారం చూపుతాం..** జిల్లాలోని కేంద్రాలకు ప్రభుత్వం కొత్త చరవాణులు త్వరలో అందించనుంది. అందులో సమాచారం మొత్తం నిక్షిప్తమై ఉంటుంది. తదనంతరం సాంకేతికపరమైన సమస్యలు అధిగమించే వీలుంది.

– వసంతబాయి, ఐసీడీఎస్ పీడీ, తిరుపతి జిల్లా

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు : 12

అంగన్‌వాడీ కేంద్రాలు : 2,492

7నెలలు – 3 ఏళ్లలోపు పిల్లలు : 52,380

బాలింతలు: 5,895 గర్భిణులు: 9,998

## అనుసంధాన దారికి అడుగులు

నంద్యాల : జాతీయ రహదారుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాల అనుసంధాన రోడ్ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. వాటి అభివృద్ధికి వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల–చిత్తూరు(ఎన్‌హెచ్–40), కర్నూలు–గుంటూరు (340సీ), సోమయాజులపల్లె–డోన్ (340బీ), ఎన్‌హెచ్ 167, ఎన్‌హెచ్–44, చెన్నై–సూరత్ 150సీ జాతీయ రహదారులు ఉన్నాయి. వాటి వెంట గతంలో బైపాస్ రోడ్లు ఏర్పాటుచేశారు. దశాబ్దాలుగా ఇవి అభివృద్ధికి నోచుకోలేదు. నిధులివ్వాలని కేంద్రం నిర్ణయించడంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు.

**ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు**

ఎన్‌హెచ్–40 పరిధిలో నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో బైపాస్ రహదారులు నిర్మించారు. వీటిని అభివృద్ధి చేసేందుకు ఇంజినీర్లు ఇటీవల సర్వే చేసి రూ.10 కోట్ల వరకు అవసరమవుతుందని అంచనా వేశారు.

340బీ సోమయాజులపల్లె–డోన్ రహదారి మార్గంలో బేతంచెర్ల, డోన్ ప్రాంతాల్లో బైపాస్ రహదారులు ఉన్నాయి. కర్నూలు–గుంటూరు 340సీ రహదారిపై కర్నూలు సమీపంలోని నన్నూరు టోల్‌ప్లాజా వద్ద బైపాస్ రహదారి మార్గం ఉంది. ఈ రెండు రహదారులకు సంబంధించి ఇటీవలే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలిచ్చారు.

బళ్లారి–రాయచూరు ఎన్‌హెచ్ 167కు సంబంధించి కర్నూలు జిల్లాలో హాలహర్వి–మాధవరం వరకు 58 కి.మీ. పొడవునా ఉంది. ఆదోని



వద్ద బైపాస్ ఉంది. ఈ రహదారికి రూ.5 కోట్ల వరకు అవసరమని అంచనా వేశారు.

ఎన్‌హెచ్–44 బెంగళూరు–హైదరాబాద్ రహదారికి సంబంధించి రూ.10 కోట్లు అవసరమని తేల్చారు.


చెన్నై–సూరత్ 150సీ రహదారి 25 కి.మీ.ల పొడవునా ఉంది. సంబంధిత అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి రూ.10 కోట్లు అవసరమని అంచనా రూపొందించారు.

మురుగు కాల్వల నిర్మాణం

జాతీయ రహదారుల నుంచి బైపాస్ మార్గాలకు వెళ్లే ప్రాంతాల్లో వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నీళ్లు నిలిచిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాల్వలు లేకపోవడంతో మురుగు నిలుస్తోంది. 'మురుగు' రహదారికి ముప్పు తెచ్చి పెడుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించనున్నారు.

# నల్ల చీర కట్టిన తెల్ల పిల్ల

చైల్డ్ ఆర్టిస్ట్‌గా బాలీవుడ్‌లో 1997లోనే ఎంట్రీ ఇచ్చిన ఫాతిమా సనా షేక్ 'దంగల్'తో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకుంది. ఆమీర్ ఖాన్ కూతురు పాత్రలలో దంగల్‌లో కనిపించిన ఫాతిమా సనా షేక్ నటనతో మెప్పించింది. గీతా ఫోగట్ పాత్రకు ఫాతిమా సనా షేక్ చేసినట్లుగా మరే నటి న్యాయం చేసి ఉండక పోవచ్చు అనేది చాలా మంది అభిప్రాయం. దంగల్ సినిమాలో ఆమీర్ ఖాన్ కూతురు పాత్రలో నటించిన ఫాతిమా ఆ వెంటనే ఆయనకు జోడీగా హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఫాతిమా సనా షేక్ సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం మాత్రమే కాకుండా, బోల్డ్ పాత్రల్లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుంది. రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. నెట్టింట ఈమె షేర్ చేసే ఫోటోలు వీడియోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఫాతిమా సనా షేక్ తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఈసారి బ్లాక్ చీర కట్టిన ఫాతిమా చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని ఇప్పటికే పలు సార్లు నిరూపితం అయ్యింది. ఎప్పుడూ మోడ్రన్ డ్రెస్‌లో ఆకట్టుకునే ఫాతిమా ఈసారి అంతకు మించి అన్నట్లుగా చీర కట్టులో కనిపిస్తుంది. ఫాతిమా సనా షేక్ నెట్టింట షేర్ చేసిన ఈ నల్ల చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి.



సింపుల్ అండ్ స్వీట్ లుక్‌లో ఫాతిమా సనా షేక్ ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. కొందరు హీరోయిన్స్ ఫోటో షూట్స్ చాలా హంగామాగా ఉంటాయి. కానీ ఫాతిమా సనా షేక్ ఫోటో షూట్స్ చాలా సింపుల్‌గా ఉంటాయి. అయినా కూడా వైరల్ కావడానికి ఆమె అందం కారణం. ఎలాంటి ఔట్ ఫిట్‌లో అయినా భలే అందంగా ఉందే అనిపించుకునే తరహా ఫిజిక్ ఫాతిమా సనా షేక్ ది అంటూ ఆమె అభిమానులు అంటూ ఉంటారు. ఈ మధ్య కాలంలో సినిమాల కంటే వివాదాలతో ఎక్కువగా వార్తల్లో ఉంటున్న ఫాతిమా సనా షేక్ ఇలా అప్పుడప్పుడు అందాల ఫోటోలతోనూ వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 1992లో ముంబైలో జన్మించిన ఫాతిమా ఫోటోగ్రఫీలో ప్రావిణ్యం సొంతం చేసుకుంది. న్యూరోలాజికల్ పరిస్థితులపై అవగాహన పెంచడం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. తాను ఎదుర్కొన్న మూర్ఛ జబ్బు గురించి అవగాహన పెంచడం లో ఫాతిమా సనా షేక్ కీలక పాత్ర పోషించింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఫాతిమా సనా షేక్ మాట్లాడుతూ తాను విమాన ప్రయాణ సమయంలో పలు సార్లు మూర్ఛ జబ్బుతో బాధ పడినట్లు చెప్పుకొచ్చింది. ఆ సమయంలో తనకు సిబ్బంది తో పాటు పలువురు సాయంగా నిలిచారు. కొందరికి అలాంటి సహాయం అందక పోవడంతో మృతి చెందుతున్నారని, వారందరి కోసం తాను అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫాతిమా పేర్కొంది.

# మీకు థ్యాంక్స్ చెప్పడానికి 15 ఏళ్లు పట్టింది

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత మయోసైటిస్ కారణంగా సినిమాల నుంచి బ్రేక్ తీసుకుని, మెల్లిగా కోలుకున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత సమంత మళ్లీ ఇప్పుడే యాక్టివ్ అవుతున్నారు. రీసెంట్ గా నిర్మాతగా మారి శుభం సినిమాతో మంచి హిట్ ను అందుకున్న సమంత తాజాగా జరిగిన 24వ తానా మహాసభలకు హాజరై తెలుగు ఆడియన్స్ గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. తాను ఏ పని చేసినా ముందుగా ఆలోచించేది తెలుగు ప్రేక్షకుల గురించేనని, ఈ వేదికపై నిలబడే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు సమంత. తాను ప్రతీ ఏడాదీ తానా గురించి వింటూనే ఉన్నానని, ఏ మాయ చేశావే సినిమా నుంచే తమలో ఒకరిగా చూసిన తెలుగు వారికి సమంత ఈ సందర్భంగా ధన్యవాదాలు చెప్తూ తెలుగు వారు తన జీవితంలో ఎంతో ముఖ్యమైన వారని తెలిపారు సమంత. అందులో భాగంగా తానా వేదికపై మాట్లాడుతూ సమంత ఎమోషనల్ అవగా, దానికి సంబంధించిన



వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. ఈ స్టేజ్ పై నిలబడి అందరికీ థ్యాంక్స్ చెప్పడానికి తనకు 15 ఏళ్లు పట్టిందని, ఏ మాయ చేసావే నుంచి మీకు థ్యాంక్స్ చెప్పే అవకాశం ఎప్పుడూ రాలేదని, మొదటి సినిమా నుంచే మీరంతా నన్ను సొంతమనుకున్నారని, ఇది తన కెరీర్లో ఓ ముఖ్యమైన దశ అని, తన మొదటి ప్రొడక్షన్ శుభమ్ సినిమాను ఎక్కువగా మెచ్చుకున్న వ్యక్తులు నార్త్ అమెరికాకు చెందిన వాళ్లేనని సమంత అన్నారు. తాను ఎలాంటి డెసిషన్ తీసుకున్నా తెలుగు ప్రేక్షకుల గురించే ఆలోచిస్తానని, తెలుగు వారంతా తనకు ఓ స్పెషల్ ఐడెంటిటీని ఇచ్చారని, తెలుగు తనకు సొంతిల్లు లాంటిదని, ఓ బేబీ మిలియన్ డాలర్లు సంపాదించిన విషయం కూడా తనకు గుర్తుందని చెప్పారు సమంత. మీరెంత దూరంగా ఉన్నప్పటికీ ఎప్పుడూ నా మనసులోనే ఉంటారని సమంత ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా సమంత ప్రస్తుతం రక్త్ బ్రహ్మాండ్ తో పాటూ మా ఇంటి బంగారం అనే సినిమాను చేస్తున్న సంగతి తెలిసిందే.




# కేరళ సుందరితో ఢిల్లీ బోయ్ ప్రేమ పాట్లు




ఒక ప్రాంతం భాష యాస కల్చర్ కట్టు బొట్టు.. ఇంకో ప్రాంతంలోని భాష యాస కల్చర్ కట్టుబాట్లు ఇతర వ్యవహారాలతో సింక్ అవ్వడం అంత సులువేమీ కాదు. ముఖ్యంగా ఉత్తరాది కల్చర్ కి, దక్షిణాది కల్చర్ కి మధ్య ఉండే వైవిధ్యం చాలా ఎక్కువ. ఇక్కడ మాస్ రాణీకి అక్కడ క్లాస్ అబ్బాయికి ప్రేమ కుదిరితే ఆ తర్వాత ఇరువైపులా తల్లిదండ్రులు, బంధువులు కూడా చాలా తంటాలు పడాల్సి ఉంటుంది. పిల్లల ప్రేమపెళ్లిళ్ల వ్యవహారంలో ఇలాంటివి ఎన్నో చూస్తున్నాం. క్రాస్ కల్చర్ వివాహాలు చాలా సమస్యల్ని కొని తెస్తుంటాయి. అదే సమయంలో ఒకరి కల్చర్ నుంచి మరొకరు చాలా నేర్చుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. ఈ తరహా కథాంశాలతో సినిమాలు కూడా కొన్ని ఇంతకుముందు తెరకెక్కి మంచి ఆదరణ పొందాయి. షారూఖ్ ఖాన్- దీపిక పదుకొనే జంటగా రోహిత్ శెట్టి తెరకెక్కిన చెన్నై ఎక్స్ ప్రెస్%-% ఔట్ అండ్ ఔట్ కామెడీ ఎంటర్ టైనర్ జానర్ లో అత్యంత భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. చెన్నైలోని సాంప్రదాయ మాఫియా కుటుంబానికి చెందిన అమ్మాయి(దీపిక)తో షారూఖ్ స్నేహం, ప్రేమ నేపథ్యంలో ఈ సినిమా ఆద్యంతం రక్తి కట్టిస్తుంది. హిందీ ప్రేక్షకులే కాదు, దక్షిణాది ప్రేక్షకులు కూడా ఈ సినిమాని బాగా ఆదరించారు. ఇప్పుడు ఇంచుమించు అదే జానర్ లో క్రాస్ కల్చర్ లవ్ స్టోరీతో ఓ సినిమా తెరకెక్కింది. సిద్ధార్థ్ - జాన్వీ కపూర్ జంటగా నటించారు. ఇందులో జాన్వీ కపూర్ కేరళకు చెందిన సాంప్రదాయ కుటుంబానికి చెందిన యువతి కాగా, ఢిల్లీ అబ్బాయిగా సిద్ధార్థ్ మల్హోత్రా నటించాడు. ఈ చిత్రం దక్షిణాది - ఉత్తరాది ప్రేమకథను తెరపై ఆవిష్కరించనుంది. పరాన్ (సిద్ధార్థ్ మహెూత్రా) తన స్నేహితుడితో కలిసి కేరళకు వచ్చి అక్కడ సుందరిని (జాన్వి కపూర్) కలిసాక ఏం జరిగిందనేది ట్రైలర్ లో చూపించారు. ఇద్దరూ ప్రేమలో పడిన తర్వాత అన్ని ప్రేమకథల మాదిరిగానే వారు కూడా చాలా అడ్డంకులను ఎదుర్కోవలసి వస్తుంది. ట్రైలర్ ఆద్యంతం జాన్వీకపూర్ సాంప్రదాయ మలయాళీ అమ్మాయిగా తనదైన అందం అభినయంతో ఆకర్షించింది. ఉత్తరాది అబ్బాయిగా సిద్ధార్థ్ స్మార్ట్ గా కనిపించాడు. అతడి ఛామింగ్ లుక్స్ జాన్వీతో రొమాన్స్ ఆకట్టుకుంటున్నాయి. ఇంతకుముందు విడుదలైన పరమ్ సుందరి పాట ఆకట్టుకుంది. జాన్వీ చీరకట్టులో ఎంతో అందంగా కనిపిస్తోంది. లాల్ కలర్ అనే పాట ఓకే అనిపించింది. అయితే తాజాగా విడుదలైన ట్రైలర్ జస్ట్ యావరేజ్ అనే టాక్ తెచ్చుకుంది. ఈ సినిమాలో కేరళ సుందరి అయిన జాన్వీ రజనీకాంత్, అల్లు అర్జున్, యష్ లాంటి స్టార్ల రిఫరెన్సులతో డైలాగులు చెబుతుండడం అన్ని ప్రాంతాల ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా అప్పీల్ కోసం ఈ డైలాగుల్ని కూడా దర్శకుడు తెలివిగా జోడించాడని భావించవచ్చు. కొన్ని వరుస ఫ్లాపుల తర్వాత జాన్వీ, సిధ్ ఇద్దరికీ ఇది కీలకమైన సినిమా. మడోక్ ఫిలింస్ గోల్డెన్ హ్యాండ్ వర్కవుటైతే, ఇది ఆ ఇద్దరికీ మంచి విజయాన్ని అందిస్తుందని ఆశిద్దాం.

# రష్మిక ది రెబల్



ప్రతిభను ఎవరూ ఆపలేరు.. ప్రతిభావంతుల ఎదుగుదలకు ఎదురేలేదు. ఈ కోవకే చెందుతుంది రష్మిక మందన్న. కన్నడ సినిమాలో చిన్నగా మొదలై టాలీవుడ్ లో అగ్ర నాయికగా ఎదిగి, ఇప్పుడు బాలీవుడ్ లో లక్కీ ఛామ్ గా ఏల్తోంది. వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ సక్సెస్ ని కేరాఫ్ గా మార్చుకున్న ఈ బ్యూటీ ఏం చేసినా అది ట్రెండ్ గా మారుతోంది. ఇప్పుడు రష్మిక మందన్న కొత్త లుక్ సంథింగ్ స్పెషల్ గా వెబ్ లో దూసుకెళుతోంది. లెదర్ సోఫా.. పచ్చ-నలుపు రంగు ఫుల్ స్లీవ్స్ టీషర్ట్, దానిపై స్టైలిష్ కోట్, లేస్ ముడి వేయని వైట్ షూస్ ని ధరించి రియల్ రెబల్ ని తలపిస్తోంది. అందంలోనే కాదు ఫ్యాషన్ సెన్స్ లోను తనను కొట్టేవాళ్లే లేరని రష్మిక నిరూపిస్తోంది. బాలీవుడ్ టు టాలీవుడ్ నటవారసులు ఎందరు ఉన్నా వీళ్లెవరూ తన ముందు నిలబడలేరు! అని సవాల్ విసురుతోంది. బాలీవుడ్ లో జాన్వీకపూర్, ఖుషి కపూర్, సుహానా ఖాన్, అనన్య పాండే, సారా అలీఖాన్ .. ఇలా చాలా మంది నటవారసురాళ్లు ఉన్నారు. కానీ వీళ్లలో ఎవరికీ లేని స్టార్ డమ్ రష్మిక మందన్నకు ఉంది. అందానికి అందం, అభినయం, సక్సెస్, అదృష్టం అన్ని కోణాల్లో రష్మికకు ఎదురే లేదు. ఇప్పుడు ఫ్యాషన్ సెన్స్ లోను వీళ్లెవరూ తన ముందు దిగదుడుపేనని నిరూపించే పనిలో ఉంది. రష్మిక ఇటీవల కుబేర చిత్రంలో నటించింది. తదుపరి థామ, ది గర్ల్ ఫ్రెండ్ అనే చిత్రాల్లో నటించింది. ఇవన్నీ విడుదలకు రావాల్సి ఉంది.

# షాలిని కంబ్యాక్ ఎప్పుడు..?

అర్జున్ రెడ్డి సినిమాతో సక్సెస్ కొట్టిన విజయ్ దేవరకొండ మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. ఐతే ఆ సినిమాలో హీరోయిన్ గా నటించిన షాలిని పాండే మాత్రం కెరీర్ లో సక్సెస్ అవ్వలేకపోయింది. షాలిని తెలుగులో కొన్ని సినిమాలు చేసినా ఆమెకు అంతగా క్రేజ్ రాలేదు. కాస్త బొద్దుగా మారడం సమస్య అయ్యిందని గుర్తించిన ఆమె స్లిమ్ గా మారి షాక్ ఇచ్చింది. ఐతే అలా మారినా కూడా అమ్మడికి ఛాన్స్ లు రావట్లేదు. షాలిని కంబ్యాక్ ఎప్పుడు ఇస్తుందా అని ఆమెని ఇష్టపడే ఆడియన్స్ ఎదురుచూస్తున్నారు. అటు కోలీవుడ్, బాలీవుడ్ లో అమ్మడు చేసిన ప్రయత్నాలు కూడా వర్క్ అవుట్ కాలేదు. ముఖ్యంగా బాలీవుడ్ లో ఎలాంటి సినిమా అయినా, పాత్ర అయినా చేస్తూ వస్తుంది షాలిని కానీ ఎందుకో ఆమెకు అక్కడ లక్ కలిసి రావట్లేదు. టాలీవుడ్ పై



స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తుంది షాలిని. ఇక్కడ డైరెక్టర్స్ తో రెగ్యులర్ టచ్ లో ఉంటుందని టాక్. పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు సినిమాలు చేస్తున్న హంగామా తెలిసిందే. అందుకే షాలిని ఇక్కడ మళ్లీ ఫాం లోకి రావాలని, వరుస ఆఫర్లు అందుకోవాలని ట్రై చేస్తుంది. షాలిని పాండే తిరిగి సినిమా అవకాశాలు అందుకుంటే మాత్రం ఆమె ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే. పుష్ప లో శ్రీవల్లి ఛాన్స్ కోసమే షాలిని స్లిమ్ గా మారిందన్న టాక్ సోషల్ మీడియాలో నడుస్తుంది. ఆ వార్తల్లో నిజం ఎంతో తెలియదు కానీ పుష్ప శ్రీవల్లి ఛాన్స్ షాలిని అందుకుని ఉంటే సినిమా వల్ల ఆమెకు డబుల్ క్రేజ్ ఏర్పడేది. కానీ శ్రీవల్లిగా రష్మిక కూడా అదరగొట్టేసిన విషయం తెలిసిందే.సినిమాల్లో ఛాన్స్ లు రావడం అనేది చాలా కష్టం. హిట్ ఫాం లో ఉంటే ఏమో కానీ ఫ్లాపులు పడ్డాక తిరిగి అవకాశాలు దక్కించుకోవడం కష్టమే. సినిమాలు చేస్తూ ఫోటో షూట్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది షాలిని. మళ్లీ విజయ్ దేవరకొండ లాంటి హీరో సినిమాల్లో నటిస్తే కానీ షాలిని తిరిగి ఫాం లోకి వచ్చే అవకాశం ఉండదు. ఐతే విజయ్ షాలిని కాంబో సినిమా వచ్చే ఛాన్స్ ఉందా.. అర్జున్ రెడ్డి కాంబినేషన్ రిపీట్ చేస్తే ఆడియన్స్ చూస్తారా అన్నది తెలియాల్సి ఉంది. షాలిని పాండే మాత్రం ఏమాత్రం ఫోకస్ షిఫ్ట్ అవ్వకుండా టాలీవుడ్ లో ఛాన్స్ ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

# కాజల్ వల్ల సాయి పల్లవిపై మరోసారి ట్రోలింగ్!

సాయి పల్లవి టాలెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సాయి పల్లవి ఏదైనా ఒక పాత్ర చేస్తున్నారంటే ఆ పాత్రకు ప్రాణం పోయడం ఖాయం. ఇంకా చెప్పాలంటే హీరోయిన్ కు అందం ముఖ్యమైనది కాదని, యాక్టింగ్ తో గ్లామర్ ను కూడా డామినేట్ చేయొచ్చని సాయి పల్లవి నిరూపించారు. ఇప్పటికే సాయి పల్లవి ఎన్నో సినిమాల్లో గుర్తుండిపోయే పాత్రలు చేసి మెప్పించారు. ఇక అసలు విషయానికొస్తే సాయి పల్లవి ప్రస్తుతం నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న బాలీవుడ్ రామాయణలో సీత పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఎప్పుడైతే సాయి పల్లవిని సీత పాత్ర కోసం ఎంపిక చేశారో అప్పట్నుంచి ఆమె పేరు సోషల్ మీడియాలో తెగ వినిపిస్తోంది. అయితే సాయి పల్లవి సీత పాత్రను పోషించడం కొందరు స్వాగతిస్తుంటే మరికొందరు మాత్రం సాయి పల్లవి సీత పాత్ర చేయడం కన్విన్సింగ్ గా లేదని దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. వాల్మీకి రాసిన రామాయణంలో సీతను ఎంతో గొప్పగా వర్ణించారని, వాల్మీకి ప్రకారం సీత ఎంతో అందమైన ప్రతిరూపమని, సీతను ఆకాశంలో ఉండే చంద్రకాంతితో పోల్చడంతో పాటూ భూమి ుంచి జన్మించిన లక్ష్మి అంటారని, అలాంటి సౌందర్యవతి సీతను అందం విషయంలో సాయి పల్లవి ఏ మాత్రం మ్యాచ్ చేయలేరని అందరూ



కామెంట్స్ చేస్తున్నారు. నితేష్ తివారీ క్యాస్టింగ్ విషయంలో చాలా బ్లండర్ చేశారని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్ ను తీసుకోవడం నెటిజన్ల డిస్కషన్స్ కు మరింత ఆజ్యం పోస్తుంది. రావణాసురుడిగా నటించిన యష్, సీత పాత్రలో కనిపించే సాయి పల్లవి అందం కోసం, మండోదరిగా కనిపించే కాజల్ ను ఎందుకు వదులుకుంటారని ప్రశ్నిస్తూ విమర్శలు చేస్తున్నారు. అయితే కొందరు సాయి పల్లవిని విమర్శిస్తున్నప్పటికీ మరికొందరు ఆమెకు ఈ విషయంలో మద్దతిస్తున్నారు. సీత పాత్రకు సాయి పల్లవి కేవలం అందంతోనే కాకుండా ఆమె నటనతో ప్రాణం పోస్తారని, ఎమోషనల్ గా సాయి పల్లవి ఆ పాత్రను అందరికీ కనెక్ట్ అయ్యేలా చేస్తారని తమ వాదనలను వినిపిస్తున్నారు. తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్ తో సాయి పల్లవి ఇప్పటికే నటిగా తానేంటో ప్రూవ్ చేసుకున్నారని ఇప్పుడు సీత పాత్రలో అందరినీ మెప్పించి నటిగా మరో మెట్టు ఎక్కుతారని పేర్కొంటున్నారు. ఎంతో అనుభవమున్న డైరెక్టర్ నితేష్ తివారీ ఇలాంటివేవీ ఆలోచించకుండానే సీత పాత్రకు ఆమెను సెలెక్ట్ చేయరు కదా అని సాయి పల్లవిని సపోర్ట్ చేస్తూ విమర్శకులను ప్రశిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, రావణుడిగా యష్, హనుమంతుడిగా సన్నీడియోల్ నటిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతుండగా, మొదటి భాగం ఈ దీపావళికి, రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రిలీజ్ కానున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536